


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 258

శనివారం 9-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

డాక్టర్

ఎవరికీ చెప్పకోలేని వేదన, భావోద్వేగాల ఒత్తిడి శరీరం మీద పడుతుంది. చాలావరకు ఆరోగ్య సమస్యలు మందులతో నయం కావచ్చు. కానీ, కొన్నింటికీ ఎంతకీ పరిష్కారం దొరకకపోతే, అందుకు మూల కారణమేంటో తెలుసుకోవడానికి తగిన శోధన అవసరం. వర్టిగో (కళ్లు తిరగడం) సమస్యకు మూల కారణమేంటో తెలుసుకుంటూ చికిత్స చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న హైదరాబాద్ వాసి న్యూరటాలజిస్ట్ డాక్టర్ లాస్య సాయి సింధుకు కేంద్రప్రభుత్వం ఇటీవల 'నేషనల్ అచీవర్స్ అవార్డ్ ఫర్ హెల్త్ ఎక్సలెన్స్' అవార్డును ఇచ్చి సత్కరించింది. ఈ సందర్భంగా లాస్య సాయి సింధును సాక్షి పలకరించింది.



సమస్యను గుర్తించడమే అసలైన మందు

నలభైఏళ్లకు పైబడిన ఒక మహిళ... 'మంచం మీద పడుకుంటే కళ్లు తిరుగుతున్నాయి' అనే సమస్యతో వచ్చింది. రెండేళ్లుగా ఈ సమస్యతో బాధపడుతూ మంచం మీద కాకుండా కుర్చీలో కూర్చుని నిద్రపోవడం అలవాటు చేసుకుంది. పూర్తి చికిత్స తర్వాత ఇప్పుడు మామూలుగా మంచం మీద నిద్రపోగలుగుతోంది. 90 శాతం మహిళలు భావోద్వేగాల ఒత్తిడిని ఎదుర్కొంటూ ఉంటారు.

* * *

పదిహేనేళ్ల అబ్బాయి స్కూల్లో బెంచి మీద కూర్చున్న కాసేపటికి కళ్లు తిరిగే సమస్యతో బాధపడుతూ సరిగా చదవలేకపోతున్నాడు. చికిత్సలో అతనికి చదువుకు సంబంధించిన సమస్యనే కాదు, ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్య ఉండే విభేదాలు కూడా కారణమని తెలిసింది.

* * *

పనిలో చురుకుగా ఉండే యాభైఏళ్ల వ్యక్తి రెండు నెలలుగా కళ్లు తిరుగుతున్నాయన్న సమస్యను ఎదుర్కొంటూ పరిష్కారం కోసం వచ్చారు. కరోనా తర్వాత వైరల్ అటాక్ అతని మెదడు పనితీరులో సమస్యకు కారణం అయ్యిందని తేలింది.

ఇలాంటివెన్నో ప్రతిరోజూ చూస్తుంటాం. నేను ఈఎన్‌టీ సర్జన్‌ని. వెర్టిగో అండ్ బ్యాలెన్స్ డిజార్డర్‌లో పరిశోధన చేశాను. ఈఎన్‌టీలోనే మరింత ఉన్నతమైన విద్యార్హత ఈ న్యూరటాలజిస్ట్. 200 మంది వర్టిగో పేషెంట్స్‌పై పరిశోధన చేసినప్పుడు నాకు ఈ విభాగంలో ఆసక్తి పెరిగింది. నాలుగేళ్లుగా న్యూరటాలజిస్ట్‌గా వైద్య రంగంలో సేవలందిస్తున్నాను. చేస్తున్న కృషికి గుర్తింపుతోపాటు గతంలోనూ రెండు జాతీయస్థాయి అవార్డులు అందుకున్నాను.

వచ్చిన రివ్యూస్...

ఈ సమస్యలో ప్రధానంగా మానసిక ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. అందుకని, 5–10 నిమిషాల్లో పేషెంట్ పూర్తి సమస్య అర్థం కాదు. ఈ గంట సమయంలో చేసిన చికిత్సకు రోగిలో సరైన మార్పులు రావడం, వారు ఇచ్చే రివ్యూస్.. మంచి గుర్తింపును తీసుకు వచ్చాయి.

అన్ని వర్గాల్లోనూ...

ఇటీవల చూస్తున్న కేసుల్లో మగవారిలోనూ సమస్య ఎక్కువ గమనిస్తున్నాం. నిజానికి ఆడవాళ్లలోనే స్ట్రెస్ ఎక్కువ ఉంటుంది అనుకుంటాం. కానీ, మగవారు తమ సమస్యలను బయటకు చెప్పుకోరు. భావోద్వేగాలను బయటకు వెలిబుచ్చరు. ఈ సమస్య వర్టిగోకు దారితీస్తుంది. మరో ఆందోళనకర సమస్య ఏంటంటే.. టీనేజ్ పిల్లల్లో వర్టిగో కనిపిస్తోంది. మానసికంగా వారు ఎక్కువ ఒత్తిడికి లోనవుతున్నారు. వీరిలో చదువుకు సంబంధించినవి, కుటుంబ సమస్యలు... కూడా మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ముందు పేషెంట్‌కు సంబంధించిన అన్నిరకాల టెస్ట్ రిపోర్ట్స్ పరిశీలించి చూస్తాం, వారు చెప్పిన ఆరోగ్య సమస్యమీద వర్క్ చేస్తాం. ఆ తర్వాత ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తాం. వైరల్ ఇన్ఫెక్షన్స్ వల్ల కూడా వర్టిగో సమస్యలు పెరిగాయి కాబట్టి ఫిజికల్ హెల్త్ ఆ తర్వాత ఎమోషనల్ హెల్త్ కూడా చూస్తున్నాం. కుటుంబం కూడా ఈ సమస్య పట్ల అవగాహన పెంచుకొని, పేషెంట్‌కు సపోర్ట్‌గా ఉండాలి.

ఆన్‌లైన్ అవగాహన

కాన్ఫరెన్స్, సోషల్‌మీడియా ద్వారా కూడా అవేర్‌నెస్ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. విదేశాల నుంచి కూడా ఆన్‌లైన్ కన్సల్టేషన్ తీసుకునేవారున్నారు. ముఖ్యంగా విదేశాలలో ఎమ్మెస్ చేసేవాళ్లు ఉంటున్నారు. జీవితంలో ఎవరికి తగ్గ సమస్య వారికి ఉంటుంది. దానినుంచి బయటకు రావడమే ముఖ్యం. అందుకోసం చేసే ప్రయత్నం ప్రతిరోజూ ఉంటుంది. డాక్టర్‌గా రోజు చివరలో నా నుంచి చికిత్స తీసుకున్నవాళ్లు 'మా సమస్యకు సరైన పరిష్కారం దొరికింది' అనుకుంటే చాలు. అదే పెద్ద అవార్డ్' అంటారు ఈ డాక్టర్.

– నిర్మలారెడ్డి



కోవిడ్ తర్వాత...

'కళ్లు తిరుగుతున్నాయి..' అనే సమస్యతో వచ్చే వారి సంఖ్య కోవిడ్ తర్వాత బాగా పెరిగింది. గతంలో ఒత్తిడి, భావోద్వేగాలలో మార్పు కారణం అనుకునేవాళ్లం. ఆ తర్వాత వైరల్ ఇన్ఫెక్షన్ కూడా కారణం అని తెలిసింది. వర్టిగో సమస్యకు టాబ్లెట్స్ ఇస్తారు డాక్టర్లు. టాబ్లెట్లు వాడినప్పుడు బాగానే ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ మామూలే! దీనికి టాబ్లెట్స్‌తోపాటు కౌన్సెలింగ్, కొన్ని ఎక్సర్‌సైజ్‌లు కూడా అవసరం అని గమనించాను. ఒక పేషెంట్‌కి ఇచ్చే చికిత్స 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతుంది. వారంలో మూడుసార్లు ఈ సెషన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.

– డాక్టర్ లాస్య సాయి సింధు

వంట- విముక్తి

పదికి నలుగురు



పది కుటుంబాలకు నలుగురు వండి పెడతారు. రోజూ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ వండీ వండీ వండీ అలసిపోయేవారూ ఉద్యోగాల వల్ల టైమ్ లేని వారు డబ్బు ఆదా చేయాలనుకుంటున్నవారు ఇదేదో బాగుందే అనుకుంటున్నవారు కేరళలో కమ్యూనిటీ కిచెన్స్‌ను ప్రోత్సహిస్తున్నారు. అంటే పది కుటుంబాలు కలిసి ఓ నలుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఆ మహిళలు ఆ పది కుటుంబాలకు వంట చేసి పంపిస్తున్నారు. ఇది రోజు రోజుకూ పెరుగుతున్న ట్రెండ్.

'ప్లాన్ చేస్తే పోయేదేమీ లేదు వంట చేసే బాధ తప్ప' అంటున్నారు కేరళ వాసులు. 'వంట గది వద్దు. వంట మీద ఆదాయం ముద్దు' అనే నినాదం కూడా ఇస్తున్నారు. ఇదంతా గత ఒకటి రెండేళ్లలో జరిగిన మార్పు. కేరళలోని 'పొన్నాని' అనే టౌన్‌లో ఇద్దరు స్నేహితుల కుటుంబాలకు వచ్చిన ఆలోచన 'సహకరణ కిచెన్' (కమ్యూనిటీ కిచెన్) ఉద్యమానికి కారణం అయ్యింది.

వంట చేసి పెడతారా?

పొన్నానిలో రమేష్ వలియిల్ అనే బ్యాంక్ ఎంప్లాయే రోజూ వంట కోసం భార్య పడే బాధలు చూసేవాడు. ఉదయాన్నే ఆమె బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు లంచ్ వండి బాక్స్ కట్టివ్వాల్సి వచ్చేది. కొన్నాళ్లకు ఆమె జబ్బు పడింది. డాక్టర్లు వంట చేయవద్దన్నారు. ఏం చేయాలో రమేష్‌కు పాలుపోలేదు. మరోవైపు అదే ఊళ్లో ఉన్న కలీముద్దీన్, అతని భార్య మాజిద అడ్వకేట్లు. ఉదయాన్నే ఇంటికొచ్చే క్లయింట్లను చూసుకోవాలా వంట గొడవలో ఉండాలా అనేది సమస్య అయ్యింది. ఈ కుటుంబాలు రెండూ ఫ్యామిలీ ఫ్రెండ్స్ కనుక తమకెవరైనా వండిపెట్టే వాళ్లుంటే బాగుండు అనుకున్నారు. అది కూడా ఇంటికొచ్చి కాదు. ఎక్కడైనా వండి పెట్టి అందించే వారు కావాలి. అందుకని వారే ఇద్దరు స్త్రీలను వెతికారు. వారికోసమని ఒక ఖాళీ స్థలం వెతికి షెడ్ వేశారు. తమ కుటుంబాలతో పాటు మరో ఎనిమిది కుటుంబాలను కలిపారు. మొత్తం పది కుటుంబాల కోసం అలా కమ్యూనిటీ కిచెన్ మొదలయ్యింది. వంట బాధ నుంచి పెద్ద ఉపశమనం లభించింది.



మొదటి రోజే మెను

రోజూ ఉదయాన్నే 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ తయారయ్యి ఈ పది కుటుంబాల గడపలకు చేరేవి. వంట చేసే మనుషులకు ఇలా చేరవేసే మనుషులు తోడయ్యారు. వంట ఖర్చు అన్ని కుటుంబాలు సమానంగా పంచుకున్నా నెలకు వంట చేసి పెట్టేవారికి మంచి గిట్టుబాటుగానే ఉంది. కాకుంటే వీళ్లు ఉదయాన్నే నాలుగ్గంటలకంతా లేచి వంట మొదలుపెట్టాలి. మెనూ వాట్సాప్ గ్రూప్‌లో మొదటిరోజు పోస్ట్ అవుతుంది. బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీ, పూరి, పుట్టు, ఆపమ్, ఉప్మా లాంటివి ఉంటాయి. భోజనంలో నాలుగు రకాల కూరలు చికెన్, ఫిష్ ఉంటాయి. ఈ కుటుంబాల వాళ్లు ఫోన్లు చేసి వాట్సప్ కాల్స్ చేసి వంటను అజమాయిషీ చేస్తారు. మసాలాలు ఏవి వేయాలో చెప్తారు. అంతా ఆరోగ్యకరమైన తిండి లభించేలా చూస్తారు.

లాభాలు ఎన్నో

వంట తప్పితే మొదట చాలా టైము అందరి దగ్గరా మిగులుతోంది. 'ఇంతకుముందు పిల్లలు స్పెషల్‌గా ఏదైనా చేసిపెట్టమంటే రోజువారి వంటతో ఓపిక లేక చేసేదాన్ని కాదు. ఇప్పుడు చేసి పెడుతున్నాను' అని ఒక తల్లి చెప్పింది. 'పది ఇళ్ల వంట వల్ల అయ్యే ఇంధనం, వచ్చే చెత్త కంటే కమ్యూనిటీ కిచెన్ వల్ల అయ్యే ఇంధనం, మిగిలే చెత్త తక్కువ. డబ్బు ఆదా అవుతుంది కూడా' అంది మరో గృహిణి. అదీగాక దీనివల్ల మరో నలుగురికి పని దొరకడం మంచి విషయంగానే చూస్తున్నారు.

ఊరూరా వ్యాపించాయి

మలబార్ జిల్లాలోని పొన్నాని నుంచి మొదలైన ఈ ట్రెండ్ ఆ వెంటనే పక్క జిల్లా అయిన కోళికోడ్‌కు వ్యాపించింది. ప్రస్తుతం మలప్పురం, బలుస్సేరి, కన్నూర్, చెవరంబలమ్... ఇలా ఒక్కో ఊరిలో కమ్యూనిటీ కిచెన్‌లు వెలుస్తున్నాయి. సూత్రం ఒకటే– నలుగురు కలిసి కిచెన్ నడుపుతారు. కేవలం పది లేదా 11 కుటుంబాలకు వండుతారు. ఈ సంఖ్య వల్ల పెద్ద పెద్ద వంటపాత్రలు, భారీ పొయ్యి, ఎక్కువ శ్రమ, సిబ్బంది అవసరం తప్పుతోంది. ఇద్దరు ముగ్గురు గృహిణులు కలిసి తమ ఇళ్లలోనే వండి బాక్సులు పంపిస్తున్నారు. ఇవి సక్సెస్ అవుతున్నాయి కూడా!

మహిళలే... వండాలా?

ఈ కిచెన్‌ల మీద ఒకటి రెండు విమర్శలు ఉన్నాయి. అవేమిటంటే 'కమ్యూనిటీ కిచెన్స్‌లో కూడా ఆడవాళ్లే వండాలా' అని ప్రగతివాదులు అంటుంటే 'ఇంట్లో వంట మానేసి ఈ వేషాలా' అని మగ దురహంకారులు అంటున్నారు. విమర్శలు ఎలా ఉన్నా ఏదో ఒకరోజు ఇళ్లలో వంట చేయడం కంటే ఇలాంటి కిచెన్‌ల మీద అందరూ ఆధారపడే రోజు తప్పక వస్తుంది. మంచిదే.

బ్యూటిప్స్



పండులాంటి నిగారింపు



- పుచ్చకాయ రసాన్ని ముఖానికి రాసుకుని ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. ఇది చర్మానికి టోనర్‌గా పనిచేసి, పొడిబారడాన్ని తగ్గిస్తుంది.
- అరటి, యాపిల్, బొప్పాయి, నారింజ పళ్ల గుజ్జును సమపాళ్లల్లో తీసుకుని పేస్టు చేయాలి. ఈపేస్టుని ముఖానికి పూతలా వేయాలి. అర గంట తరవాత కడిగేయాలి. ఈ ప్యాక్ ముఖం మీద పేరుకుపోయిన మృతకణాలు, ట్యాన్‌ను తొలగించి కాంతిమంతంగా మారుస్తుంది.

మహిళా శక్తి

క్వీన్ ఆఫ్ స్టీల్

పెద్ద బాధ్యతను స్వీకరించినప్పుడు గర్వించదగిన క్షణాలు మాత్రమే ఉండవు.

పెద్ద పెద్ద సవాళ్లు కాచుకొని కూర్చుంటాయి. భయపెడతాయి.

ఆ సవాళ్లకు భయపడితే అపజయం మాత్రమే మిగులుతుంది.

వాటిని ఎదుర్కొనే ధైర్యం ఉంటే విజయం సొంతం అవుతుంది.

ఇంజినీరింగ్ చదివే రోజుల నుంచి ఉక్కు పరిశ్రమలోకి అడుగు పెట్టే వరకు, ఉద్యోగ ప్రస్థానంలో రకరకాల సవాళ్లను ఎదుర్కొంది సోమా మండల్. వాటిని అధిగమించి అపురూపమైన విజయాలను సొంతం చేసుకుంది.

తాజాగా...

ఫోర్బ్స్ 'వరల్డ్స్ మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్-2023' జాబితాలో చోటు సంపాదించింది.

భువనేశ్వర్‌లోని ఓ బెంగాలీ మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది సోమా మండల్. తండ్రి అగ్రికల్చర్ ఎకానమిస్ట్. అప్పట్లో చాలామంది తల్లిదండ్రుల ధోరణి 'ఆడపిల్లలను ఒక స్థాయి వరకు చదివిస్తే చాలు. పెద్ద చదువు అక్కర్లేదు' అన్నట్లుగా ఉండేది. సోమా తండ్రిలో మాత్రం అలాంటి భావన లేదు.

'మా అమ్మాయిని పెద్ద చదువులు చదివిస్తాను' అనేవాడు.

అలాంటి వ్యక్తి కాస్తా సోమా ఇంజనీరింగ్ చేయాలనుకున్నప్పుడు 'కుదరదు' అని గట్టిగా చెప్పాడు. ఎందుకంటే ఆరోజుల్లో అమ్మాయిలు ఇంజినీరింగ్ చదవడం అరుదు. తల్లి సహాయంతో నాన్న మనసు మారేలా చేసింది. రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చేసింది.

ఇక కాలేజీ రోజుల విషయానికి వస్తే బ్యాచ్‌లో రెండు వందల మంది ఉంటే ఇద్దరు మాత్రమే అమ్మాయిలు. పాఠం వింటున్నప్పుడు ఏదైనా సందేహం అడగాలంటే అబ్బాయిలు నవ్వుతారేమోనని భయపడేది. అయితే ఒకానొక సమయంలో మాత్రం...

'అబ్బాయిలు, అమ్మాయిలు ఒకే చదువు చదువుతున్నప్పుడు భయపడటం ఎందుకు?' అని తనకు తానే ధైర్యం చెప్పుకుంది...

ఇక అప్పటి నుంచి ఎప్పుడూ ధైర్యం కోల్పోలేదు. ఆ ధైర్యమే తన భవిష్యత్ విజయాలకు పునాదిగా నిలిచింది.

సోమా మెటల్ ఇండస్ట్రీలో అడుగు పెట్టినప్పుడు మహిళా ఉద్యోగులు ఎక్కువగా లేరు. 'మెటల్ ఇండస్ట్రీ అంటే పురుషుల ప్రపంచం' అన్నట్లుగా ఉండేది. ఇక మహిళలు ఉన్నత స్థానాల్లోకి రావడం అనేది ఊహకు కూడా అందని విషయం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ఎప్పుడూ భవిష్యత్‌పై ఆశను కోల్పోలేదు సోమా మండల్.

నాల్కో(నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్)లోకి గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీగా అడుగుపెట్టి ఒక్కో మెట్టు ఎక్కుతూ తొలి మహిళా డైరెక్టర్(కమర్షియల్) స్థాయికి చేరింది. 2017లో సెయిల్(స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా)లోకి వచ్చిన తరువాత ఫస్ట్ ఉమెన్ ఫంక్షనల్ డైరెక్టర్, ఫస్ట్ ఉమెన్ చైర్‌పర్సన్ ఆఫ్ సెయిల్‌గా ప్రత్యేక గుర్తింపు పొందింది.



● సోమా మండల్



● అధికారులతో...

సెయిల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాలంలో ఆ సంస్థ వేల కోట్ల అప్పులతో ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మార్కెటింగ్ ఆర్గనైజేషన్ స్ట్రక్చర్‌లో మార్పులు తీసుకువచ్చింది. మైక్రో–మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించింది. సెయిల్ ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి మార్గాలు అన్వేషించింది. గ్రామీణ ప్రాంతాలలో వర్క్‌షాప్‌లు నిర్వహించింది. కొత్త వ్యాపార వ్యూహాలను అనుసరించింది.

సోమా కృషి వృథా పోలేదు.

అప్పులు తగ్గించుకుంటూ 'సెయిల్'ను లాభాల దిశగా నడిపించింది.

'నా కెరీర్‌లో జెండర్ అనేది ఎప్పుడూ అవరోధం కాలేదు. మహిళ అయినందుకు గర్వపడుతున్నాను. మన దేశంలో వివిధ రంగాలలో మహిళా నాయకుల సంఖ్య పెరుగుతోంది. లీడర్‌కు అసంతృప్తి ఉండకూడదు. ఆశాభావం ఉండాలి. పరిమిత వనరులు ఉన్నా సరే మంచి ఫలితం సాధించే సామర్థ్యం ఉండాలి' అంటుంది సోమా మండల్.

టైమ్ మేనేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చే సోమా మండల్ అటు వృత్తి జీవితాన్ని, ఇటు వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లింది.

'సక్సెస్‌కు షార్ట్‌కట్ అనేది లేదు. అంకిత భావం, సమర్థత మాత్రమే మనల్ని విజయానికి దగ్గర చేస్తాయి' అంటుంది సోమా మండల్.



క్లీన్ హెల్ప్

మనకు దండిగా డబ్బులుంటే ఇతరులకు దానం గానీ, సాయం గానీ చేయగలుగుతాం కానీ మనకే లేనప్పుడు ఇతరులకు ఏం సాయం చేయగలుగుతాం అని నిష్టూరాలు పోతుంటాము. లోగనాథన్ మాత్రం అలాంటి వ్యక్తికాదు. తన దగ్గర డబ్బులు లేకపోయినా సాయం చేయాలనుకున్నాడు. ఇందుకు కావలసిన డబ్బు కోసం టాయిలెట్స్‌ను శుభ్రం చేయడానికి కూడా వెనకాడటం లేదు లోగనాథన్. అలా వచ్చిన కొద్దిమొత్తాన్ని కూడా నిరుపేద పిల్లల చదువుకోసం ఖర్చు పెడుతున్నాడు. ఈ విషయం తెలిసి ప్రధాని మోదీ సైతం మన్‌కీ బాత్‌లో లోగనాథన్‌ని ప్రశంసించారు.

కోయంబత్తూరులోని కన్నంపాళయంకు చెందిన 55 ఏళ్ల లోగనాథన్ తల్లిదండ్రులు రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు. ఇంటి పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడంతో ఆరోతరగతితోనే చదువు ఆపేశాడు. తల్లిదండ్రులకు సాయం చేసేందుకు కొబ్బరి బోండాలు అమ్మేవాడు. అలా కొబ్బరిబోండాల దగ్గర ఉన్నప్పుడు లోగనాథన్‌కు.. చిరిగిపోయిన బట్టలు వేసుకుని, చదువుకునే స్థోమత లేక రోడ్ల మీద తిరుగుతున్న పిల్లలు కనిపించేవారు. వారిని చూసి జాలిపడేవాడు. ఇలా చూసి చూసి.. ''పేదరికంతో నాలా మరెవరూ చదువుని మధ్యలో ఆపేయకూడదు. నిరుపేద పిల్లలు చదువు కొనసాగేందుకు చేతనైన సాయం చేయాలి'' అని నిర్ణయించుకున్నాడు. పార్ట్‌టైమ్ పనులు చేస్తూ వచ్చిన డబ్బులను పేద పిల్లలకు ఖర్చుచేయడం మొదలుపెట్టాడు.

టాయిలెట్స్ కడుగుతూ...

కొన్నాళ్లకు లోగనాథన్ తండ్రి చనిపోవడంతో కుటుంబ భారం మొత్తం తనపై పడింది. దాంతో కొబ్బరి బోండాలు అమ్మడంతో పాటు పేపర్‌మిల్‌లో పనికి చేరాడు. అప్పుడు కూడా డబ్బులు సరిపోయేవి కావు. అయినా పేదపిల్లలకు సాయం చేయడం మానలేదు. తనకొచ్చే జీతంలో కొంతమొత్తాన్ని సాయంగా ఇస్తూనే ఉన్నాడు. డబ్బులు చాలనప్పుడు టాయిలెట్స్ క్లీన్ చేసి వచ్చిన డబ్బులను పేద పిల్లలకు ఇస్తున్నాడు. పాతికేళ్లుగా సాయంచేస్తూ పదిహేను వందల మందికిపైగా నిరుపేద పిల్లలకి ప్రాథమిక విద్యను అందించాడు.

సిగ్గుపడకుండా...

వృత్తిపరంగా వెల్డర్ అయిన లోగనాథన్‌కు.. తన ఎనిమిది గంటల డ్యూటీ అయిపోయిన తరువాత ఖాళీ సమయం దొరికేది. వెల్డింగ్ షాపు పక్కనే కొంతమంది శానిటరీ వర్కర్స్‌తో పరిచయం ఏర్పడింది. వాళ్లు టాయిలెట్స్ క్లీన్ చేసి సంపాదిస్తున్నారని తెలుసుకుని, తను కూడా గత పదిహేడేళ్లుగా టాయిలెట్స్ శుభ్రం చేస్తూ నెలకు రెండువేల రూపాయల పైన సంపాదిస్తూ అనాథ ఆశ్రమాలకు విరాళంగా ఇస్తున్నాడు. సంపన్న కుటుంబాల దగ్గర నుంచి పుస్తకాలు, బట్టలు సేకరించి అనాథపిల్లలకు ఇవ్వడం, ఏటా ప్రభుత్వం నిర్వహించే అనాథ ఆశ్రమాలకు పదివేల రూపాయల విరాళంగా ఇవ్వడం వంటి చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు లోగనాథన్.



"నాకు సాయం చేయాలని ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు చిన్నప్పటి నుంచి ప్రతికూలంగానే ఉన్నాయి. ఎలాగైనా సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో నాకు తోచిన విధంగా చేస్తున్నాను. టాయిలెట్స్ కడగడం మొదలు పెట్టిన తరువాత కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు విముఖత వ్యక్తంచేశారు. చాలాసార్లు హేళనకు కూడా గురయ్యాను. అయినా నాకు ఏమాత్రం బాధలేదు. ఏదోఒక విధంగా పేద పిల్లలకు సాయపడుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అన్నీ అనుకూలిస్తే చారిటబుల్ ట్రస్టు పెడతాను".

– లోగనాథన్

ఇంటిప్స్



- కొద్దిగా మెంతిపిండి, కొద్దిగా అన్నం వేసి నానిన బియ్యాన్ని గ్రైండ్ చేస్తే అప్పం మరింత మృదువుగా వస్తుంది.



- ఎంతో తియ్యగా ఉండే అరటిపండ్లపై ఫ్రూట్‌ఫ్లైస్ వాలుతూ చిరాకు పెడుతుంటాయి. అయితే మార్కెట్ నుంచి అరటిపండ్లు తెచ్చిన వెంటనే శుభ్రంగా కడిగి తుడిచి పెట్టుకుంటే ఫ్రూట్‌ఫ్లై ఒకటీ వాలదు.



- అరకప్పు వంటసోడాలో నీళ్లు పోసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని అవెన్‌లో లోపలి భాగంలో రాయాలి. హీటింగ్ కాయిల్స్, ఫ్యాన్ బ్లేడ్స్, లైట్స్ మీద రాయకూడదు. కింద, సైడు గోడలకు రాసి రాత్రంతా ఉంచేయాలి. ఉదయాన్నే కాటన్ వస్త్రంతో వంటసోడాని తుడిచేయాలి. సోడా పూర్తిగా పోయిన తరువాత నీటిలో కలిపిన వెనిగర్‌తో మరోసారి తుడవాలి. ఇలా చేస్తే అవెన్‌లో పేరుకుపోయిన మురికి, అవెన్ గోడలకు పడ్డ మచ్చలూ పోయి కొత్త దానిలా మెరుస్తుంది.



- అంగుళం దాల్చిన చెక్క, నాలుగు లవంగాలు, నాలుగు కర్పూరం బిళ్లలను మెత్తగా దంచి పొడిచేయాలి. ఈ పొడిలో కొద్దిగా నీళ్లు, కొద్దిగా నూనె వేసి ద్రవంలా మార్చాలి. ఈ ద్రవాన్ని ఖాళీ అయిన దోమల రిపెలర్స్, ఆల్ అవుట్ లాంటి డబ్బాల్లో వేసి ప్లగ్‌లో పెట్టి స్విచ్ ఆన్ చేస్తే రూమ్ అంతా సువాసన వస్తుంది. ఇది సహజసిద్ధమైన రూమ్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 258

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

జారిపడ్డ కేసీఆర్.. విరిగిన తుంటి ఎముక



బాత్రూంలోకి వెళ్లే క్రమంలో లుంగీ కాళ్లకు తగలడంతో ప్రమాదం

ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి సోమాజిగూడ యశోదకు హుటాహుటిన తరలింపు

విజయవంతంగా హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించిన వైద్యులు

11లో

తృణమూల్ ఎంపీ మొయిత్రాపై వేటు



దబ్బుకు ప్రశ్నల ఉదంతంలో లోక్‌సభ సభ్యత్వం రద్దు

ఎథిక్స్ కమిటీ నివేదిక ఆధారంగా స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం

- మూజువాణి ఓటుతో సభ ఆమోదం
- తనపై వేటును తీవ్రంగా తప్పుబట్టిన మొయిత్రా
- అనర్హులైన జడ్జీలతో కూడిన కోర్టు ఉరిశిక్ష తీర్పిచ్చినట్లుందని ఎద్దేవా
- మోదీ సర్కారుపై మరో 30 ఏళ్లయినా పోరాడతానని స్పష్టీకరణ

6లో

200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాకు ఏటా.. రూ. 4,008 కోట్లు!

పథకం అమలుకు ఖర్చుపై సీఎం రేవంత్‌కు విద్యుత్ సంస్థల నివేదిక



సంస్థల ఆర్థిక స్థితిగతులపై విద్యుత్ శాఖ అధికారుల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అప్పులు రూ. 81,516 కోట్లు

2014-23 మధ్య రూ. 50,275 కోట్లకు పెరిగిన నష్టాలు

ప్రతి నెలా రూ. 1,300 కోట్లు అప్పులు చెల్లించేందుకే కావాలి

సర్కారు నుంచి రూ. 12,515 కోట్ల ట్రూఅప్ చార్జీల బకాయి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ సరఫరా స్థితిగతులు, విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి, ఆదాయ, వ్యయాలు, అప్పులు, నష్టాల వివరాలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివేదించాయి. విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిపై సమగ్ర నివేదికను కూడా సమర్పించాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీ మేరకు గృహాలకు ప్రతి నెలా 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా చేయడానికి ఏటా రూ.4,008 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసినట్టు తెలిపాయి. సీఎం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సీఎంవో కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్,

మిగతా 2వ పేజీలో ▶

నేటి నుంచే మహిళలకు ఉచిత ప్రయాణం



తొలి వారం రోజులు ఎలాంటి గుర్తింపు కార్డు చూపాల్సిన అవసరం లేదు

- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు హైదరాబాద్ సిటీలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో అనుమతి
- ట్రాన్స్‌జెండర్లకూ అవకాశం
- మధ్యాహ్నం ఒకటిన్నరకు అసెంబ్లీ వద్ద ప్రారంభించనున్న సీఎం రేవంత్
- 2 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు

11లో

కొలువుదీరనున్న కొత్త సభ

- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు
- ప్రొటెమ్ స్పీకర్‌గా ఏఐఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్

11లో

ఏపీలో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల

- 81 పోస్టులు భర్తీ చేయనున్న ఏపీపీఎస్సీ
- జనవరి 1 నుంచి 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

10లో

విన్నపాలు వినవలె..

ప్రజా దర్బార్‌కు పోటెత్తిన జనం
- రోడ్లు, భూములు, వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాల అందజేత
- ప్రజల ఇబ్బందులు విన్న సీఎం రేవంత్
- పరిష్కారానికి చర్యలు తీసుకుంటామంటూ హామీ.. అత్యవసర సమావేశం నిమిత్తం సీఎం వెళ్లడంతో విజ్ఞాపనలు స్వీకరించిన సీతక్క


దివ్యాంగుడి సమస్యను వింటున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మొదటిసారిగా శుక్రవారం ప్రారంభమైన ప్రజాదర్బార్‌కు జన సందోహం వెల్లువెత్తింది. హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి ఫిర్యాదులు పట్టుకొని ప్రజలు ఉదయం 8 గంటల నుంచే ప్రజాభవన్‌కు తరలివచ్చారు. వేలాది మంది రావడంతో బేగంపేటలోని ముఖ్యమంత్రి అధికార నివాస ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఉదయం దాదాపు 10.15 గంటల ప్రాంతంలో అక్కడకు వచ్చారు. మొదటగా దివ్యాంగులకు ప్రాధాన్యం ఇచ్చి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వినతి పత్రాలు స్వీకరించారు. ఇతరుల నుంచి కూడా విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత, ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో ఏం చేయాలో చూడాలని సీఎం అప్పటికప్పుడే అధికారులను ఆదేశించారు. మరికొందరు రోడ్లు, భూములు, ఇతర సమస్యలను ప్రస్తావించారు. గంటసేపున్న సీఎం ప్రతి ఒక్కరి సమస్యలు ఓపిగ్గా విన్నారు. అనంతరం ముఖ్యమంత్రి అత్యవసర సమావేశం నిమిత్తం సచివాలయానికి వెళ్లారు. ఆ తర్వాత మంత్రి సీతక్క ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతిఒక్కరి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. మధ్యాహ్నం మూడున్నర వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. సీఎం వెంట రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమం వారంలో రెండురోజులు నిర్వహించేలా.. శాఖల వారీగా ఫిర్యాదులు స్వీకరించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే దీనికి సీఎం నుంచి ఆమోదం లభించాల్సి ఉంది.

320 సీట్లు .. 15 డెస్కులు .. మౌలిక వసతులు

ప్రజాదర్బార్ నిర్వహణకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. సీఎంఓ కార్యదర్శి శేషాద్రి, డీజీపీ రవిగుప్తా, జలమండలి ఎం.డీ. దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తదితర అధికారులు ప్రజాదర్బార్ నిర్వహణను సమన్వయం చేశారు. సమస్యల నమోదుకు 15 డెస్కులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రతి విజ్ఞాపన పత్రాన్ని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి, ప్రతి విజ్ఞాపనకు ప్రత్యేక గ్రీవెన్స్ నంబర్ ఇచ్చి, ప్రింటెడ్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం, పిటిషన్ దారులకు ఎస్‌ఎంఎస్ ద్వారా కూడా ఎక్ నాలెడ్జ్‌మెంట్ పంపే విధంగా ఏర్పాటు చేశారు. ప్రజలు కూర్చోవడానికి 320 సీట్లను ఏర్పాటు చేశారు. బయట కూడా నీడతో కూడిన క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు.


శుక్రవారం ప్రజా దర్బార్‌కు బారులు తీరిన జనం

హర్షాతిరేకాలు

ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజలు ప్రగతిభవన్ తలుపులు అందరికీ తెరుచుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా ప్రజాదర్బార్ నిర్వహించారంటూ గుర్తు చేసుకున్నారు. గడీల పాలనకు చరమగీతం పాడారంటూ కొందరు పాటలు పాడారు. కొందరు ప్రగతిభవన్ పైకి ఎక్కి అంతా కలియదిరిగారు. పచ్చిక బయలుపై, భవనాల వద్ద పెద్ద ఎత్తున ఫొటోలు దిగారు. సెల్ఫీలు తీసుకున్నారు.

ప్లాట్లు కబ్జా చేశారు

మా అసోసియేషన్‌కు సంబంధించిన ప్లాట్లను కొందరు కబ్జా చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే విచారించారు. దొంగ డాక్యుమెంట్లు పెట్టి కబ్జా చేశారని తేలింది. ఎమ్మార్వోపై చర్య తీసుకోవాలని కూడా నిర్ణయించారు. ఇప్పటివరకు మోక్షం లభించలేదు. నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్నాం. త్వరగా న్యాయం చేయాలని కోరేందుకు వచ్చా.

–దామోదర్‌రెడ్డి, చాణిక్యపురి ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్, నాదర్‌గుల్, రంగారెడ్డి జిల్లా

మా పేరు మీద పట్టా చేయించాలి



మా భూమి మా పేరు మీద పట్టా చేయించాలని ఏళ్లుగా పోరాటం చేస్తున్నా. రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారే తప్ప పట్టా చేయించడం లేదు. ఐదు మందిమి ఉన్నా పట్టాలు ఇవ్వలేదు. లక్షలు ఇవ్వాలంటున్నారు. పేదోళ్లం అంత డబ్బులు ఎలా ఇవ్వగలం?

– గిరన్న, బాలమ్మ, కాశింనగర్ గ్రామం, వనపర్తి జిల్లా

క్లుప్తంగా...

మధ్యప్రదేశ్ బీజేపీ పరిశీలకుడిగా కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల బీజేఎల్పీ నేతలను ఎన్నుకొనేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసేందుకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు కేంద్ర స్థాయి పరిశీలకులను నియమించింది. మధ్యప్రదేశ్‌కు సంబంధించి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్‌తో పాటు హరియాణ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, పార్టీ జాతీయ కార్యదర్శి ఆశా లాక్డాలను నియమించారు. రాజస్తాన్ బీజేఎల్పీ నేతను ఎన్నుకొనేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎంపీ సరోజ్ పాండే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేలను పరిశీలకులుగా నియమించారు. ఛత్తీస్‌గఢ్‌కు కేంద్రమంత్రులు అర్జున్ ముండా, శర్బానంద్ సోనోవాల్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్‌లు పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. ఈ పరిశీలకులు వారికి కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లి అక్కడ బీజేపీ ఎమ్మెల్యేలతో భేటీ అయి వారి నాయకులను ఎంపిక చేయనున్నారు.

ఉద్యమ కేసుల వివరాలివ్వండి
సీపీలు, ఎస్పీలను కోరిన సీఐడీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో నమోదైన కేసులు, ఆయా కేసుల్లో అరెస్టయిన, జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లిన వారి వివరాలను పంపించాలని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లను పోలీస్‌శాఖ కేంద్ర కార్యాలయం కోరింది. ఈ మేరకు సీఐడీ అడిషనల్ డీజీ కార్యాలయం నుంచి శుక్రవారం ఫ్యాక్స్ సందేశం పంపారు. 2009 డిసెంబర్ 9 నుంచి 2014 జూన్ 2 వరకు నమోదైన కేసుల వివరాలను తాము సూచించిన విధానంలో పంపాలని అందులో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై కేసుల సమాచారాన్ని క్రోడీకరించిన తర్వాత పోలీస్‌శాఖ ఆ వివరాలు ప్రభుత్వానికి సమర్పించనుంది.


రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నేత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి కలిసి అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

- దుండిగల్


ఈ సారి సమావేశాల్లో చికెన్ బిర్యానీ, మటన్ కర్రీ, ఫిష్ ఫ్రై, వగైరా వగైరా పెట్టి వాళ్లకు ధీటుగా సమాధానం చెబుతాం!

రూ. 4,008 కోట్లు!


విద్యుత్‌శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, సీఎస్ శాంతికుమారి

▶ మొదటి పేజీ తరువాయి

టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సంస్థల సీఎండీలు జి.రఘుమారెడ్డి, ఎ.గోపాల్‌రావు, జెన్‌కో డైరెక్టర్ అజయ్, ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, నివేదిక ద్వారా వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

బకాయిల కోసం రూ.30,406 కోట్ల అప్పు

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో), తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ(ట్రాన్స్‌కో), టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సంస్థల అప్పులు 2015–15లో రూ.22,423 కోట్లు కాగా, ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి రూ.81,516 కోట్లకు పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కు సంబంధించిన బకాయిలను చెల్లించడానికే టీఎస్ఎస్పీడీసీఎల్, టీఎస్ఎన్పీడీసీఎల్ సంస్థలు ఏకంగా రూ.30,406 కోట్లను స్వల్పకాలిక రుణాలుగా తీసుకున్నాయి. అప్పులు తిరిగి చెల్లించడానికి రెండు విద్యుత్ పంపిణీ సంస్థలకు ప్రతి నెలా రూ.1,300 కోట్లు అవసరం. విద్యుత్ ఎక్స్ఛేంజీల నుంచి అదనపు విద్యుత్ కొనుగోలు కోసం ప్రతి నెలా రూ.500 కోట్లు ఖర్చు అవుతోంది.

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో డిస్కంలు

ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్/టీఎస్ఎస్పీడీసీఎల్)లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నాయి. రాష్ట్ర ఆవిర్భావం (2014–15) నాటి నుంచి 2023–24 వరకు ఈ రెండు సంస్థలు ఏకంగా రూ.50,275 కోట్ల భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. 2014–15లో రూ.3,600 కోట్లు ఉన్న విద్యుత్ సబ్సిడీని క్రమంగా పెంచుకుంటూ 2023–24 నాటికి రూ.11,500 కోట్లకు పెంచారు.

వ్యవసాయానికి 2 విడతల్లో 12 గంటలు..

రాష్ట్రంలో వ్యవసాయానికి ఒక్కో విడతలో 6 గంటలు చొప్పున ప్రతి రోజూ రెండు విడతల్లో మొత్తం 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర విద్యుత్ సరఫరా స్థాపిత లోడ్ సామర్థ్యం 19,475 మెగావాట్లు కాగా, ఇప్పటివరకు 15,497 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని తెలిపారు. గత మార్చి 14న అత్యధికంగా 297.89 మిలియన్ యూనిట్లను సరఫరా చేశామన్నారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల నిర్మాణం పూర్తైతే గరిష్టంగా 16,701 మెగావాట్ల విద్యుత్‌ను సరఫరా చేయాల్సి ఉంటుందని వివరించారు.

వారంలో విద్యుత్‌పై శ్వేతపత్రం

రాష్ట్ర ఆవిర్భావం నాటి (2014–15) కాలంతో పోల్చుతూ 2023–24లో రాష్ట్ర విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో తెలిపేందుకు శ్వేతపత్రాన్ని సిద్ధం చేయాల్సిందిగా సీఎం రేవంత్ ఆదేశించినట్టు తెలిసింది. మరో వారం రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహించి ప్రజలకు దీనిని విడుదల చేస్తామని, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న విద్యుత్ సంస్థలు భవిష్యత్తులో ఎదుర్కోబోయే పరిస్థితులను ప్రజలకు ముందుగానే తెలియజేయాల్సిన అవసరముందని ఆయన చెప్పినట్టు సమాచారం. అయితే రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగరాదని ఆదేశించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

విద్యుత్ సంస్థల నష్టాలకు కారణాలు ఇవే..
- రాష్ట్రంలో 27.99 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లుండగా, వీటికి ఉచితంగా సరఫరా చేస్తున్న విద్యుత్‌కు కచ్చితమైన లెక్కలు లేవు.
- రూ.12,515 కోట్ల ట్రూఅప్ చార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు గత ప్రభుత్వం అనుమతించలేదు. ప్రభుత్వమే వచ్చే ఐదేళ్లలో విడతల వారీగా చెల్లిస్తుందని హామీ ఇచ్చినా ఇప్పటివరకు చెల్లించలేదు.
- క్లీన్ ఎనర్జీ సెస్‌గా టన్ను బొగ్గుపై కేంద్రం రూ.400 వసూలు చేస్తోంది.
- బొగ్గు ధరలు భారీగా పెరగడం, రైలు, రవాణా చార్జీలు పెరగడం.
- ప్రతి నెలా రూ.1,300 కోట్లను స్వల్పకాలిక రుణాలు తిరిగి చెల్లించడానికే ఖర్చు చేయాల్సి వస్తోంది.
- 800 మెగావాట్ల కేటీపీఎస్, 1,080 మెగావాట్ల భద్రాద్రి, 800 మెగావాట్ల ఎన్టీపీసీ వంటి కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంతో విద్యుత్ కొనుగోలు వ్యయం పెరిగింది.
- ఎన్టీపీసీ వంటి కేంద్ర ప్రభుత్వ విద్యుదుత్పత్తి సంస్థలు అధిక ధరతో విదేశీ బొగ్గును దిగుమతి చేసుకుని వాడుతున్నాయి.
- విద్యుత్ ఉద్యోగులకు 2014–15లో 37.5% 2018–19లో 42.5%, 2023–24లో 15% వేతన సవరణ అమలు చేయడంతో జీతాల వ్యయం భారీగా పెరిగింది.

రాష్ట్రంలో రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు నెలవారీగా ఆర్జిస్తున్న ఆదాయం,చేస్తున్న వ్యయాలు, తుదకు ప్రతి నెలా మూటగట్టుకుంటున్న నష్టాలను కింది పట్టికలో చూడవచ్చు.

ఆదాయాలు	రూ.కోట్లు	వ్యయాలు	రూ.కోట్లు
బిల్లుల కలెక్షన్లు	2,800	టీఎస్‌జెన్‌కోకు చెల్లింపులు	1,200
ప్రభుత్వ సబ్సిడీలు	958	కేంద్ర విద్యుదుత్పత్తి కంపెనీలకు చెల్లింపులు	1,605
		ఎక్స్ఛేంజీలకు చెల్లింపులు	500
		ఉప మొత్తం	3,305
		అప్పుల చెల్లింపులు, జీతాలు	1,457
మొత్తం	3,758		4,762

ఆదాయంలో వ్యయం పోగా తుది నష్టాలు రూ.1,004 కోట్లు

రాష్ట్ర ఆవిర్భావం నాటితో పోల్చితే ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ సంస్థల అప్పులు ఎలా ఉన్నాయో ఈ పట్టికలో చూడవచ్చు. (రూ.కోట్లలో)

సంస్థ	2014 జూన్‌కి..	2023 అక్టోబర్ 31 నాటికి..
ట్రాన్స్‌కో	2,411	10,136
జెన్‌కో	7,662	31,923
టీఎస్ఎస్పీడీసీఎల్	8,213	24,041
టీఎస్ఎన్పీడీసీఎల్	4,137	15,416
మొత్తం	22,423	81,516

వచ్చే ఆరు నెలల్లో రూ.11,058 కోట్ల నష్టాలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది మే వరకు రానున్న ఆరు నెలల్లో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల ఆదాయం రూ.22,781 కోట్లు కాగా, వ్యయం రూ.33,839 కోట్లు కానుందని అధికారులు తెలిపారు. అంటే ఆరు నెలల్లో కొత్తగా రూ.11,058 కోట్ల నష్టాలు మూటగట్టుకుంటామని నివేదించారు.

నాకు ఎలాంటి సమాచారం లేదు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ రంగంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే సమీక్షాసమావేశానికి రావాలని తనకు ఎలాంటి సమాచారంలేదని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ సీఎం విద్యుత్ రంగంపై నిర్వహించే సమీక్షకు రమ్మని విద్యుత్‌శాఖ నుంచి కానీ, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కానీ ఎలాంటి సమాచారంరాలేదని తెలిపారు. సీఎం సమావేశానికి పిలుస్తున్నారని చెబితే వెళ్లకుండా ఎందుకు ఉంటానని అన్నారు. తాను మాజీ సీఎండీగా కూడా సీఎం పిలిస్తే వెళ్లి అన్ని విషయాలు వివరించడానికి ఎలాంటి ఇబ్బంది లేదని ప్రభాకర్‌రావు చెప్పారు. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న రుణాలు కేవలం మూలధన వ్యయం(క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) చేసినట్లు ఆయన తెలిపారు. ఎంత మొత్తం వ్యయం చేశామన్నది ఇప్పుడు చెప్పలేనని తెలిపారు. సమీక్షాసమావేశానికి తనను పిలిపించాలని సీఎం ఆదేశించినట్లు కేవలం మీడియా, పత్రికల్లోనే చూశానని, వాటి ఆధారంగా సమావేశానికి వెళ్లలేనని, ఇప్పటికే రాజీనామా చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తన రాజీనామాను ఆమోదించినట్లు కానీ, తిరస్కరించినట్లు కానీ ఎలాంటి సమాచారంలేదని వివరించారు. విద్యుత్ సంస్థల్లో డిమాండ్, సరఫరా, కొనుగోళ్లు అన్ని పారదర్శకంగానే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎం పిలిస్తే వెళ్లకుండా ఎలా ఉంటా: ప్రభాకర్‌రావు

ప్రభుత్వ వ్యవహారాల్లో సహాయకులుగా వ్యవహరించేందుకు ..

సలహాదారుల మండలి?

- ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి యోచన
- సలహామండలికి చైర్మన్‌గా.. లేదంటే ముఖ్య సలహాదారుడిగా కోదండరాం?
- విద్యుత్ శాఖపైనే ప్రధాన గురి.. అవినీతి జరిగితే వెలికి తీయడంతో పాటు కరెంటు లోటుపాట్లను ఎత్తిచూపే వ్యూహం
- అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసే చాన్స్
- ముఖ్యమైన శాఖల ప్రక్షాళన తప్పదన్న చర్చ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సజావుగా సాగే క్రమంలో తనకు సహాయకారులుగా ఉండడానికి వీలుగా సలహాదారులతో కూడిన మండలిని ఏర్పాటు చేసుకునే యోచనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. ఇందుకోసం ఏర్పాటయ్యే సలహామండలికి (అడ్వయిజరీ బోర్డు) చైర్మన్‌గా లేదంటే ముఖ్య సలహాదారుడిగా తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం నియమితులయ్యే అవకాశాలున్నట్లు ప్రభుత్వవర్గాల సమాచారం. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచే కీలక శాఖలపై పట్టు సాధించేపనిలో పడ్డారు. రాష్ట్ర మనుగడలో కీలకమైన ఆర్థికశాఖతో పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్రచర్చకు కారణమైన విద్యుత్, సాగునీటి రంగాలపై ఆయన అధికారులను గుచ్చిగుచ్చి ప్రశ్నలు అడిగారు. కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం రాష్ట్రంలోని కీలకశాఖల్లో ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు త్వరలోనే ప్రక్షాళన జరిగే అవకాశాలున్నాయి.

మలిరోజే విద్యుత్‌శాఖపై సమీక్ష

ప్రభుత్వం కొలువుదీరిన రోజే జరిగిన మంత్రివర్గ సమావేశంలో భాగంగా సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు ప్రభుత్వవర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. కేబినెట్ భేటీలో విద్యుత్ రంగంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన రేవంత్ మరుసటిరోజే ఆ శాఖపై పూర్తిస్థాయిలో సమీక్ష చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం సృష్టించేందుకు ప్రయత్నం జరుగుతోందన్న రేవంత్ వ్యాఖ్యలు ఆ శాఖలో తీవ్రచర్చకు దారితీస్తున్నాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కరెంట్ గురించి గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకునేదని, ఈ నేపథ్యంలోనే కరెంటు ప్రగతికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పాలనే ఆలోచనలతోనే సీఎం ఆ శాఖను టార్గెట్ చేశారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిన్నటివరకు కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ నుంచి ఐదేళ్లుగా కరెంట్‌ను తీసుకున్నారని, బహిరంగమార్కెట్‌లో అధిక రేటుకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని లెక్కలతో సహా వెల్లడించారు. ఒకవేళ కరెంట్ కొనుగోలులో అవినీతి జరిగి ఉంటే దానిని కూడా ప్రజల ముందు ఉంచేందుకే రేవంత్ సిద్ధమవుతున్నారని అధికార పార్టీ నేతలు అంటున్నారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లుగా చేసిన ఖర్చులు, రాబడులకు సంబంధించిన వివరాలు సిద్ధం చేయాలని ఆర్థికశాఖ అధికారులకు తొలి కేబినెట్ భేటీలోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన రేవంత్ అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వ వాస్తవ ఆర్థికపరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది.

తర్వాత ప్రాజెక్టులపై దృష్టి

విద్యుత్, ఆర్థిక రంగాలపై సమీక్షలు, యాక్షన్‌ప్లాన్ తర్వాత సీఎం రేవంత్ సాగునీటి రంగంపై దృష్టి సారించే అవకాశముంది. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు పాలమూరు–రంగారెడ్డిపై ఆయన ప్రత్యేక కసరత్తు చేస్తారని సమాచారం.

ప్రజా సమస్యల్ని పరిష్కరిస్తాం: మంత్రి పొన్నం
సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసిన మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: ప్రజా సమస్యలు వినేందుకే ప్రజాదర్బార్ ఏర్పాటు చేశామని, వీలైనంత త్వరలోనే వారి సమస్యల్ని పరిష్కరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వినేందుకే ప్రగతిభవన్‌కు ఉండే అడ్డుగోడలను తొలగించి ప్రజాభవన్‌గా మార్చామని పొన్నం తెలిపారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కె.సత్యనారాయణతో పాటు సీపీఐ నాయకులను కలిసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూమ్‌భవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మతో సమావేశమయ్యారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ..గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజా సమస్యలను చెప్పుకునేందుకు, ప్రతిపక్ష నేతలు కలిసేందుకు కూడా అవకాశం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ విజయంలో సీపీఐ సంపూర్ణ సహకారం, మద్దతు ఉందని, భవిష్యత్‌లో కూడా తాము కలిసే ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ విజయంతో రాష్ట్రంలో ప్రజాస్వామిక పునాది పడిందన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సురవరం వారికి అభినందనలు తెలిపారు.

అసెంబ్లీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం: రాజాసింగ్
అక్బరుద్దీన్ ఎదుట బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణం చేయబోరు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు శనివారం ప్రమాణం చేసేందుకు ఉద్దేశించిన ఈ సమావేశానికి బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదన్నారు. శనివారం ఉదయం తమ పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో ఎమ్మెల్యేలు సమావేశమై, ఆయా అంశాలపై చర్చిస్తామని తెలిపారు. బీజేఎల్పీ సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం రాజాసింగ్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎందరో సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నా ఎంఐఎం శాసనసభాపక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీని ప్రొటెమ్ స్పీకర్‌గా నియమించినందున తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రజాకార్ల సైన్యానికి నాయకత్వం వహించిన ఖాసిం రజ్వీ వారసులైన ఎంఐఎం పార్టీ నేతల ఎదుట ప్రమాణం చేయదలుచుకోలేదని రాజాసింగ్ చెప్పారు. ఆ తర్వాత స్పీకర్ ఎదుట ఎప్పుడైనా ప్రమాణం చేస్తామని తెలిపారు. 2018లోనూ ప్రొటెమ్ స్పీకర్‌గా ఉన్నందున ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్‌ఖాన్ ఎదుట రాజాసింగ్ ప్రమాణం చేయలేదు.

ఓ వైపు పాలన.. మరోవైపు పదవులు

సీఎం రేవంత్ ముందు రెండు కీలక టాస్కులు
- పదేళ్లుగా అధికారంలో లేక పదవుల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది నేతలు
- పాలన సాగిస్తూనే పదవుల పందేరంపై దృష్టి సారించాల్సిన పరిస్థితి
- మంత్రివర్గ కూర్పుతో పాటు శాఖల కేటాయింపులోనూ ఢిల్లీ సూచనలే
- నామినేటెడ్ పదవుల్లోనూ జోక్యం చేసుకోనున్న హైకమాండ్?

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు కీలక టాస్కులు ఎదుర్కోబోతున్నారు. ఓ వైపు పాలనతో పాటు మరోవైపు పదవుల పందేరం కూడా ఆయనకు పెద్ద పరీక్షగా మారే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేక పదేళ్లు కావడం, తెలంగాణ వచ్చిన తర్వాత తొలిసారి అధికారంలోకి రావడంతో వేలాది మంది పార్టీ నేతలు పదవుల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. వీరికి పోస్టుల పంపిణీ ఒక ఎత్తయితే ఆ పదవుల పందేరం ఫలితంగా ఎదుర్కొనే పరిస్థితులను సమన్వయం చేయాల్సి ఉండడం పెద్ద టాస్క్ అనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. పదవుల పంపిణీతో పాటు పాలనా వ్యవహారాలపై దృష్టి సారించి తనదైన మార్కు పరిపాలన అందించడం కోసం రేవంత్ జోడెడ్ల స్వారీ చేయాల్సిందేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

ఢిల్లీనే కీలకం...: రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా నియామకం మొదలు నుంచి సీఎంగా ఎంపికయ్యేంతవరకు కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు అయన్ను వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఇప్పటికీ ఆ కొందరు నేతల వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. అధిష్టానం వద్ద పట్టుపట్టి తామూ కీలకం అన్న 'గుర్తింపు'సాధించడంలో సఫలీకృతులయ్యారన్న వాదనలూ ఉన్నాయి. ఇందుకోసం అధిష్టానం పెద్దలు కూడా సహకరించారనే చర్చ జరుగుతోంది. రేవంత్‌రెడ్డి నాయకత్వం పట్ల ప్రజల్లో, పార్టీ కార్యకర్తల్లో ఏకాభిప్రాయంతో కూడిన సానుకూలత ఉన్నప్పటికీ సొంత పార్టీలోని కొందరు నాయకుల వైఖరి ఆయనకు పగ్గాలు అప్పగించేందుకు అడ్డంకి కాకూడదన్న ఆలోచనతోనే హైకమాండ్ రాజీధోరణిని అందిపుచ్చుకుందని గాంధీభవన్ వర్గాలంటున్నా యి. ఈ ధోరణి మరికొన్నాళ్లు కొనసాగుతుందని, పాలనపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, తనదైన మార్కు వేసేంతవరకు పార్టీలోని సీనియర్లతో సీఎం రేవంత్‌కు సమన్వయం తప్పదని చెపుతున్నాయి.

ఠాక్రేతో పాటు సీనియర్లను సమన్వయం చేసుకునే..

ఇప్పటికే మంత్రివర్గం కూర్పు, శాఖల పంపిణీలో కాంగ్రెస్ పార్టీలో అధిష్టానం మార్కు రాజకీయాలు స్పష్టం కాగా, భవిష్యత్తులో జరిగే నామినేటెడ్ పదవుల పంపకంలోనూ హైకమాండ్ జోక్యం ఉంటుందని చెబుతున్నారు. హైకమాండ్ సూచనల మేరకు సీనియర్ కాంగ్రెస్ నేతల ప్రతిపాదనలపై ఆయన సమన్వయంతో వ్యవహరించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పదవుల పందేరం కోసం రాష్ట్రంలోని కొందరు ముఖ్య కాంగ్రెస్ నాయకులతో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలని అధిష్టానం ప్రతిపాదించిందని సమాచారం.

ఎంఐఎం మా మిత్రపక్షం కాదు
మతం పేరుతో రాజాసింగ్ ప్రతి అంశాన్నీ ముడిపెట్టడం సరికాదు: టీపీసీసీ ఉపాధ్యక్షుడు కిరణ్

సాక్షి, హైదరాబాద్: ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరిస్తే తాను ప్రమాణం చేయబోనని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రకటించడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. ఎంఐఎం తమ మిత్రపక్ష పార్టీ కాదని, కేవలం రాజ్యాంగ నిబంధనల మేరకే సీనియర్ ఎమ్మెల్యేగా అక్బరుద్దీన్ ప్రొటెం స్పీకర్ గా వ్యవహరిస్తారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మతం పేరుతో ప్రతి అంశాన్ని ముడిపెట్టడం రాజాసింగ్‌కు అలవాటని, తాను ఎమ్మెల్యే గా గెలిచేందుకు హిందూత్వ ఎజెండానే కారణమన్న భావనలో రాష్ట్రమంతా ఆ భావనను రుద్దేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. తమను అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు ఎంఐఎం ప్రయత్నించిందన్న వాస్తవాన్ని గ్రహించి రాజ్యాంగ ప్రక్రియకు రాజా సింగ్ సహకరించాలని కిరణ్ రెడ్డి కోరారు.

క్లుప్తంగా...

11 నుంచి లాసెట్ రెండో కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: మూడు, అయిదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 11వ తేదీ నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు లా, పీజీ లాసెట్ కన్వీనర్ పి.రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీలోగా లాసెట్ అర్హులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 14వ తేదీలోగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. 14 నుంచి 16వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని, 19వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. సీట్లు వచ్చిన విద్యార్థులు ఈ నెల 23లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

నేరం నిరూపణయ్యే వరకు నిర్దోషే: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: న్యాయ సూత్రాల మేరకు నేరం నిరూపణై దోషిగా తేలేవరకు కేసు నమోదైనా.. సదరు వ్యక్తి నిర్దోషే అని హైకోర్టు స్పష్టం చేసింది. తనపై నమోదైన ఓ కేసును పరిగణనలోకి తీసుకుని పాస్‌పోర్టు రెన్యువల్ చేయడం లేదని పేర్కొంటూ మంచిర్యాల జిల్లాకు చెందిన రవికంటి వెంకటేశం దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. వారం రోజుల్లోగా పాస్‌పోర్టు రెన్యువల్ చేయాలని ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిని ఆదేశించింది.

ప్రజాభవన్‌కు పూలే పేరుపై హర్షం



పంజగుట్ట (హైదరాబాద్): సీఎం నివాసానికి మహాత్మా జ్యోతిబాపూలే పేరు పెట్టడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. పూలే పేరు పెట్టుకోవడమే కాదు ఆయన ఆశయసాధనలో నడవాలన్నారు. బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నర సంవత్సరాల నియంత పాలను 136 బీసీ కులాలు ఐక్యంగా అంతమొందించాయన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పక్షాన నిలబడి సామాజిక న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. పూలే స్మృతి వనానికి ఐదెకరాల స్థలం కేటాయించాలని, అందులోనే పూలే విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, ఆయన నిండునూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, శ్రీశైలం యాదవ్, విక్రమ్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, శేఖర్ సగర తదితరులు పాల్గొన్నారు.

రాత్రీపగలు.. గజగజ



సాక్షి, నెట్‌వర్క్: రాత్రీపగలు చలి తీవ్రత పెరిగింది. గడిచిన 36 గంటల్లో రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. అందులో సంగారెడ్డి జిల్లాలో అత్యల్పంగా 12.6, కామారెడ్డిలో 12.8, మెదక్‌లో 12..9, వికారాబాద్‌లో 13.8, సిద్దిపేటలో 13.9 డిగ్రీలుగా నమోదైంది. ఇక పగటిపూట ఉష్ణోగ్రతలు కూడా భారీగానే పడిపోయాయి. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాల్లో సాధారణం కంటే 4 డిగ్రీలు, రామగుండంలో 3, నిజామాబాద్ జిల్లాలో 2 డిగ్రీలు తక్కువగా పగటి పూట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం వేళల్లో మంచు కురుస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రజాస్వామ్య పద్ధతిలో సభ నిర్వహిస్తా

- శాసనసభ ఔన్నత్యం ఇనుమడింపజేసేలా పనిచేస్తా
- స్పీకర్ పదవికి కాంగ్రెస్ పార్టీ నన్ను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: పాలక, ప్రతిపక్ష సభ్యులను సమన్వయం చేసుకుంటూ శాసనసభ ఔన్నత్యం ఇనుమడింపజేసేలా ప్రజాస్వామ్య పద్ధతిలో సభా కార్యక్రమాలు నిర్వహిస్తానని వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శాసనసభ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ ఎన్నికకానున్న నేపథ్యంలో ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. స్పీకర్ పదవికి కాంగ్రెస్ తనను ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని... దళితుడికి ఇంత పెద్ద హోదా కేవలం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమన్నారు. ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే...

మంత్రి పదవి వస్తుందని అనుకున్నా...

నాతో పాటు నియోజకవర్గ, జిల్లా ప్రజలు కూడా ఈసారి నాకు మంత్రి పదవి వస్తుందని అనుకున్నాం. కానీ పార్టీ అధిష్టానం ఇంకా గొప్పగా ఆలోచించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద బాధ్యత అప్పగించారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తను నేను. పార్టీ ఏ పదవి ఇచ్చినా కాదనకుండా చేసుకుంటూ పోతా. కాంగ్రెస్ పేరుకు దెబ్బ తగలకుండా ఇచ్చిన పదవికి గౌరవం తెచ్చేలా పనిచేస్తా.

మొదటి దళిత స్పీకర్‌ను నేనే అవుతా...

నేను ఎన్నికైతే తెలంగాణ శాసన సభలో తొలి దళిత స్పీకర్‌గా నాదే రికార్డు అవుతుంది. ఉమ్మడి ఏపీలో ప్రతిభాభారతి తొలి దళిత స్పీకర్‌గా ఉండేవారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి ఇంత పెద్ద పదవి దక్కింది కూడా నాకే.

రెండు పర్యాయాలు స్పీకర్ నామమాత్ర పాత్రనే...

గత రెండు పర్యాయాలు శాసనసభ కార్యక్రమాల నిర్వహణను రాష్ట్ర ప్రజలంతా గమనించారు. నియంతృత్వ ధోరణిలో ప్రతిపక్షాలను లెక్క చేయకుండా ఏకపక్షంగా సభానాయకుడే సభలో నిర్ణయాలు తీసుకున్న పరిస్థితిని గమనించాం. స్పీకర్ పాత్ర నామమాత్రమైంది. నేను స్పీకర్‌గా ఎన్నికైతే ప్రజాస్వామ్య పద్ధతిలో, సభ గౌరవం తగ్గకుండా, స్పీకర్ విలువ పెంచేలా సభను నడిపిస్తా.

మహామహులు సభలో ఉన్నా...

సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మాజీ సీఎం కేసీఆర్ ఇతర సీనియర్ శాసనసభ్యులు ఉన్నారు. పాలక, ప్రతిపక్షాల సభ్యులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతా. ఇప్పటి వరకు పాలక పక్షం చెప్పిందే వేదంగా సాగేది. సభలో ప్రతిపక్షాలకు కూడా తగిన సమయం ఇస్తా. అందరినీ కలుపుకొని ముందుకు వెళతా.

ఆరోగ్యశ్రీ కవరేజీ రూ. 10 లక్షలు

నేటి నుంచి రాష్ట్రంలో అమలుకు ప్రభుత్వం నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినవిధంగానే ఆరోగ్యశ్రీ కవరేజీని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శనివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో పెరిగిన కవరేజీ అందుబాటులోకి రానుంది. వాస్తవానికి గతంలో ఆరోగ్యశ్రీ కింద రూ.2 లక్షల వరకు మాత్రమే కవరేజీ ఉండేది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆయుష్మాన్ భారత్ పథకం కూడా ఆరోగ్యశ్రీతో కలిపి చేస్తుండటంతో కవరేజీని రూ.5లక్షలకు పెంచారు. ఇక నుంచి ఏడాదికి ఈ పథకాల కింద ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు కవరేజీ ఉంటుంది. ఈ పథకం కోసం ప్రభుత్వం ఏటా ఇప్పటివరకు రూ. 800 కోట్ల వరకు ఖర్చు చేస్తుండగా, ఇకనుంచి అది రెట్టింపు అవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై ఇంకా స్పష్టత రాలేదు.

77.19 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కార్డులు

రాష్ట్రంలో 293 ప్రైవేట్ ఆస్పత్రులు, 198 ప్రభుత్వ పెద్దాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం 809 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) లోనూ ఆరోగ్యశ్రీ కింద సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. మొత్తంగా రాష్ట్రంలో 1,310 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 77.19 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కార్డులున్నాయి. ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని కూడా ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేస్తున్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఈజేహెచ్ఎస్ కిందకు వస్తారు. లబ్దిదారుల్లో ఎవరికైనా ఏదైనా జబ్బు వస్తే నగదు రహిత వైద్యం పొందడానికి అవకాశం ఉంటుంది. అయితే బకాయిలు పేరుకుపోవడంతో పాటు ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు ఇచ్చే ప్యాకేజీ సొమ్ము సరిపోవడం లేదని యాజమాన్యాలు చెబుతున్నాయి. 2013 ప్యాకేజీ ప్రకారమే ఆస్పత్రులకు సొమ్ము అందుతుంది. దీనిని సవరించాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు కోరుతున్నాయి. అది పెంచకపోతే కవరేజీ రెట్టింపు చేసినా, తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదని అంటున్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ కింద 1,376 శస్త్రచికిత్సలు, 289 వైద్య సేవలున్నాయి. ఆయుష్మాన్ భారత్ కింద 1,949 వ్యాధులకు వైద్యం అందుతుంది. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లో ఈ రెండింటిలో ఉన్న వ్యాధులను కలిపి అమలు చేస్తున్నారు. అయితే ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్రం 2022లో ప్యాకేజీలను సవరించింది. కానీ రాష్ట్రంలో అది జరగకపోవడంతో పథకం సక్రమంగా అమలు కావడం లేదు. కాగా, మరికొన్ని కొత్త వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావాలని ఆరోగ్యశ్రీ ట్రస్టు నిర్ణయించింది. 611 కొత్త వ్యాధులను తీసుకురావాలని ప్రతిపాదించగా, వాటిల్లో 539 కొత్త వాటిని ఖరారు చేశారు.

పదవుల నుంచి తప్పుకోండి

- ఉపాధ్యాయ సంఘ నేతలపై ఒత్తిడి... పాత నేతలే ఉంటే పనులు కావనే వాదన
- ప్రధాన సంఘాలపై అధికార మార్పిడి ప్రభావం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం మారడంతో ఉపాధ్యాయ సంఘాలపై ఆ ప్రభావం కనిపిస్తోంది. నాయకత్వ మార్పిడిపై పలు సంఘాల్లో డిమాండ్ పెరుగుతోంది. ఎన్నికల ముందు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన కొన్ని సంఘాల నేతలకు ఈ తాకిడి ఎక్కువగా ఉంది. వారే కొనసాగితే ఇబ్బందులు తప్పవని సంఘంలోని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. కనీసం రాష్ట్ర స్థాయిలో అధ్యక్ష, కార్యదర్శులనైనా మార్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు సంఘ ఎన్నికలు నిర్వహించే కన్నా, ఎవరికి వారే తప్పుకుని కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్న ఒత్తిడి వస్తోంది. ఉపాధ్యాయ సమస్యల కన్నా, వారి వ్యక్తిగత పనులకే అనుకూల సంఘాలు ప్రాధాన్యమిచ్చాయనే విమర్శలు వస్తున్నాయి. ఓ సంఘం జిల్లా స్థాయి నేతలు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతో రాష్ట్ర నాయకులు నివ్వెరపోయారు. ఇతర సంఘాలపైనా ఇదే స్థాయి ఒత్తిడి కనిపిస్తోంది. కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతుల విషయంలో నేతలు గట్టిగా పోరాటం చేయ లేదన్న ఆరోపణ వ్యక్తమవుతోంది. ఒక సంఘం రాష్ట్ర నేతలు గడువు ముగిసినా కొనసాగుతున్న తీరుపై ఆ సంఘం నుంచే వ్యతిరేకత వస్తోంది. దీంతో కొత్త కార్యవర్గం ఎన్నికపై అంతర్గత సమీక్షలు చేపట్టేందుకు ఆ సంఘం సిద్ధమైంది.

'నర్సింగ్ కాలేజీల్లోని పోస్టులు భర్తీ చేయాలి'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని నర్సింగ్ కాలేజీల్లో ఉన్న పోస్టులను భర్తీ చేసేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని రిజిస్టర్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజేఏసీ) కోరింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం అధ్యక్షురాలు సుజాత రాథోడ్ తదితరులు టీజేఏసీ మాజీ చైర్మన్ కోదండరాంను కలిసి వినతిపత్రం సమర్పించారు. నర్సింగ్ అధికారులకు సకాలంలో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో 5,204 నర్సింగ్ ఆఫీసర్స్ పోస్టుల ఫలితాలను త్వరగా విడుదల చేయాలని, 317 జీవో ద్వారా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, నర్సింగ్ కౌన్సిల్ ఎన్నికలు త్వరగా నిర్వహించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సీఎంను కలిసిన శివధర్‌రెడ్డి, సీవీ ఆనంద్

బంజారాహిల్స్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శుక్రవారం ఉదయం ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో భేటీ అయ్యారు. గంటకుపైగా వీరిద్దరి మధ్య పలు అంశాలపై చర్చలు జరిగాయి. కొద్దిసేపటికే నగర మాజీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ కూడా ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికలకు ముందు ఆనంద్‌ను నగర కమిషనర్ స్థానం నుంచి ఎన్నికల సంఘం తొలగించిన విషయం తెలిసిందే. కాగా, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) ఎస్పీ రామకృష్ణయ్య నేతృత్వంలోని బృందం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసిత ప్రాంతాన్ని శుక్రవారం తమ అధీనంలోకి తీసుకుంది. రహదారులపై రెండు టీఎస్ఎస్‌పీ బృందాలతో కూడిన పోలీసులు పికెటింగ్‌లు ఏర్పాటు చేసి పహారా కాయనున్నారు. సీఎం నివాసిత ప్రధాన ద్వారంతో పాటు చుట్టూ 30 మందికి పైగా ఐఎస్‌డబ్ల్యూ పోలీసులు రక్షణ వలయంగా ఉంటారు.



శివధర్‌రెడ్డి



సీవీ ఆనంద్

ఉపాధ్యాయ ఖాళీలపై ప్రభుత్వం ఆరా

సీఎస్‌కు విద్యాశాఖ నివేదిక

- ఆగిపోయిన డీఎస్సీపై వాకబు
- కొత్త పోస్టులతో రీ షెడ్యూల్?
- 18 వేల టీచర్ పోస్టులు ఖాళీ
- లెక్క చెప్పిన పాఠశాల విద్య డైరెక్టరేట్
- సీఎం సమీక్ష చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీచర్ పోస్టుల ఖాళీపై కొత్త ప్రభుత్వం ఆరా తీసింది. నిలిచిపోయిన నియామకాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై వాకబు చేసింది. విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్య డైరెక్టర్ సమగ్ర వివరాలతో రూపొందించిన నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. దీంతో పాటే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వివరించారు. కోర్టు వివాదంలో ఉన్న అంశాలు, ఎన్నికల కోడ్ వల్ల నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షను నివేదికలో పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. విద్యాశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష చేసే అవకాశం ఉంది. దీంతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు పాఠశాల విద్య డైరెక్టరేట్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.

డీఎస్సీ రీ షెడ్యూల్?

ఎన్నికల ముందు 5,089 టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. రోస్టర్ విధానాన్ని స్పష్టం చేశారు. ఈలోగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో నియామక ప్రక్రియ వాయిదా పడింది. ఆగిపోయిన డీఎస్సీని ముందుకు తీసుకెళ్లడమా? కొత్త షెడ్యూల్ ఇవ్వడమా? అనే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రోస్టర్ విధానం వెల్లడించిన తర్వాత కొన్ని జిల్లాల్లో సాధారణ కేటగిరీల్లో పోస్టులు లేకుండా పోయాయి. స్థానికేతరులకూ కేవలం 15 శాతమే అర్హత ఉండటంతో డీఎస్సీపై నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అప్పట్లోనే కొన్ని పోస్టులు కలపాలన్న ఆలోచన గత ప్రభుత్వం చేసింది. కానీ ఇది కార్యాచరణకు నోచుకోలేదు. ఇప్పుడు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చే వీలుందని అధికార వర్గాలు అంటున్నాయి.

ఇవీ ఖాళీలు...

ఉపాధ్యాయులు	ఖాళీలు
హెచ్ఎం	1,974
ప్రాథమిక పాఠశాల హెచ్ఎం	2,043
స్కూల్ అసిస్టెంట్లు	7,200
ఫిజికల్ డైరెక్టర్స్	25
ఎస్‌జీటీలు	6,775
భాషా పండితులు	688
పీఈటీలు	172
డ్రాయింగ్, మ్యూజిక్	1,733
ఎంఈవో	467
బాలికల స్కూల్ హెచ్ఎం	15
డైట్ లెక్చరర్లు	271
జిల్లా ఉప విద్యాధికారులు	58
డీఈవోలు	7

20 వేలకుపైగానే ఖాళీలు

విద్యాశాఖలో 20,740 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ అధికారులు లెక్కగట్టారు. 2022లో ప్రభుత్వం 13 వేల ఖాళీలు భర్తీ చేస్తామని తెలిపింది. ఈ మేరకు 2023లో 5,089 పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహణకు సిద్ధమైంది. ఈ క్రమంలో ప్రస్తుతం విద్యాశాఖ ఏయే విభాగాల్లో ఎన్ని ఖాళీలున్నాయనే అంశాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందించిన నివేదికలో పేర్కొంది. పదోన్నతులు కల్పించడం ద్వారా హెచ్ఎం పోస్టులను భర్తీ చేస్తారు. స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు కూడా ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించడం ద్వారా 70 శాతం భర్తీ చేయాల్సి ఉంటుందని, మిగిలిన 30 శాతం ప్రత్యక్ష నియామకం చేపట్టడం ద్వారా భర్తీ చేయాలనే విషయాన్ని సూచించింది. జిల్లా విద్యాశాఖ అధికారులు కేవలం ఐదు జిల్లాలకే ఉన్నారని, మండల విద్యాశాఖ అధికారుల పోస్టులు 467 ఖాళీగా ఉన్నాయని తెలిపింది. వీటిల్లో ఎన్ని భర్తీ చేస్తారనేది కొత్త ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఉంటుందని అధికార వర్గాలు అంటున్నాయి. ఉన్నత స్థాయి సమీక్ష తర్వాతే ఓ స్పష్టత వచ్చే వీలుందని అధికారులు తెలిపారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు వచ్చేనా?

గల్ఫ్ ప్రవాసుల ఆకాంక్షలు నెరవేరేనా!

- కొత్త ప్రభుత్వంపైనే గల్ఫ్ కార్మికుల ఆశలు
- అధికారంలోకి వస్తే ఎన్ఆర్ఐ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీ

మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్ వలస కార్మికులు ఆశించిన విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తమ సంక్షేమం కోసం అడుగులు ముందుకు పడతాయని వారు గంపెడు ఆశలతో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమం అంశం చేర్చింది. గల్ఫ్ సంక్షేమ బోర్డును ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. మరణించిన గల్ఫ్ కార్మికుని కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపులు, విదేశాలలో ఉన్న వలస కార్మికుల సమస్యలను తెలుసుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి హెల్ప్ డెస్క్‌ను నిర్వహిస్తామని హామీనిచ్చింది.

గల్ఫ్ దేశాల్లో 15 లక్షలమంది మన వాళ్లు

తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు దాదాపు 15 లక్షల మంది వలస వెళ్లారు. ఇతర దేశాల్లోనూ మరో ఐదు లక్షల మంది వలస కార్మికులు ఉంటారని అంచనా.

నాడు వైఎస్ తర్వాత ఎవరూ పట్టించుకోలే

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో వలస కార్మికుల సంక్షేమం కోసం కృషి చేశారు. గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించడం, ఆయా దేశాల నుంచి ఇంటికి చేరుకున్న వారికి రాయితీ రుణాలిచ్చి పునరావాసం కల్పించడంతో పాటు పునరేకీకరణకు చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ హఠాన్మరణం తరువాత సీఎంలు అయినవారు ఎవరూ కూడా వలస కార్మికుల గురించి పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు నుంచి గల్ఫ్ బోర్డు ఏర్పాటు డిమాండ్ బలంగా వినిపించడంతో కాంగ్రెస్ పార్టీ అందుకనుగుణంగా స్పందించింది. వలస కార్మికుల కుటుంబాలు కూడా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినట్లు ఫలితాలను విశ్లేషించడం వల్ల వెల్లడైంది. ప్రభుత్వం కొలువుదీరడంతో వీలైనంత త్వరగా వలస కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయా కుటుంబాల సభ్యులు కోరుతున్నారు.



టీపీసీసీ అధ్యక్షుని హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డికి గల్ఫ్ అంశాలను మేనిఫెస్టోలో చేర్చాలని విన్నవిస్తున్న జేఏసీ ప్రతినిధులు (ఫైల్)

గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి..

గల్ఫ్ వలస కార్మికులకు మంచి చేయాలంటే బోర్డు ఏర్పాటు ఒక్కటే మార్గం. బోర్డు ద్వారానే వలస కార్మికులకు సంక్షేమ ఫలాలు అంది వారి సమస్యలను పరిష్కరించడానికి వీలుంటుంది. కొత్త సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గల్ఫ్ వలస కార్మికుల అంశంకు ప్రాధాన్యత ఇవ్వాలి.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు

మేనిఫెస్టో అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళతాం...

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అధిష్టానం దృష్టికి తీసుకువెళతాం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలువడానికి వలస కార్మికుల కుటుంబాలు కీలకపాత్ర పోషించాయి. గల్ఫ్ వలస కార్మికుల ప్రభావం ఉన్న నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థులకు మెజార్టీ ఓట్లు లభించాయి.

– సింగిరెడ్డి, నరేష్‌రెడ్డి, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్

లెక్కలు తీస్తున్నారు

- శాఖల వారీగా నిధుల విడుదల, ఖర్చుపై వివరాల సేకరణ
- రాష్ట్ర ఏర్పాటు నుంచి గణాంకాలు సమర్పించాలంటూ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి ఏమిటో ప్రజలకు చెప్పేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. 'ఇది ప్రజాప్రభుత్వం'అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం రోజే ప్రకటించిన విషయం తెలిసిందే. తొలి కేబినెట్ సమావేశంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుంచి ఈ పదేళ్ల కాలంలో నిధుల విడుదల, ఖర్చు, మిగులు తదితరాలు ప్రజలకు వివరించాలని నిర్ణయించిన సంగతి విదితమే. ఈ క్రమంలోనే ప్రభుత్వ శాఖల వారీగా నివేదికలు సేకరించాలని నిర్ణయించి ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బడ్జెట్ రూపకల్పనలో భాగంగా శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదల, చేసిన ఖర్చులకు సంబంధించి సమాచారం విభాగాధిపతులు సమర్పించడం ఆనవాయితీ. సీఎం ఆదేశాలతో శుక్రవారం పలు విభాగాధిపతులు ఆగమేఘాల మీద ఈ ఏడాదికి సంబంధించిన వివరాలు ప్రభుత్వానికి సమర్పించారు.

ప్రత్యేక ఫార్మాట్ రూపకల్పన !

శాఖలవారీగా చేసిన ఖర్చులకు ప్రత్యేక ఫార్మాట్ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించినట్టు తెలిసింది. 2014 నుంచి ఇప్పటివరకు వార్షిక బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులు, నిధుల విడుదలకు సంబంధించి బడ్జెట్ రిలీజింగ్ ఉత్తర్వులు, చేసిన ఖర్చు, సంవత్సరం వారీగా నిధుల మిగులుకు సంబంధించిన సమాచారం సమర్పించాల్సి ఉంటుంది. ఖర్చుకు సంబంధించిన అంశాలను పథకాల వారీగా వ్యయం, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతోపాటు మరమ్మతులు తదితరాలను పూర్తిస్థాయిలో సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులతో కూడిన జాబితాతోపాటు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు, విడుదలైన నిధులు, చేసిన ఖర్చు వివరాలు కూడా వేరుగా సమర్పించాలని స్పష్టం చేసింది. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించడంతో అధికారులు కసరత్తు వేగవంతం చేశారు. శనివారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానుండగా, సమావేశాలు ముగిసేనాటికి వీటిని ప్రజాక్షేత్రంలో ఉంచే అవకాశం ఉన్నట్టు సమాచారం. విద్యార్థుల ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పదేళ్ల కాలంలో రూ.25వేల కోట్లు ఖర్చు చేసినట్టు అంచనా.

ఈ అఖిల బ్రహ్మాండంలో గల జడ-చేతనారూపమైన చరాచర జగత్తు సర్వమూ ఈశ్వరవ్యాప్తమై ఉన్నది. ఇది గ్రహించి ఆ ఈశ్వరుణ్ణి వెంట వుంచుకునే త్యాగపూర్వకంగా ఐహిక భోగాలు అనుభవించు.

– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి

శనివారం, 9 డిసెంబర్ 2023

న్యాయాన్యాయాలు

న్యాయం చేయటమే కాదు... చేసినట్టు కూడా కనబడాలంటారు. శుక్రవారం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రాను బహిష్కరిస్తూ లోక్‌సభ మూజువాణీ ఓటుతో తీర్మానం ఆమోదించిన తీరు ఈ మౌలిక సూత్రాన్ని విస్మరించింది. మొయిత్రాపై వచ్చిన ఆరోపణల్లోని నిజానిజాలేమిటి, వాటి తీవ్రత ఎంత... ఎథిక్స్ కమిటీ ఆ ఆరోపణలను పరిశీలించవచ్చునా లేదా వంటి సందేహాల వరకూ పోనవసరం లేదు. అసలు బహిష్కరణకు గురయ్యే సభ్యులు ఆ నిర్ణయం పై సభలో తమ స్వరం వినిపించటానికి అవకాశం ఇవ్వకపోవటం సబబేనా? మొన్న 4న మొదలైన పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈనెల 22వ తేదీ వరకూ సాగుతాయి. నివేదికపై శుక్రవారం అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధం నడిచింది. ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ విపక్షం వాకౌట్‌చేసింది. ఎథిక్స్ కమిటీలో మొయిత్రాకు అవకాశమిచ్చామని, కానీ అడిగిన వాటికి జవాబులివ్వకుండా ఆమె దూషణలకు దిగారని కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్ సోంకార్, కమిటీలోని బీజేపీ సభ్యులు ఇప్పటికే ఆరోపించారు. ఫిర్యాదుకు సంబంధంలేని ప్రశ్నలతో వేధించారని, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆ ప్రశ్నలున్నాయని మొయిత్రా కూడా ప్రత్యారోపణ చేశారు. ఒకవేళ మొయిత్రా చేసిన ఆరోపణలన్నీ అబద్ధమే అనుకున్నా... అంతమాత్రాన సభలో తన వాదన వినిపించేందుకు ఆమె అనర్హురాలవుతారా? చట్టసభల్లో జరిగే చర్చలు, వాటి ప్రత్యక్ష ప్రసారాలు పాలక, విపక్ష సభ్యుల్లో ఎవరు ఎవరికంటే బాగా మాట్లాడుతున్నారో నిర్ణయించటానికి కాదు. తాము ఎన్నుకున్న సభ్యులు చర్చిస్తున్నదేమిటో, తీసుకుంటున్న నిర్ణయాలేమిటో, వాటిలోని మంచిచెడ్డలేమిటో తెలుసుకోవటం కోసం. మొయిత్రా కావొచ్చు...మరొకరు కావొచ్చు - చర్చ సందర్భంగా అప్రామాణికంగా లేదా అసంబద్ధంగా మాట్లాడితే వారి వాదనలోని డొల్లతనాన్ని ప్రజలే గ్రహిస్తారు. అది పాలకపక్షానికే మంచిది. సభలో అధికారపక్షానికి కావలసినంత మెజారిటీ వుంది. కనుక మొయిత్రాకు అవకాశమిచ్చినంత మాత్రాన కలిగే నష్టం ఏమీ లేదు. అసలు ఎథిక్స్ కమిటీ నివేదికను పార్లమెంటు శీతాకాల సమావేశ ప్రారంభం రోజైన ఈనెల 4నే ప్రవేశపెట్టాలి. కానీ పాలక పక్షం శుక్రవారానికి వాయిదా వేసింది. అయినా ఈ వ్యవహారం ఇలా ముగియటం మన పార్లమెంటరీ వ్యవస్థ లోపాన్ని తెలియజెబుతోంది. నివేదికను కమిటీలోని ఆరుగురు అంగీకరించగా, నలుగురు దాన్ని వ్యతిరేకించారు. ఎథిక్స్ కమిటీ నిర్ణయం సబబే కావొచ్చు... అది మెజారిటీ ప్రకారమే తీసుకుని వుండొచ్చు. కానీ సభలో మొయిత్రాకు అవకాశమీయటంవల్ల ఎంపీగా ఆమె ప్రవర్తనలోని గుణదోషాలను పౌరులు తెలుసుకునే అవకాశం వుంటుంది కదా! దాన్ని నిరాకరించటం ఏం సబబు?

మొయిత్రాపై వున్న ఆరోపణల పూర్వాపరాలు పరిశీలిస్తే పార్లమెంటు సభ్యురాలిగా ఆమె తన పరిమితులు అతిక్రమించారా అన్న సందేహాలు కలుగుతాయి. సభలో వేయదల్చుకున్న ప్రశ్నలను సభ్యులు ఎక్కడి నుంచి అయినా ఎన్‌ఐసీలో లాగిన్ అయి, నేరుగా స్పీకర్‌కు చేరే విధంగా పోస్ట్ చేయొచ్చు. ఆ ప్రశ్నల అర్హతను స్పీకర్ నిర్ణయించాక అవి సంబంధిత మంత్రిత్వ శాఖలకు వెళ్తాయి. అనర్హ ప్రశ్నలను తొలగిస్తారు. ఇదంతా ఆమె నేరుగా చేసివుంటే ఇంత రచ్చయ్యేందుకు ఆస్కారం వుండేది కాదు. తన స్నేహితుడైన దుబాయ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి హీరానందానీకి తన పార్లమెంటు లాగిన్, పాస్‌వర్డ్ అందజేసి అందులో ప్రశ్నలు పోస్ట్ చేయించమని చెప్పారు. తన నియోజకవర్గ పనుల్లో తీరిక లేకుండా వున్నందున ఇలా చేయించానని మొయిత్రా సంజాయిషీ. మామూలుగా ఇది సబబు అనిపించదు. కానీ 800మంది ఎంపీల్లో అత్యధికులు ఇలాగే చేస్తున్నారని, ప్రతిదీ వారే చేయాలంటే అసాధ్యమని ఆమె చెబుతున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక నిబంధనేదీ లేదంటున్నారు. ఒకరిద్దరు సభ్యులు సైతం తామూ అలాగే చేస్తున్నామని చెప్పారు. ఎథిక్స్ కమిటీ మాత్రం ఇది దేశ భద్రతకు ముప్పు తెచ్చే చర్య అంటున్నది. పైగా లంచం తీసుకుని అదానీ సంస్థ లపై ఆమె ఈ ప్రశ్నలు వేశారని బీజేపీ సభ్యుల ఆరోపణ. ఈ సందర్భంగా 2005లో ఆన్‌లైన్ పోర్టల్ 'కోబ్రా పోస్ట్' నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ గురించి ప్రస్తావించుకోవాలి. 11మంది ఎంపీలు ప్రశ్నలు అడిగేందుకు తాము ఇవ్వజూపిన డబ్బు తీసుకున్నారని ఆ పోర్టల్ తేల్చింది. వీరిలో బీజేపీ, కాంగ్రెస్, ఆర్‌జేడీ, బీఎస్పీలకు చెందినవారున్నారు. ఇందులో 10 మంది లోక్‌సభ సభ్యులు, మరొకరు రాజ్యసభకు చెందినవారు. ఇదంతా ఒక చానెల్‌లో ప్రసారమైంది. ఆ ఎంపీలను సభ నుంచి బహిష్కరిస్తున్న సందర్భంలో మాట్లాడిన బీజేపీ సీనియర్ నేత అద్వాణీ ఇందులో అవినీతికన్నా ఎంపీల బుద్ధిహీనత వెల్లడవుతోందన్నారు. అందుకు బహిష్కరణ శిక్ష విధించటం క్రూరమైన చర్యగా అభివర్ణించారు. మొయిత్రా విషయంలో దీన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదా?

అసలు మొయిత్రాపై వచ్చిన ఆరోపణలకు విడిపోయిన ఆమె సహచరుడు జైఅనంత్ దేహద్రాయ్ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేకు రాసిన లేఖ ప్రాతిపదిక. మొయిత్రా, దేహద్రాయ్‌లకు బోలెడు తగువులున్నాయి. పెంపుడు కుక్క విషయం మొదలుకొని ఎన్నిటిపైనో పరస్పరం కేసులు పెట్టుకున్నారు. అందువల్ల ఆ లేఖకు ఎంతవరకూ ప్రాధాన్యమీయవచ్చో ఆలోచిస్తే బాగుండేది. అలాగే ప్రభుత్వంపై మొయిత్రా తరచు నిశిత విమర్శలు చేస్తుంటారు గనుక, ఆ కారణంతోనే చర్య తీసుకున్నారన్న అపప్రద రాకుండా చూసుకోవాల్సింది. అసలు ఆమెకు సభలో మాట్లాడే అవకాశమిస్తే ఆదరాబాదరాగా చేశారన్న నిందకు అవకాశం వుండేదే కాదు.

ఎన్నికల ఫలితాలు చెబుతున్నదేమిటి?

సందర్భం



జోయా హసన్

హిందీ ప్రాంతంలో ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొందిన ఘోర పరాజయం, తెలంగాణలో దాని అద్భుతమైన విజయాన్ని మరుగున పడేసింది. 2018లో తాను గెలిచిన మూడు రాష్ట్రాలలో (మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్) కాంగ్రెస్‌కు ప్రస్తుతం అతిపెద్ద దెబ్బ తగిలింది. బీజేపీ సమగ్ర విజయానికి కారణం, ఈ మూడు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో మద్దతు లభించడం. అయితే కాంగ్రెస్ ఓడిపోయినప్పటికీ తన ఓట్ల వాటాను మాత్రం నిలుపుకోగలిగింది. బరిలో నిలిచిన ఇతరుల కారణంగా బీజేపీ అధికంగా ప్రయోజనం పొందింది. ఏదేమైనా, ఈ విజయాలతో 2024లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు, అత్యంత కీలక ప్రాంతంలో బీజేపీ తన ఆధిపత్యాన్ని మరింత విస్తరించుకోగలిగింది.

ఉత్తరాది రాష్ట్రాల్లో ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పొందిన ఘోర పరాజయం, తెలంగాణలో దాని అద్భుతమైన విజయాన్ని మరుగున పడేసింది. అయితే కాంగ్రెస్ ఓడిపోయినప్పటికీ మధ్య ప్రదేశ్‌లో 40.4 శాతం, రాజస్థాన్‌లో 39.5 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 42.23 శాతం ఓట్ల వాటాను నిలుపుకోగలిగింది. ఫలితం ఎలా ఉన్నప్పటికీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు లభించిన ఓట్ల శాతానికి గుర్తించదగిన ప్రాముఖ్యత ఉంది.

ముఖ్యంగా రాష్ట్రాల ఎన్నికల్లో స్థానికంగానూ, సార్వత్రిక ఎన్నికల్లో జాతీయంగానూ ఓటర్లకు విజ్ఞప్తి చేయాలనే ఆశతో నిరుద్యోగం, కులవివక్ష వంటి అంశాలను ఎత్తిచూపడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. అయితే, హిందూ జాతీయ వాదం, మతతత్వ రాజకీయాల సమ్మేళనం అనేవి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయం అనేవాటికంటే ఎక్కువ ఆదరణ పొందాయి. హిందూ జాతీయవాద ఏకీకరణతో బీజేపీ సాధించిన విజయాలు, కీలకమైన రాష్ట్రాల్లో అది అస్వాదిస్తున్న గొప్ప ప్రతిధ్వనిని ఎత్తి చూపుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని, పుష్కలమైన ఆర్థిక వనరులను ఉపయోగించడం, ఆరెస్సెస్ కేడర్ శక్తిమంతమైన పునాదిగా ఉండటంతో బలమైన దేశం, అభివృద్ధి, సంక్షేమవాదాన్ని కోరుకునే పార్టీగా, హిందూమత ఛాంపియన్‌గా తనను తాను ప్రమోట్ చేసుకోవడానికి బీజేపీకి అవకాశం దొరికింది.

బీజేపీ ఎన్నికల ప్రచారం బలమైన రాష్ట్ర నాయకులను పక్కకు నెట్టివేసి, మొదటి నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పైనే దృష్టి పెట్టింది. ఎన్నికలకు వెళ్లిన ఏ రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రతిపాదించకూడదని ఆ పార్టీ నిర్ణయించింది. దీనర్థం ఏమిటంటే, అశోక్ గెహ్లోత్, భూపేష్ బఘేల్ వంటి కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ రాష్ట్ర నాయకులు తమ స్థానిక బీజేపీ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా కాకుండా మోదీకి వ్యతిరేకంగా పోటీ పడ్డట్టయింది. ఉత్తర, మధ్య భారతదేశంలో ప్రధానికి ఉన్న భారీస్థాయి ప్రజాదరణ, ఈ నాయకుల పట్ల ప్రజామోదాన్ని తటస్థింపజేసింది.

కర్ణాటకలో స్థానిక నాయకుల ప్రాచుర్యం, ప్రాముఖ్యత తెచ్చిన ఫలితాల అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకొన్న కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం, ఆ రాష్ట్ర నాయకులపై స్థిరమైన అంచనా వేసుకుంది. వారికి స్వేచ్ఛా హస్తాన్ని అందించింది. అయితే, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో వారి నాయకుల అంతర్గత పోరు, మితిమీరిన ఆకాంక్షలు ఈ వ్యూహానికి చెల్లుచీటి పలికాయి. రాష్ట్ర నాయకత్వంలో చీలికలు అనేవి ఈ రెండు రాష్ట్రాల్లోనూ దీర్ఘకాలంగా ప్రదర్శితమవుతూ వచ్చాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందు వరకు కాంగ్రెస్ నాయకులు ఒకరిపై



ఒకరు ఆరోపణలు చేసుకుంటూనే ఉన్నారు. ఇది ఇంటినే సక్రమంగా ఉంచుకోలేని పార్టీ అని ఓటర్లకు సందేశం పంపింది. రెండు రాష్ట్రాలలో పోరాడుతున్న నాయకుల మధ్య ఎట్టకేలకు ఒక ఒప్పందం కుదిరింది. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది.

ముఠాతత్వానికి తోడుగా రాష్ట్ర నాయకత్వానికీ, అధిష్ఠానానికీ మధ్య సఖ్యత, ఏకాభిప్రాయం కనబడలేదు. దాంతో కాంగ్రెస్ ప్రచారానికి పొంతన లేకుండా పోయింది. వారి గడ్డపై ఎలాంటి జోక్యాన్నీ శక్తిమంతమైన రాష్ట్ర నాయకులు ఇష్టపడలేదు. దీనికి విరుద్ధంగా, బీజేపీ ప్రచారం తీవ్రంగా సాగింది. తన దృష్టినంతా కేంద్రీకరించింది. పైగా ఆ పార్టీ ఒకే స్వరంలో మాట్లాడింది. ఇది ఆశ్చర్యకరం కాదు, ఎందుకంటే సమకాలీన బీజేపీ అత్యంత కేంద్రీకృతమైన పార్టీగా ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ తన గతం నుండి బయటపడటంలో భాగంగా సాపేక్షంగా వికేంద్రీకరణకు గురైంది.

పరిస్థితిని మరింత దిగజార్చుతూ, రాష్ట్ర ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాల మధ్య ఎటువంటి ఒప్పందం జరగలేదు. బీజేపీతో పోరాడటానికి కలిసి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని 28 పార్టీలతో కూడిన ఇండియా గ్రూప్ పార్టీల మధ్య సఖ్యత రాష్ట్ర ఎన్నికలలో కనిపించలేదు. ప్రతిపక్షాలు ఇచ్చిపుచ్చుకునే స్ఫూర్తితో రాష్ట్ర ప్రత్యేక పొత్తులు, సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపి ఉండాలి. చేయడం కంటే చెప్పడానికి ఇది సులభంగా ఉంటుంది. ఏమైనా, సీట్ల పంపకం జరగలేదు. ఇది కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిని కూడా దెబ్బతీసింది. దీన్ని ఓటర్లు విభజించబడిన ఇల్లుగా భావించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇతర పార్టీల భవితవ్యం... బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యంగా ఉన్నప్పుడే దాన్ని ఎదుర్కోగలవని స్పష్టం చేస్తోంది.

ఓబీసీలలో బీజేపీకి ఉన్న మద్దతును తగ్గించడానికి కాంగ్రెస్ చేసిన పెద్ద పోరాటమే, కుల ఆధారిత జనాభా గణన. కానీ అది 'నో-బాల్'గా మారింది. ఇదేమీ ప్రయోజనం ఇవ్వలేదు. ఈ పిలుపునకు క్షేత్రస్థాయిలో పెద్దగా ప్రభావం లేకుండా పోయింది. ఓబీసీ ఓట్లలో బీజేపీ వాటా పెరగడమే దీనికి నిదర్శనం. ఏమైనప్పటికీ, కుల గణన కోసం డిమాండ్ అనేది, హిందూ గుర్తింపు రాజకీయాలకు స్ఫూర్తిదాయకమైన లేదా ప్రభావవంతమైన ప్రతిఘటనా అంటే సందేహాస్పదంగా ఉంది. స్పష్టమైన రాజకీయ పార్శ్వం, లేదా దాని సందేశాన్ని తెలియజేయడానికి సమర్థవంతమైన ప్రచారం, సైద్ధాంతిక స్పష్టత, సంస్థాగత సమన్వయం లేకుండా... ఈ రాష్ట్రాలలో బీజేపీ రాజకీయాలకు వ్యతిరేకంగా పనిచేయడానికి కుల రాజకీయాలు, సామాజిక న్యాయ ఆలోచనలు సరిపోవు.

రాష్ట్ర, జాతీయ ఎన్నికల మధ్య సంబంధం ఉంటుందనే దానికి పరిమితమైన రుజువు మాత్రమే ఉంది. అయినప్పటికీ, వరుస పోటీలలో బీజేపీ చేతిలో కాంగ్రెస్ నిర్ణయాత్మక ఓటమి దాని విశ్వసనీయతను దెబ్బతీసిందనడంలో సందేహం లేదు. పైగా లోక్‌సభ ఎన్నికలు కేవలం ఐదు నెలల దూరంలో ఉన్న కీలక సమయంలో ఈ ఓటమి ఆ పార్టీని నిరుత్సాహపరుస్తుంది కూడా. అయితే, ఈ క్లిష్టమైన రాష్ట్రాల్లో మెజారిటీ ఓటర్లు బీజేపీయేతర పార్టీలను ఎంచుకున్నందున మొత్తంగా ఆశ పోలేదని కూడా చెప్పవచ్చు.

కాంగ్రెస్ ఈ ప్రాతిపదికన నిర్మాణం కావాలి. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలంటే, అది స్పష్టమైన సైద్ధాంతిక కథనాన్ని ప్రదర్శించాలి. అలాగే దాని సొంత రాజకీయాలను వ్యక్తీకరించాలి. మొదటగా, అది బీజేపీని 'మరింత హిందూ' పార్టీగా అధిగమించడానికి ప్రయత్నించకూడదు. దానికోసమే అయితే, ఓటర్లు బీజేపీనే ఎంచుకునే అవకాశం ఉంది. సైద్ధాంతిక ప్రతిఘటన అనేది తప్పనిసరిగా హక్కుల ఆధారిత సంక్షేమం, ప్రత్యేకించి సామాజిక సామరస్యంతో ముడిపడి ఉన్న ఉపాధి హామీలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధికి సంబంధించి విభిన్న నమూనాను ప్రతిబింబించాలి. మొత్తానికి, కాంగ్రెస్ తన రాజకీయ చర్చను పునఃప్రారంభించాలి. పాలకపక్ష పాలనలోని ప్రతికూల అంశాలు, వాటినుండి గ్రహించిన తప్పులు, వారు ప్రచారం చేసిన రాజకీయాలపై దృష్టి పెట్టడం కంటే... ఓటర్లను ఉత్తేజపరిచే సానుకూల ఎజెండాను సమర్థించడం ద్వారా మేలు జరుగుతుంది.

వ్యాసకర్త ప్రొఫెసర్ ఎమెరిటా, సెంటర్ ఫర్ పొలిటికల్ స్టడీస్, జేఎన్‌యూ ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంతా నావాళ్లే!



భారత్‌లోని నా 41 మంది దత్త పుత్రులను (ఉత్తరాఖండ్ సిల్క్యారా సొరంగంలో చిక్కుకున్న వాళ్లు) అద్భుతంగా కాపాడగలిగిన రెస్క్యూ బృందంలో నా ఉడుత సాయం గురించి దయగా మాట్లాడిన నా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్‌కు (ఆస్ట్రేలియా) ధన్యవాదాలు.

– ఆర్నాల్డ్ డిక్స్, డిజాస్టర్ స్పెషలిస్ట్

ప్రజాస్వామ్యం తీరు



అంటే, మహువా మొయిత్రా కేసులో 104 పేజీల తన రిపోర్టును ఎథిక్స్ కమిటీ మధ్యాహ్నం 12 గంటలకు సమర్పించింది. సరిగ్గా రెండింటికి, అంటే రెండు గంటల్లో దానిమీద 'చర్చ'ను ఖరారు చేశారు. గంట తర్వాత, మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా ఈ తృణమూల్ ఎంపీని బహిష్కరిస్తున్నట్టు నిర్ణయం తీసుకున్నారు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

తప్పు జరిగింది!



కాంగ్రెస్ హయాంలో బహిష్కృత ఎంపీలకు పార్లమెంటులో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. కానీ మహువా మొయిత్రాకు ఎథిక్స్ కమిటీ ముందు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఆమె కమిటీ సభ్యులను నిందించి, ఆయాసంతో రొప్పుతూ బయటకొచ్చారు. అన్నట్టూ, తన పాస్‌వర్డ్‌ను ఇతరులకు ఇచ్చినట్టు ఆమె అంగీకరించారు.

– రణ్‌దీప్ సిసోడియా, రచయిత

అదీ తేడా!



యూఎస్ - ఇండియా సంబంధంలోని సమస్య రెండు దశల్లో ఉంది. ప్రపంచ మీద తాను ఆధిపత్యాన్ని కోల్పోయానని అంగీకరించలేని స్కిజోఫ్రెనిక్‌లా యూఎస్ వ్యవహరిస్తోంది. అదే సమయంలో ఇండియా భిన్న అధికార కేంద్రాలుండే బహుముఖ ప్రపంచాన్ని స్వాగతిస్తోంది.

– జొరావర్ దౌలత్ సింగ్, కాలమిస్ట్

అరుస్తుంది!



ఒకవేళ తీవ్రవాదిగా యూఎస్ ప్రకటించిన మనిషి ఇండియా కేంద్రంగా యూఎస్ కాంగ్రెస్, అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు వ్యతిరేకంగా బెదిరింపులకు పాల్పడుతున్నప్పుడు, అతడిని బాధ్యుడిని చేయడానికి ఇండియా సిద్ధంగా లేకపోతే యూఎస్ ఎలా స్పందిస్తుంది?

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

ఇన్ బాక్స్

హక్కుల కోసం...

మానవుల మాన ప్రాణాలకు భరోసా కల్పించేవి 'మానవ హక్కులు.' ఇవి ఎవరో ఇస్తే వచ్చేవి కాదు. పుట్టుకతో ప్రతి వ్యక్తికి లభించే హక్కులు. ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10న 'విశ్వ మానవ హక్కుల ప్రకటన' ద్వారా మానవ హక్కుల ప్రాధాన్యతను ప్రపంచానికి తెలిపింది. ఒక మనిషి – జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ లేదా ఇతర కారణాలతో ఏ విధమైన వివక్షకు గురైనా అది మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. వివక్షకు గురైన వ్యక్తి గానీ, అతని బంధువులు గానీ లేదా ఏదైనా స్వచ్ఛంద సంస్థ గానీ ఆ వ్యక్తికి జరిగిన అన్యాయంపై మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసుకోవచ్చు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడం కోసం కోర్టులతో పాటు మానవ హక్కుల కమిషన్లు, అంతర్జాతీయ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఏర్పాటు చేయబడ్డాయి. వీటికి పౌరుల పట్ల రాజ్యం, వ్యక్తులు సాగిస్తున్న అణచివేతను ప్రశ్నించి, శిక్షించే అధికారం ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలపై, బాల బాలికలపై, పేదవారిపై, కిందిస్థాయి ఉద్యోగులపైన అనేక రకాలుగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నట్లుగా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అధ్యయన సంస్థ తెలుపుతోంది.

క్రీ.శ. 1215లో విడుదలైన మాగ్నాకార్టా మొట్టమొదటి మానవ హక్కుల ప్రకటన. భారతదేశంలో 1994 జనవరి 8 నుండి 'మానవ హక్కుల పరిరక్షణ చట్టం అమలులోకి వచ్చింది. చిత్రహింసలు, క్రూరత్వం నుండి రక్షణ పొందటం; బానిసత్వం వంటి దురాచారాల నుండి రక్షణ పొందటం, వివక్షకు గురికాకుండా ఉండటం, నిర్బంధం లేకుండా జీవించడం; స్వేచ్ఛగా స్వదేశంలో, విదేశాల్లో పర్యటించగలగటం వంటి హక్కులతో పాటూ జీవించే హక్కు, సామాజిక భద్రత హక్కు, భావ స్వాతంత్రపు హక్కు వంటివన్నీ మానవ హక్కులే. వీటిని రక్షణ కోసం అనేక ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి.

– డా॥ గుబ్బల రాంబాబు, రాజమహేంద్రవరం

(డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం)

సింగరేణిలో భారాసా ఎందుకు ఓడింది?

అభిప్రాయం



ప్రదీప్ రావు ఎరబెల్లి

ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమ నేత అయిన కేసీఆర్ వెంటే నాటి సింగరేణి కార్మికులు నడిచారు. మొదటి రాష్ట్ర అసెంబ్లీ ఎన్ని కల్లో సింగరేణిలో మెజార్టీ స్థానాలను కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ చేజిక్కించుకుంది. అదే 2018 ముందస్తు ఎన్నికల నాటికి ఒక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు మినహా మిగిలిన అన్ని చోట్ల సింగరేణిలో కారు పార్టీకి భంగపాటు తప్ప లేదు. ఇక నిన్న కాక మొన్న జరిగిన 2023 ఎన్నికల్లో యావత్ సింగరేణి ప్రాంతంలో 11 నియోజక వర్గాల్లో 10 స్థానాల్లో గులాబీ పార్టీ ఓటమి పాలైంది. ఉద్యమంలో కేసీఆర్ ఏ పిలుపుకైనా రాష్ట్రంలోనే మొదటగా సింగరేణి బావులపై కార్యాలయాల్లో మద్దతు తెలిపిన ఉద్యోగులు ఇప్పుడు ఎందుకు కేసీఆర్ నాయకత్వానికి విరుద్ధంగా మారారు?

కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సింగరేణి కార్మికులకు ఇచ్చిన అనేక హామీలు నెరవేర్చినా... ఉద్యోగుల దశాబ్దాల కల అయిన 'వారసత్వ ఉద్యోగాల కల్పన' హామీ అమలు పట్ల తాత్సారం జరిగింది. దీంతో కేసీఆర్ నాయకత్వం పట్ల సింగరేణి కార్మికుల్లో కొంత విముఖత ఏర్పడింది. ఈ ప్రాంతంలో కారు పార్టీ పుట్టి మునగడానికి దాని అనుబంధ కార్మిక సంఘ టీబీజీకేఎస్ కారణం అనేది సుస్పష్టం. ఉద్యమంలో తన వెంట ఉన్న సింగరేణి కార్మికుల పట్ల ఎంతో ప్రేమతో కేసీఆర్ ఎన్నో హామీలు నెరవేర్చినా క్షేత్రస్థాయిలో నాయకత్వ వ్యవహారాల కారణంగా కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. టీబీజీకేఎస్‌లో వర్గపోరు, మితిమీరిన రాజకీయ జోక్యం, అవినీతి, పైరవీలు– కార్మికుల్లోనూ, ఆ ప్రాంత ప్రజల్లోనూ అధికార పార్టీ పట్ల వ్యతిరేకతకు దారితీశాయి. మరీ ముఖ్యంగా రెండు దశాబ్దాలుగా నిలిచిపోయిన కారుణ్య నియామకాల ప్రక్రియను న్యాయస్థానం కొర్రీలు దాటి మరీ 20 వేలమందికి కొత్తగా ఉద్యోగ అవకాశం కల్పించినా... అక్కడ బీఆర్ఎస్ ఓడటం గమనార్హం.

టీబీజీకేఎస్ సంఘం నేతలు పైరవీకారులుగా మారి ఒక్కో కార్మికుడి నుండి లక్షల్లో వసూలు చేయడం, పదవీ విరమణ పొంది కూడా యూనియన్లలో నాయకులుగా కొనసాగుతూ సర్వసాధారణంగా జరగాల్సిన పనులైన బదిలీలు, డిప్యూటేషన్లు, లైట్ జాబ్, క్వార్టర్ కేటాయింపు లాంటి ప్రతి పనికీ ఒక రేటు కట్టి వసూలు చేయటం, స్థానిక ఎమ్మెల్యేల రాజకీయ జోక్యం, సింగరేణి నిధులను యధేచ్ఛగా ఇతర



ప్రాంతాలకు తరలించడం వంటివి భారాసాకు ప్రతికూలంగా మారాయి.

గనిలో దిగి పనిచేయని వాళ్ళు నాయకులుగా చలామణి అవుతూ... వాళ్ళ అడుగులకు మడుగులొత్తే వారికి పదవులు ఇవ్వడం, వారు పైరవీలకే తప్ప కార్మికుల హక్కుల సాధనపై కనీస దృష్టి పెట్టక పోగా ప్రశ్నించిన ఉద్యోగులను వేదింపులకు గురిచెయ్యటం ప్రభుత్వ వ్యతిరేకతకు ప్రధాన కారణం. కార్మికులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ప్రకటించే 'శ్రమశక్తి' అవార్డులను సైతం అసలు కార్మికులకు కాకుండా ఆఫీస్ విధులు నిర్వహించిన నాయకులకూ, మూడు నాలుగు ఏళ్ళక్రితం రిటైర్ అయిన వాళ్లకూ ఇవ్వడం, అసలు కార్మికులను పట్టించుకోకపోవడం వంటి ఎన్నో కారణాలు సింగరేణిలో కేసీఆర్ నాయకత్వానికి ఇబ్బందిగా మారాయి.

ఈ విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని బీఆర్ఎస్ తక్షణ దిద్దుబాటు చర్యలు తీసుకుంటే తప్ప భవిష్యత్తులో సింగరేణి ప్రాంతాల్లో ఆ పార్టీ విజయం సాధించలేదు. కేవలం బీఆర్ఎస్, దాని అనుబంధ కార్మిక సంఘమే కాదు... అన్ని పార్టీలూ, వాటి అనుబంధ కార్మిక సంఘాలూ తమ తమ తీరు తెన్నులు మార్చుకోవాల్సిన అవసరం ఉంది. సింగరేణిలో ప్రస్తుతం పనిచేస్తున్న వారికి మాత్రమే యూనియన్ నాయకత్వంలో అధిక ప్రాధాన్యత కల్పించాలి. హక్కుల సాధన, వసతుల ఏర్పాటు, సంక్షేమం, రక్షణ, భద్రత వంటి విషయాల్లో చర్చలకు కార్మికులకు అధిక ప్రాధాన్యం ఉండాలి. అలా కాకుండా క్లర్కులుగా, ఇతర ఆఫీస్ పనులు చేసేవారినీ, రిటైర్ అయిన వారినీ నాయకులుగా చర్చల్లో భాగం చేయడం సరికాదు.

టీబీజీకేఎస్‌తో పాటు రానున్న ఎన్నికల్లో ఎవరైతే పూర్తి స్థాయిలో కార్మికుల మన్ననలు పొందాలని అనుకుంటున్నారో ఆ సంఘాలన్నీ వాటి కమిటీల్లో ప్రస్తుతం విధుల్లో ఉన్న యువ కార్మికులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వారిని మాత్రమే చర్చల్లో భాగస్వామ్యులను చెయ్యాలి. పదవీ విరమణ పొందిన వారి అనుభవాన్ని వాడుకోవడానికి కేవలం యూనియన్ కార్యాలయాన్ని మాత్రమే పరిమితం చేయాలి. సింగరేణిలో జరిగే ప్రతి కార్యక్రమంలోనూ యువ కార్మికులకు పెద్దపీట వేయాలి. అలాగే పైరవీకారులను గుర్తించి వారి ఆగడాలనుండి కార్మికులను రక్షించాలి. ఇలా చేసినవారికే కార్మికులు మద్దతు ఇస్తారనేది సత్యం!

వ్యాసకర్త సింగరేణి ఉద్యోగి | 99660 89696

ప్రకృతి నియమాలు

ప్రపంచం కొన్ని నియమాలను అనుసరించి నడుస్తోంది. అందులో మొదటిది కార్యకారణ సంబంధాన్ని సూచించే కర్మ సిద్ధాంతం. కర్మ ఎలాంటిదైతే, ఫలితం అలాంటిదై ఉంటుంది అని దీని సారాంశం.

రెండో నియమం ప్రారబ్ధ కర్మకు సంబంధించినది. పూర్వ జన్మలో చేసిన కర్మల వల్ల ఏర్పడిన సంస్కారాలు, ఈ జన్మను ప్రభావితం చేస్తాయి. ఇక మూడోది మహత్యాలకు సంబంధించినది. గాలిలో ఎగరటం, నీటిలో నడవటం లాంటివి మహత్యాలు అనిపించుకొంటాయి. మహత్యాలు ప్రకృతిలో ఉండే సాధారణ నియమాలకు విరుద్ధంగా ఉన్నాయని అనిపిస్తుందిగానీ, అది నిజం కాదు. బాహ్యంగా కనిపించే భౌతిక జగత్తు ఏ విధంగా ఉన్నదో, ఆంతరంగికమైన సూక్ష్మ జగత్తు కూడా ఆ విధంగా ఒకటి ఉన్నది. ఆధ్యాత్మికంగా పై మెట్టులో ఉన్న వారు మాత్రమే ఆంతరంగికమైన సూక్ష్మ జగత్తును దర్శించగలరు. వారు ఆ జగత్తులో ఉన్న నియమాలను తెలివిగా, నేర్పుతో ఉపయోగపెట్టినప్పుడు, మనం వాటిని మహత్యాలు అంటున్నాము. అయితే ఆ మహత్యాలను మనం మనకు తెలిసిన ప్రకృతి సూత్రాలు, నియమాల ప్రకారం వివరించలేము, సమర్థించలేము.

జ్యోతిర్మయం

వేటినైతే మనం ప్రకృతి నియమాలు, మహత్యాలు అని అంటున్నామో అలాంటి అన్ని విధాలైన నియమాలను అధిగమించినదీ, నియంత్రించగలిగినదీ ఒకే ఒక్కటి ఉన్నది. అదే భగవంతుని నిర్వ్యాజ ప్రేమ, అవ్యాజ కరుణ. దేనినైనా మనం మహత్యం అని అనాలంటే, అలా అనతగ్గది ఒక్క దైవానుగ్రహం మాత్రమే. ఇక్కడొక ప్రశ్న ఉదయిస్తుంది. భగవంతుడు మహత్యాలు చేస్తాడా అని. దానికి సమాధానం ఏమంటే, భగవంతుడు అన్నీ చేస్తాడు, అదే సమయంలో ఏదీ చెయ్యడు అని. ఇంకా చెప్పాలంటే, భగవంతుడు చేసిన ఒకే ఒక్క మహత్యం సమస్త విశ్వాన్ని సృష్టించటమే. ఆ ఒక్కటి మహత్యాల్లోకెల్లా మహత్యం. అంతకు మించిన మహత్యం ఇంకేం ఉంటుంది? సృష్టిలో ఏ అతి చిన్న అణువును చూసినా, అది మానవ మేధస్సుకు అందని వింతల్లోకెల్లా వింతగా తోస్తుంది. విశ్వంలో అటువంటి అణువులు అసంఖ్యాకం.

భగవంతుడు అన్నీ చేస్తాడు అనీ, ఇంకో అర్థంలో ఏదీ చెయ్యడు అనీ చెప్పవచ్చు. భగవంతుడు స్వయంగా ఏదీ చెయ్యకపోయినా, ప్రేమతో, సర్వార్పణ బుద్ధితో ఎవరైతే తనను ఆశ్రయిస్తారో, వారు ఆధ్యాత్మికంగా అన్ని లాభాలు పొందుతారు, భగవంతుడు కల్పించుకొని ప్రత్యేకంగా ఏమీ చేయకపోయినా. ఆ విషయంలో భగవంతుని గంధపు చెట్టుతో పోల్చవచ్చు. ఆ చెట్టు అన్ని దిక్కులకూ తన సుగంధాన్ని నిరంతరం వెదజల్లు ఉంటుంది. దాని దగ్గరకు వెళ్లినవారు ఆ సుగంధాన్ని ఆఘ్రాణిస్తారు. దగ్గరకు రానివారికి సుగంధం లభించదు. అలాగే భగవంతుడు కూడా అన్నీ చేస్తాడు, ఏదీ చెయ్యడు. అన్నీ ఇస్తాడు, ఏదీ ఇవ్వడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.ద్వాదశి తె.5.13 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** చిత్త ఉ.9.10 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ప.3.08 నుండి 4.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.21 నుండి 7.50 వరకు, **అమృతఘడియలు:** రా.1.20 నుండి 3.02 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.22, **సూర్యాస్తమయం:** 5.22.

నేడు ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

గాంధీభవన్‌కు వెళ్లనున్న సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్, ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించేందుకు టీపీసీసీ ఏర్పాట్లు చేస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జర గబోతున్న సోనియా జన్మదిన వేడుకలను ఆర్భాటంగా నిర్వహించనుంది. శని వారం ఉదయం 9 గంటలకు గాంధీభవన్‌లో జరగనున్న ఈ వేడుకలకు ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, పా ర్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పాల్గొననున్నారు. కాగా, సోనియా ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తూ సీనియర్ నేత వి.హనుమంతరావు పెద్దమ్మ గుడిలో శుక్ర వారం పూజలు చేశారు. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు.

'పార్టీకి ద్రోహం చేసినోళ్లను క్షమించం'



కూసుమంచి/తిరుమలాయపాలెం: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి కొందరు వ్యక్తులు ద్రోహం చేశారని, వారిని క్షమించేది లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి, తిరుమలాయపాలెంలో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా డబ్బు వెదజల్లగా, పాలేరు నియోజకవర్గంలో మరింత అడ్డగోలుగా ఖర్చు చేశారని ఆరోపించారు. ఒక్కో ఓ టుకు పాలేరులో రూ.వేలల్లో నగదు ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని విమర్శించారు. పార్టీ బలం తగ్గలేదనీ, ఎన్నికల్లో వచ్చిన ఓట్లను పరిశీలిస్తే ప్రజల మద్దతు తగ్గినట్లు అర్థమవుతోందనీ, దీన్ని పెంచుకునే దిశగా ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని శ్రేణులకు సూచించారు.

సైకో కిల్లర్ అరెస్టు

- మహిళా అడ్డా కూలీలే టార్గెట్
- ఏడు హత్య కేసుల్లో నిందితుడు
- తాజాగా ఓ మహిళా కూలీని చంపిన సైకో



తాండూరు పోలీసుల అదుపులో నిందితుడు కిష్టప్ప

తాండూరు టౌన్: ఏడు హత్య కేసుల్లో నిందితుడి గా ఉన్న ఓ సైకో కిల్లర్‌ను తాం డూరు పోలీసులు అరెస్టు చేశారు. మహిళా అడ్డా కూలీలే అతని టార్గెట్. వారిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి హత్య చేసి, ఒంటిపై ఉన్న నగలు, నగదుతో పరారయ్యేవాడు. తాజాగా తాండూరు పట్టణంలో ఓ మహిళా కూలీ అదృశ్యం కేసులో పోలీసులకు పట్టుబడ్డాడు. తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్, పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి శుక్రవారం ఆ వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా మడ్కల్ గ్రామానికి చెందిన సర్వాబి(42) తన భర్తతో కలిసి తాండూరు పట్టణంలోని ధన్‌గర్ గల్లీలో నివాసం ఉంటూ కూలి పనిచేస్తుండేది. గత నెల 29న పని నిమిత్తం వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో భర్త మహ్మద్ ఈ నెల 1న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల ఆధారంగా స్థానిక శాంత్‌మహల్ చౌరస్తా నుంచి సర్వాబి, ఓ వ్యక్తితో కలిసి ఇందిరాచౌక్ వెళ్తున్నట్లు గుర్తించారు. ఆ వ్యక్తి వికారాబాద్ జిల్లా ధారూరు మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కూలి పనిచేసే మాల కిష్టప్పగా(50) పోలీసులు గుర్తించారు. గురువారం అదుపులోకి తీసుకుని కిష్టప్పను విచారించగా తానే హత్య చేశానని చెప్పడంతో, ఘటనా స్థలానికి నిందితున్ని తీసుకెళ్లి కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు.

జైలు నుంచి బయటికొచ్చి..

గత నెల 29న సర్వాబికి మాయమాటలు చెప్పి తట్టేపల్లి సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి ఆమె కొంగుతోనే మెడకు బిగించి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.1000 నగదు, కాళ్ల పట్టీలు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితునిపై వికారాబాద్ పీఎస్‌లో 4 కేసులు, ధారూరులో ఒకటి, యాలాల లో ఒక హత్య కేసు నమోదైంది. తాజాగా పట్టణంలో మరో కేసు నమోదు చేశారు. ఓ కేసులో 2021 నుంచి జైలులో ఉన్న కిష్టప్ప రెండు నెలల క్రితమే బయటకు వచ్చి సర్వాబిని హత్య చేశాడు.

ఫ్లైట్ రెడీ



- హైదరాబాద్ నుంచి మరిన్ని నగరాలకు విమాన సర్వీసులు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఎయిర్‌పోర్టు సేవలు విస్తరించాయి. పలు జాతీయ, అంతర్జాతీయ నగరాలకు కనెక్టివిటీ పెరిగింది. గతంలో సుమారు 69 నగరాలకు విమాన సర్వీసులు అందుబాటులో ఉండగా ఇప్పుడు ఆ సంఖ్య 80 కి చేరింది. లక్నో, అమృత్‌సర్, కొచ్చిన్ నగరాలకు ఎయిర్‌ఇండియా కొత్తగా సర్వీసులను ప్రారంభించింది. అలాగే మహారాష్ట్రలోని సరిహద్దు నగరమైన గోండియాకు కొత్తగా ఇండిగో సర్వీసులను ప్రారంభించింది. త్వరలో ఇండోనేషియా, వియత్నాం, కజకిస్తాన్ తదితర దేశాలకు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. దేశంలో దక్షిణాది రాష్ట్రాలకు ముఖద్వారంగా భావించే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టర్మినళ్లు, మౌలిక సదుపాయాలను పెంపొందించడంతో పలు ఎయిర్‌లైన్స్‌కు చెందిన సర్వీసులు గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి జాతీయ, అంతర్జాతీయ నగరాలకు విమాన సర్వీసులను నడపడంలో ఇండిగో వంటి సంస్థలు మరింత ఆసక్తి చూపడం విశేషం.

సర్వీసులు పెరిగాయి....: సింగపూర్ ఎయిర్‌లైన్స్ ప్రస్తుతం హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు ప్రతిరోజు విమానాలను నడుపుతోంది. ఇండిగో ఎయిర్‌లైన్స్ సైతం సింగపూర్‌కు 7 విమానాలతో సేవలను ప్రారంభించింది. మాల్దీవులు, కొలంబో నగరాలకు కూడా ఇండిగో సర్వీసులను పునరుద్ధరించారు. కువైట్ ఎయిర్ వేస్ హైదరాబాద్ నుంచి కువైట్‌కు సర్వీసులను పునరుద్ధరించింది. వచ్చే జనవరి నుంచి లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ఫ్రాంక్‌ఫర్ట్ నగరానికి నేరుగా విమానాలను నడుపనుందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ నుంచి గ్వాలియర్‌కు కూడా కనెక్టివిటీని ప్రారంభించింది.

ఎయిర్‌పోర్ట్ విస్తరణ...: ప్రయాణికుల రద్దీ, విమాన సర్వీసులను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు విస్తరణ చేపట్టారు. రానున్న రోజుల్లో ఏటా 3.4 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యానికనుగుణంగా ఈ విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 23.42 లక్షల చదరపు అడుగులు ఉండగా, అదనంగా 6.07 లక్షల చదరపు అడుగులతో ప్యాసింజర్ టర్మినల్‌ను అనుసంధానం చేశారు. ఇటీవల తూర్పు వైపు టర్మినల్ విస్తరణ చేపట్టారు. దీంతో మొత్తం వైశాల్యం 29.50 లక్షల చదరపు అడుగులకు పెరగనుంది. దశలవారీగా కొత్త ఫీచర్లు, సౌకర్యాలు, విమాన స్టాండ్లు, వేగవంతమైన టాక్సీ వేలు, కొత్త సమాంతర టాక్సీ వేలు, సాంకేతిక పరిష్కారాలు తదితర ప్యాసింజర్ టెర్మినల్, ఎయిర్‌సైడ్ ప్రాంతాల సేవలను విస్తరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం చికాగో, న్యూయార్క్, శాన్‌ఫ్రాన్సిస్కో, డల్లాస్, మెల్బోర్న్, సిడ్నీ, పారిస్, ఆమ్‌స్టర్‌డామ్, ఇండోనేషియా, వియత్నాం, కజకిస్థాన్, నేపాల్లోని గమ్యస్థానాలకు కనెక్టివిటీని పెంచడంపై దృష్టి సారించింది.

కోటీ 20 లక్షల మంది ప్రయాణికులు...

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కోటీ 20 లక్షల మందికి పైగా రాకపోకలు సాగించినట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ప్రయాణికుల సంఖ్య గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోల్చితే 15 శాతం నుంచి 24 శాతం వరకు అదనంగా పెరిగినట్లు అంచనా. సిర్రం నివేదిక ప్రకారం మెరుగైన సేవలను అందజేయడంలో హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచంలోనే మూడవ ఉత్తమ విమానాశ్రయంగా గుర్తింపును పొందింది. ప్రయాణికుల రద్దీ పరంగా హైదరాబాద్ దేశంలో 6 వ స్థానం నుంచి తాజాగా 4వ స్థానానికి చేరుకుంది. కోవిడ్‌కు ముందు 55 దేశీయ గమ్యస్థానాలకు మాత్రమే కనెక్టివిటీ ఉండగా, ఇప్పుడు 66 నగరాలకు పెరిగింది.

లోపం ఎక్కడుంది?

- రంగారెడ్డి జిల్లా 'ధరణి'లో అక్రమాలపై అంతా సైలెంట్
- గుట్టుగా ఆమోదం పొందినా గుర్తించని అధికారులు
- ఇద్దరు నిందితులను విచారిస్తున్న పోలీసులు
- తమకు ఏమీ తెలియదంటున్న నిందితులు

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ధరణి'పోర్టల్ కొంత మందికి కాసుల వర్షం కురిపిస్తోంది. భూమి విస్తీర్ణం, ప్రాంతాన్ని బట్టి దరఖాస్తులకు ధరలు నిర్ణయిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి, అలాగే రైతుల ఇబ్బందులను అవకాశంగా తీసుకుని కొందరు ఈ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అడిగినంత ముట్టజెప్పితే చాలు.. క్షేత్రస్థాయి నివేదికలు, సంబంధిత ఉన్నతాధికారుల సంతకాలతో సంబంధం లేకుండానే వివాదాస్పద భూములను సైతం మార్పిడి చేసేస్తున్నారు. అప్పటి వరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు కూడా క్లియర్ అవుతుండటాన్ని పరిశీలిస్తే.. ఖరీదైన ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, అర్బన్ సీలింగ్ భూములు ఏ విధంగా అన్యాక్రాంతమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల రంగా రెడ్డి జిల్లా ధరణి పోర్టల్‌లో చోటు చేసుకున్న అక్రమాలే ఇందుకు నిదర్శనమని చెపుతున్నారు. జిల్లా కలెక్టర్ లాగిన్ చేస్తే కానీ ఓపెన్ కానీ ధరణి పోర్టల్ ఏవిధంగా తెరుచుకుంది? 98 వివాదాస్పద దరఖాస్తులు ఏ విధంగా క్లియర్ అయ్యాయనేది? అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది.

అనుమానం మొదలైంది అక్కడే..

రంగారెడ్డి జిల్లాలో ధరణి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ అక్టోబర్ 20 నుంచి 23 మధ్యలో 20 దరఖాస్తులను క్లియర్ చేసేందుకు పోర్టల్ లాగిన్‌ను ఓపెన్ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ధరణి ఆపరేటర్లు వారికి ముడుపులిచ్చినవారికి సంబంధించిన వివాదాస్పద దరఖాస్తులను (అక్టోబర్ 14 నుంచి నవంబర్ 11 మధ్య కాలంలో) క్లియర్ చేసుకున్నట్లు తేలింది. అయితే తాను కేవలం 20 దరఖాస్తులనే ఆమోదిస్తే.. వివిధ కేటగిరీలకు సంబంధించిన మరో 98 దరఖాస్తులు ఎలా క్లియర్ అయ్యాయనే అంశంపై ఇటీవల కలెక్టర్‌కు అనుమానం వచ్చినట్లు తెలిసింది.

అన్నీ వివాదాస్పద భూములవే..

ఆ వెంటనే జిల్లా కలెక్టర్ సీసీఎల్‌ఏ అధికారులను సంప్రదించారని సమాచారం. అయితే అటు నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అధికారులు అంతర్గత విచారణ చేపట్టారు. తన ప్రమేయం లేకుండానే వివాదాస్పదంగా ఉన్న 98 దరఖాస్తులు ఆమోదం పొందిన అంశాన్ని కలెక్టర్ భారతిహోళికేరి సీరియస్‌గా తీసుకున్నారు. దీంతో కలెక్టరేట్ పరిపాలనాధికారి ఈనెల 5న పోస్ట్ ద్వారా ఆదిభట్ల పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు పంపారు. దీంతో పోలీసులు ఈ వ్యవహారంలో ప్రమేయం ఉందని భావిస్తున్న ధరణి సమన్వయకర్త నరేశ్, ఆపరేటర్ మహేశ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మాకు ఏ పాపం తెలియదు..

కలెక్టర్ ప్రమేయం లేకుండా దరఖాస్తులు ఎలా క్లియర్ అయ్యాయనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతున్నా.. వాటిని నివృత్తి చేయాల్సిన అధికారులంతా గప్‌చిప్ అయ్యారని తెలుస్తోంది. ఎవరికి వారు తమకు సంబంధం లేదు అన్నట్లుగా మిన్నకుండిపోయారని చెపుతున్నారు. ఇదిలా ఉంటే పోలీసుల అదుపులో ఉన్న నిందితులు నరేశ్, మహేశ్‌లు సైతం తమకే పాపం తెలియదని చెపుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరిపితే కానీ అక్రమాల్లో ఎవరెవరి పాత్ర ఉందన్న విషయం బయటకు రాదని స్థానికులు అంటున్నారు.

'ట్రోలింగ్' వెనుక ఎవరున్నారు?

- కిషన్‌రెడ్డి సహా ముఖ్యనేతలు లక్ష్యంగా వ్యతిరేక ప్రచారం
- వీటిని తిప్పికొట్టాలని పార్టీ నాయకత్వం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వివిధ సామాజిక మాధ్యమాల్లో పార్టీ నేతలే లక్ష్యంగా 'ట్రోలింగ్' సాగడంపై బీజేపీలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎనిమిది సీట్లకే పరిమితం కావడాన్ని ఎత్తిచూపుతూ పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వివిధ రకాల మీమ్స్, సందేశాలు ప్రచారం చేస్తుండటాన్ని బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఇతర నేతలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ప్రచారం చేయడం వల్ల పరోక్షంగా బీజేపీ ఇమేజీ కూడా దెబ్బతింటోందని అంటున్నారు. పార్టీని, నేతలను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో పెడుతున్న పోస్టులను చూసి ముఖ్యనేతలు మనస్తాపానికి గురైనట్టు తెలుస్తోంది. ఇలాంటి వాటివల్ల అంతిమంగా పార్టీకే నష్టం జరగనున్నందున ట్రోలింగ్ అంశంపై నాయకత్వం అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. ప్రతికూల ప్రచారం పట్ల పార్టీ నాయకులు, శ్రేణులు అప్రమత్తమై అలాంటి వాటిని ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో పాటు షేరింగ్‌లు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీలో అంతర్గత సూచనలు జారీ చేసినట్టు తెలుస్తోంది. అలాగే ఇలాంటి అభ్యంతరకర పోస్టులను తిప్పికొడుతూ పోస్టింగ్‌లు కూడా పెట్టాలని సూచించినట్టు తెలిసింది. శాసన సభ ఎన్నికల నేపథ్యంలో కొంతకాలంగా పార్టీలోని కొందరు నేతలు సొంతంగా సోషల్ మీడియా టీమ్‌లను ఏర్పాటు చేసుకుని తమ ప్రచారాన్ని సాగిస్తున్న విషయం విదితమే. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం పార్టీని, నేతలను టార్గెట్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పెడుతున్న పోస్టింగ్‌లు, కొందరు నేతలను టార్గెట్ చేస్తూ పనిగట్టుకుని ట్రోలింగ్ చేయడం వెనక పార్టీలోని వారే ఉన్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వీటి వెనక ఎవరున్నారు, అసలు ఆయా నేతలను ఎందుకు టార్గెట్ చేస్తున్నారు, అందుకు కారణాలు ఏమిటన్న దానిపై రాష్ట్ర పార్టీ లోతుగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకతను | క్యాష్ చేసుకోలేకపోయాం

- బీజేపీ నేత మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తమ పార్టీ క్యాష్ చేసుకోలేక పోయిందని బీజేపీ నేత, మధ్యప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్‌ను ఓడించే విషయంలో బీజేపీ కన్నా కాంగ్రెస్ బలంగా ఉందని ప్రజలు నమ్మినందునే రాష్ట్రంలో ఈ ఫలితాలు వచ్చాయన్నారు. వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని, ఆ హామీలను ఆ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రగతి భవన్ ఇనుప కంచెలు కూల్చడం మంచిదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలన అందించాలని కోరుకుంటున్నామని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ప్రజల వద్దకు వస్తారని ఆశిస్తున్నామని చెప్పారు. కాగా, తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ పార్టీ గెలవబోదని అన్నారు.

'ప్రజా ప్రభుత్వమిది'

సాక్షి, హైదరాబాద్: ప్రజలు కోరుకున్న ప్రభుత్వం ఏర్పడిందని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు పెట్టుకున్న ఆశలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని ఆశిస్తున్నట్టు రాములు పేర్కొన్నారు.

రైతుపై చిరుత దాడి

- కాలు వెనుక భాగంలో తీవ్ర గాయం..
- ఆస్పత్రికి తరలించిన గ్రామస్తులు



బాన్సువాడ (కామారెడ్డి): కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామ శివారులో చిరుత పులి ఓ రైతుపై దాడి చేసింది. శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్ల విజయ్ రోజుమాదిరే మంజీర నది సమీపంలోని తన పొలంలో పని చేసేందుకు వెళ్లాడు. పొలంలో పని చేస్తున్న సమయంలో ఒక్కసారిగా చిరుత పులి వచ్చి దాడి చేసింది. రైతు వెంటనే అప్రమత్తమై తన చేతిలో ఉన్న పారతో పులిని కొట్టగా అది అక్కడి నుంచి పారిపోయింది. చిరుత దాడిలో విజయ్ కాలు వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. భయంతో గ్రామానికి వచ్చిన విజయ్ చిరుత దాడి విషయాన్ని గ్రామస్తులకు చెప్పగా... వారు అతడిని బీర్కూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు అక్కడి నుంచి బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. చిరుత పులి సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత పులి జాడ కోసం అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

రూ.3 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

- డ్రగ్స్ తయారీ కేంద్రంపై పోలీసుల దాడులు
- ఐదుగురు నిందితుల అరెస్టు
- సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ వెల్లడి



పోలీసులు సీజ్ చేసిన డ్రగ్స్, ఇతర రసాయనాలు

జిన్నారం (పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం కొడకంచి శివారులో రూ.3 కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు, యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఐదుగురు నిందితులను అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. జిల్లా ఎస్పీ రూపేశ్ కథనం ప్రకారం.. కొడకంచి గ్రామానికి ఐదు కిలో మీటర్ల దూరంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన 3.30 ఎకరాల భూమి ఉంది. ఇక్కడ వాటర్ ప్లాంట్‌తో పాటు అదనంగా మూడు గదులు ఉన్నాయి. కొడకంచి గ్రామానికి చెందిన కిష్టంగారి శివకుమార్‌గౌడ్ ఆధీనంలో ఈ భూమి ఉంది. కాగా, ఓ రసాయన పరిశ్రమలో డ్రగ్గిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న పసుపులేటి మాణిక్యాలరావు అతని మిత్రులు గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్, కిష్టంగారి నిర్మల్‌గౌడ్, ఎండీ యూసుఫ్ తేలిగ్గా డబ్బులు సంపాదించే లక్ష్యంతో మాదకద్రవ్యాలను తయారు చేయాలని నిర్ణయించారు. రసాయనాల తయారీపై మాణిక్యాలరావుకు పట్టు ఉండటంతో గ్రామానికి దూరంగా స్థలం ఉంటే బాగుంటుందని భావించారు. దీంతో శివకుమార్‌గౌడ్‌ను సంప్రదించి ఆయన ఆధీనంలోని భూమిని లీజుకు తీసుకున్నారు. అక్కడ ఉన్న మూడుగదుల్లో రూ.25 లక్షలు వెచ్చించి ఓ రియాక్టర్, కూలర్, డ్రయ్యర్‌తో పాటు ఇతర పరికరాలను ఏర్పాటు చేసి డ్రగ్స్ తయారీ ప్రారంభించారు. ఈ సమాచారం తెలుసుకున్న జిన్నారం పోలీసులు, యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు డ్రగ్స్ తయారీ కేంద్రంపై గురువారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.3 కోట్ల విలువైన డ్రగ్స్‌తో పాటు తయారీ మిషన్‌లను సీజ్ చేశారు. నిందితులు మాణిక్యాలరావు, శివశంకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నిర్మల్‌గౌడ్, ఎండీ యూసుఫ్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ప్రమేయం ఉన్న రాహుల్ రెడ్డి, శ్రీశైలంయాదవ్‌లు పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని ఎస్పీ తెలిపారు. మాణిక్యాలరావు, ఎండీ యూసుఫ్‌లు గతంలో కూడా డ్రగ్స్ కేసుల్లో శిక్షలు అనుభవించారని ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శ్రీధర్, పటా న్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణు కుమార్, ఎస్ఐ విజయారావు పాల్గొ న్నారు.

తిష్ట వేసిన అధికారుల్లో గుబులు!

- వైద్య ఆరోగ్యశాఖలో ఆరేడేళ్లుగా కొనసాగుతున్న కొందరు
- వీరిలో డీహెచ్, డీఎంఈ, టీఎస్‌ఎంఐడీసీ ఎండీ తదితరులు
- కొత్త ప్రభుత్వం రావడంతో వీరికి స్థాన చలనంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: వైద్య ఆరోగ్య శాఖలో కొందరు విభాగాధిపతులు ఆరేడేళ్లు ఒకే పోస్టులో తిష్టవేశారు. దీంతో అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వీరిలో గుబులు మొదలైంది. ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు దాదాపు ఆరేళ్లకు పైగా ఆ పోస్టులో కొనసాగుతున్నారు. కేసీఆర్ మొదటి విడత ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా లక్ష్మారెడ్డి ఉండగా ఆయన బాధ్యతలు తీసుకున్నారు. రాష్ట్రం విడిపోయిన నేపథ్యంలో శ్రీనివాసరావుకు సులువుగా అవకాశం దక్కింది. సీనియర్లను కాదని ఆయనకు అవకాశం కల్పించారు. అయితే కరోనా కాలంలో ఆయనకు బాగా పేరు వచ్చింది. ఆ సమయంలోనే కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ప్రాచుర్యం పొందారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే తన తండ్రి జ్ఞాపకార్థం జీఎస్‌ఆర్ ట్రస్టును ఏర్పాటు చేసి కొత్తగూడెం నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసేందుకు ప్రయత్నించారనే ప్రచారం జరిగింది. కేసీఆర్ కాళ్లకు మొక్కడంతో పాటు కొత్తగూడెం నియోజకవర్గంలో ఇతర వివాదాలకు తావిచ్చారు. అప్పటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను పొగడటం ద్వారా ఓ రాజకీయ పార్టీకి అనుకూలురనే విమర్శలకూ గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో ఆయన ఆ పోస్టులో కొనసాగడంపై పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖలోని సంఘాల ప్రతినిధులు కొందరు ఆయన్ను ఆ పోస్టు నుంచి తొలగించాలని కోరుతున్నారు. దీంతో ఆయన మార్పు తప్పదనే చర్చ ప్రజారోగ్య విభాగంలో జరుగుతోంది. అయితే శ్రీనివాసరావు కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

డీఎంఈ రమేశ్‌రెడ్డిపైనా చర్చ

వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) రమేశ్‌రెడ్డి కూడా సుదీర్ఘకాలంగా ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. పెద్ద ఎత్తున మెడికల్ కాలేజీలను తీసుకొచ్చారన్న సానుకూలత ఆయనపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌లో ఉంది. అయితే ఉద్యోగస్తులతోనూ, డాక్టర్లతోనూ ఆయన కఠినంగా ఉంటారన్న విమర్శలు ఉన్నాయి. ఆయనపై అనేకసార్లు డాక్టర్లు ఫిర్యాదు చేశారు. అయితే కరోనా కాలంలోనూ, ఆ తర్వాత ఆయన సేవల కారణంగా కేసీఆర్ ఆయన్ను కొనసాగించారు. తాజా పరిణామాలతో ఆయన విషయమై చర్చ జరుగుతోంది. అయితే ఆయనకు ఇప్పటి ప్రభుత్వంలోనూ మంచి సంబంధాలు ఉన్నాయని, ఆయన కొనసాగుతారని రమేశ్‌రెడ్డి సన్నిహితులు చెబుతున్నారు.

ఇంకొందరు కూడా ఇలాగే..

తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ) ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఏళ్లుగా ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. కరోనా కాలం నుంచి ఆయనకు కేసీఆర్‌కు మధ్య సాన్నిహిత్యం నెలకొంది. ఇప్పుడు ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆయన ఆ పోస్టులో కొనసాగుతారా? లేదా? అని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. మరోవైపు వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ వచ్చి కొద్దిరోజులే అయినా, ఆయనకు హరీశ్‌రావుకు మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. దీంతో ఆయన కొనసాగింపు పైనా సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక వివిధ విభాగాల్లో పనిచేసే అనేకమంది అధికారులు కూడా ఏళ్లుగా తిష్ట వేశారు. వీరి స్థాన చలనం కూడా చర్చనీయాంశంగా మారింది.

19న ఎమ్మార్పీఎస్ చలో ఢిల్లీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఈ నెల 19న చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నాడు అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించి మాట తప్పిన బీజేపీ నేడు ప్రధాని మోదీ ప్రభుత్వం కమిటీ పేరుతో కాలయాపన చేస్తుండటం శోచనీయమన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పాపయ్యమాదిగ

మన్సురాబాద్ (హైదరాబాద్): ఎమ్మార్పీఎస్ తెలంగాణ నూతన అధ్యక్షుడిగా ఎల్‌బీనగర్‌కు చెందిన మేడి పాపయ్యమాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఎల్‌బీనగర్‌లోని ఎస్‌కే గార్డెన్స్‌లో శుక్రవారం జరిగిన ఆ సంఘం కోర్ కమిటీ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. గతంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన వంగపల్లి శ్రీనివాస్ సంఘ విద్రోహానికి పాల్పడ్డారని, కేడర్‌కు అందుబాటులో లేకుండా ఏకపక్షనిర్ణయాలు తీసుకున్నారని కోర్ కమిటీ అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలోనే అతడిని తొలగించి మేడిపాపయ్యను ఎన్నుకున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా మేడిపాపయ్య మాదిగ మాట్లాడుతూ...రాష్ట్రంలో ఎమ్మార్పీఎస్‌ను పటిష్టపరిచేందుకు కృషిచేస్తానన్నారు.



బంతి మొక్క... చెట్టు లెక్క!

భీమిని: బంతి మొక్క చేతికి అందనంత ఎత్తుకు పెరిగి చూపరులను ఆకర్షిస్తోంది. విరగబూసిన బంతి పూలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు చెందిన ఏదునూరి చంద్రయ్య ఇంట్లో ఉన్న బంతి మొక్క 15 అడుగులకుపైగా ఎత్తు పెరిగి పూలు విరగబూసాయి. జూన్, జూలై మధ్యకాలంలో బంతి మొలకెత్తగా కాపాడుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. ఈ బంతి చెట్టును చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

రూ.1.28 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

ఇద్దరి అరెస్టు

అల్వాల్: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి రూ.కోటీ 28 లక్షల విలువగల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ కేసు వివరాలను వెల్లడించారు. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన పియాగో గూడ్స్ క్యారియర్‌లో రహస్యంగా దాచి ఉంచిన గంజాయిని గుర్తించారు. దీంతో రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఉదమ్‌పూర్ (జమ్మూ కాశ్మీర్)కు చెందిన మనోహర్ (55), హరియాణాకు చెందిన ప్రవీణ్ కుమార్‌తో కలిసి గంజాయి రవాణా చేయడానికి ప్రణాళిక వేసుకున్నారు. ఇందులో భాగంగా ఒడిశాలోని కలెమెళ నుండి ఎండు గంజాయిని తీసుకొని గూడ్స్ వాహనంలో రహస్యంగా తయారు చేసిన కేబిన్‌లో గంజాయిని దాచి ఉంచి హరియాణాకు తరలిస్తుండగా శుక్రవారం మేడిపల్లి వద్ద ఎస్‌వోటీ, స్థానిక పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. వాహనాలతో సహా గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి 510 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.కోటీ 28 లక్షల 58 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహువాపై వేటు

లోక్‌సభ సభ్యత్వం రద్దు | నోటుకు ప్రశ్నల ఉదంతంలో స్పీకర్ నిర్ణయం | మూజువాణి ఓటుతో సభ ఆమోదం

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లోక్ సభ సభ్యురాలు మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు పడింది. ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ప్రకటించారు. డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగిన కేసులో ఆమెను దోషిగా తేలుస్తూ లోక్‌సభ ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వెలిబుచ్చగా స్పీకర్ నిర్ణయాన్ని తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. తనపై వేటును మొయిత్రా తీవ్రంగా నిరసించారు. స్పీకర్ చర్య అనర్హులైన జడ్జిలతో కూడిన (కంగారూ) కోర్టు ఉరిశిక్ష తీర్పు వెలువరించినట్టుగా ఉందంటూ ఎద్దేవా చేశారు. ఆమె పశ్చిమబెంగాల్‌లోని కృష్ణనగర్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మాట్లాడే చాన్సివ్వని స్పీకర్

మొయిత్రా ఉదంతంపై విచారణ జరిపిన బీజేపీ ఎంపీ వినోద్‌కుమార్ సోంకర్ సారథ్యంలోని ఎథిక్స్ కమిటీ శుక్రవారం మధ్యాహ్నం లోక్‌సభకు నివేదిక సమర్పించింది. ఆమెను దోషిగా తేల్చినట్టు పేర్కొంది. ''మొయిత్రా అనైతిక ప్రవర్తనకు పాల్పడ్డారు. తన లోక్‌సభ పోర్టల్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను అనధికారిక వ్యక్తులకు ఇచ్చారు. తద్వారా దేశ భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే పని చేశారు'' అని తెలిపింది. అనంతరం మొయిత్రాను సభ నుంచి బహిష్కరించాలంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తీర్మానం ప్రవేశపెట్టారు. ''మొయిత్రా ప్రవర్తన ఒక ఎంపీ స్థాయికి తగ్గట్టుగా లేదని తేలింది. ఒక వ్యాపారవేత్త నుంచి డబ్బు, కానుకలు తీసుకుని ప్రతిగా అతని ప్రయోజనాల కోసం ఇలాంటి పనులు చేయడం గర్హనీయం'' అని అందులో పేర్కొన్నారు. మొయిత్రా సభ్యత్వ రద్దుకు కమిటీ చేసిన సిఫార్సును ఆమోదించాల్సిందిగా సభను మంత్రి కోరారు. తృణమూల్‌తో పాటు కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు ఇందుకు తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. మొయిత్రాకు తన వాదన విన్పించే అవకాశమివ్వాలని డిమాండ్ చేశాయి. గత ఉదంతాలను ఉటంకిస్తూ అందుకు స్పీకర్ నిరాకరించారు. ''2005లో నగదుకు ప్రశ్నల కుంభకోణానికి పాల్పడ్డ 10 మంది లోక్‌సభ సభ్యులను నాటి స్పీకర్ సోమనాథచటర్జీ సభ నుంచి బహిష్కరించారు. ఆ సందర్భంగా సదరు ఎంపీలకు తమ వాదన చెప్పుకునే అవకాశమివ్వలేదు. అంతేకాదు, ఈ ఉదంతంపై ఎథిక్స్ కమిటీ నివేదిక సభకు అందిన రోజే దాని సిఫార్సు మేరకు వారిపై అనర్హత వేటు వేయాలని సభను కోరుతూ నాటి లోక్‌సభ నేత ప్రణబ్ ముఖర్జీ తీర్మానం ప్రవేశపెట్టారు'' అని గుర్తు చేశారు. అనంతరం నివేదిక, తీర్మానంపై కాసేపు వాడివేడి చర్చ జరిగింది. నివేదికను విశ్లేషించేందుకు సభ్యులకు కనీసం మూడు నాలుగు రోజుల సమయమివ్వాలని సభ్యుడు అధీర్ రంజన్ చౌదరి (కాంగ్రెస్) కోరగా స్పీకర్ తిరస్కరించారు. ఒక సభ్యున్ని బహిష్కరించాలంటూ సిఫార్సు చేసే అధికారం ఎథిక్స్ కమిటీకి లేదని కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ వాదించారు. అనంతరం మూజువాణి ఓటుతో తీర్మానాన్ని సభ ఆమోదించింది. దీన్ని నిరసిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం మహువాతో కలిసి గాంధీజీ విగ్రహం వద్ద నేతలు నిరసన తెలిపారు.

ఏం జరిగింది?

వ్యాపారవేత్త దర్శన్ హీరా నందానీ నుంచి మొయిత్రా భారీగా డబ్బులు, ఖరీదైన కానుకలు తీసుకుని ఆయనకు లబ్ధి చేకూర్చేలా అదానీ సంస్థ తదితరాలపై లోక్‌సభలో ప్రశ్నలడిగారంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే గత అక్టోబర్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. అంతేగాక మొయిత్రా తన లోక్‌సభ వెబ్‌సైట్ లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌ను కూడా నందానీకి ఇచ్చారని దూబేతో పాటు ఆమె మాజీ సన్నిహితుడు జై అనంత్ దేహద్రాయ్ కూడా ఆరోపించారు. అది నిజమేనంటూ నందానీ ఎథిక్స్ కమిటీకి అఫిడవిట్ సమర్పించారు. దీనిపై మొయిత్రాను ఎథిక్స్ కమిటీ విచారణకు పిలిచింది. అసభ్యకరమైన ప్రశ్నలడిగారంటూ విచారణను ఆమె బాయ్‌కాట్ చేశారు. ఈ కేసులో సీబీఐ ఇప్పటికే ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసింది.



ప్రజాస్వామ్యానికి ఉరి: మమత

డార్జిలింగ్: మొయిత్రాను బహిష్కరించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని హత్య చేశారని తృణమూల్ కాంగ్రెస్ చీఫ్, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. ఈ చర్య పార్లమెంటుకే మచ్చ తెచ్చిందన్నారు. ''పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఇది దుర్దినం. ఎన్నికల్లో తమను ఓడించలేక బీజేపీ ఇలా కక్షసాధింపు రాజకీయాలకు దిగుతోంది'' అని ఆరోపించారు. మొయిత్రాకు పార్టీ పూర్తిగా మద్దతుగా నిలుస్తుందన్నారు. ''500 పేజీల నివేదిక సభ ముందు పెట్టి, కేవలం 30 నిమిషాల చర్చతో తీర్పు వెలువరించడమా? అంత తక్కువ సమయంలో సభ్యులు నిర్ణయానికి ఎలా రాగలరు?'' అని మమత ప్రశ్నించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి తథ్యమన్నారు. మొయిత్రాకు దన్నుగా నిలిచినందుకు ఇండియా కూటమికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్‌తో పాటు బీఎస్పీ, ఎస్పీ, సీపీఐ, పీడీపీ తదితర పార్టీల నేతలు కూడా బహిష్కరణను తప్పుబట్టారు.

ప్రశ్నలడిగేది నా పీఏనే!

మొయిత్రా ఉదంతంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో జేడీ(యూ) సభ్యుడు గిరిధారీ యాదవ్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ''నాకసలు కంప్యూటర్ ఎలా ఆపరేట్ చేయాలో కూడా తెలియదు. అందుకే నేను ఒక్క లిఖిత ప్రశ్న కూడా స్వయంగా అడగలేదు. నా లోక్‌సభ పోర్టల్ లాగిన్‌ఐడీ, పాస్‌వర్డ్ నా పీఏ దగ్గరుంటాయి. నా తరఫున నా ప్రశ్నలన్నింటినీ అతనే అందులో అడుగుతాడు'' అని చెప్పుకొచ్చారు! దాంతో అంతా అవాక్కయ్యారు. అలా ఇతరులతో ప్రశ్నలు తయారు చేయించకూడదంటూ ఎంపీని స్పీకర్ మందలించారు.



30 ఏళ్లైనా పోరాడతా: మొయిత్రా

ఎథిక్స్ కమిటీ నివేదికను మొయిత్రా తూర్పారబట్టారు. నిబంధనలకు పాతరేస్తూ తనపై హడావుడిగా వేటు వేశారని ఆరోపించారు. స్పీకర్ నిర్ణయం అనంతరం విపక్ష ఇండియా కూటమి నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులతో కలిసి పార్లమెంటు ఆవరణలో మొయిత్రా మీడియాతో మాట్లాడారు. ''రేపు కచ్చితంగా సీబీఐని నా ఇంటిపైకి ఉసిగొల్పుతారు. మరో ఆర్నెల్ల పాటు నన్నిలాగే వేధిస్తారు. కానీ పారిశ్రామికవేత్త అదానీ అక్రమాల మాటేమిటి? ఆయన పాల్పడ్డ రూ.13 వేల కోట్ల బొగ్గు కుంభకోణంకేసి సీబీఐ, ఈడీ కన్నెత్తి కూడా చూడవెందుకు?'' అని ప్రశ్నించారు. మోదీ సర్కారుకు అదానీ ఎంతటి ముఖ్యుడో తనపై వేటుతో మరోసారి నిరూపితమైందన్నారు. ''లోక్‌సభ నుంచి బహిష్కరించి నా నోరు మూయించవచ్చని, పారిశ్రామికవేత్త అదానీ ఉదంతం నుంచి బయట పడొచ్చని భావిస్తే పొరపాటు. నాకిప్పుడు 49 ఏళ్లు. మరో 30 ఏళ్ల దాకా పార్లమెంటు లోపల, బయట మీపై పోరాడుతూనే ఉంటా'' అని ప్రకటించారు.

ఏ ఆధారాలతో వేటు?

తనకు వ్యతిరేకంగా ఏ ఆధారాలూ లేకపోయినా ఎథిక్స్ కమిటీ తప్పుడు సిఫార్సు చేసిందని మొయిత్రా ఆరోపించారు. విపక్షాలను లొంగదీసుకునేందుకు మోదీ సర్కారు చేతిలో ఆయుధంగా కమిటీ పని చేస్తోందని దుయ్యబట్టారు. ''నాకు డబ్బు గానీ, కానుకలు గానీ ఇచ్చినట్టు ఒక్క ఆధారమన్నా ఉందా? పైగా, అసలు ఉనికిలోనే లేని నైతిక నియామవళిని ఉల్లంఘించానని తేల్చడం మరీ విడ్డూరం'' అంటూ ఎద్దేవా చేశారు. ''ఎథిక్స్ కమిటీ నివేదిక నియమావళిలోని ప్రతి రూల్‌నూ ఉల్లంఘించింది. సభ ఆమోదించి ప్రోత్సహించిన రోజువారీ విధానాన్ని పాటించినందుకు నన్ను శిక్షిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించి చరిత్ర సృష్టించిన 17వ లోక్‌సభే 78 మంది మహిళా ఎంపీల్లో ఒకరినైన నన్ను ఫక్తు కక్షసాధింపు రాజకీయాల్లో భాగంగా వెంటాడి వేధించిన ఉదంతానికి కూడా వేదికైంది. బంగ్లాదేశ్ సరిహద్దులను ఆనుకున్న సుదూర లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏ రాజకీయ నేపథ్యమూ లేని నావంటి తొలిసారి ఎంపీని అనుక్షణం వేధించింది'' అంటూ ధ్వజమెత్తారు.

విరుద్ధ వాంగ్మూలాలు

ఫిర్యాదుదారుల్లో ఒకరు తన మాజీ సహచరుడని మొయిత్రా గుర్తు చేశారు. ''అతడు తప్పుడు ఉద్దేశంతో నాపై బురదజల్లాడు. కేవలం ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులిచ్చిన వాంగ్మూలాల ఆధారంగా నాపై వేటు వేశారు. వారి వాంగ్మూలాలు పరస్పరం విరుద్ధంగా ఉన్నా పట్టించుకోలేదు. కనీసం వారిని విచారించను కూడా లేదు. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ కూడా పిలిచి విచారించలేదు'' అంటూ ఆక్షేపించారు. ''నందానీ వ్యాపార ప్రయోజనాల కోసం అతని దగ్గర డబ్బులు, కానుకలు తీసుకుని సభలో ప్రశ్నలడిగానని ఎంపీ దూబే తన ఫిర్యాదులో ఆరోపించారు. నందానీ మాత్రం నేనే నా సొంత అజెండాను ముందుకు తీసుకెళ్లడానికి వీలైన ప్రశ్నలు లోక్‌సభ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా తనపై ఒత్తిడి తెచ్చానని సుమోటో అఫిడవిట్ దాఖలు చేశారు. వీటిలో ఏది నిజం?'' అని ప్రశ్నించారు.

లాగిన్ రూల్స్ ఉన్నాయా?

లోక్‌సభ పోర్టల్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను ఇతరులకు ఇచ్చానన్న ఏకైక అభియోగంపైనే తనను బహిష్కరించారని మొయిత్రా గుర్తు చేశారు. కానీ ఈ విషయంలో ఎలాంటి నియమ నిబంధనలూ లేవని వాదించారు.

ఉల్లి ఎగుమతులపై కేంద్రం నిషేధం

సాక్షి, న్యూఢిల్లీ: దేశీయంగా ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వాటి ఎగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఉల్లి ధర కిలో రూ.60 నుంచి రూ.80 వరకు ఉంది. ధరల కట్టడి చర్యల్లో భాగంగా ఈనెల 8 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఎగుమతులపై నిషేధం విధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశీయంగా ఉల్లి సరఫరాను మెరుగుపరిచేందుకు, ధరలను అదుపు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది.

కెనడా స్టూడెంట్ డిపాజిట్ రెట్టింపు

ఒట్టావా: కెనడా ప్రభుత్వం స్టూడెంట్ పర్మిట్ డిపాజిట్‌ను రెట్టింపు చేసింది. రెండు దశాబ్దాలుగా 10 వేల డాలర్లుగా ఉన్న డిపాజిట్ మొత్తాన్ని ఏకంగా 20, 635 డాలర్లకు పెంచుతున్నట్లు కెనడా ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ గురువారం ప్రకటించారు. ఈ నిబంధన వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా ఈ మార్పు చేసినట్లు ఆయన వివరించారు.

మిజోరం సీఎంగా లాల్దుహోమా ప్రమాణం

ఐజ్వాల్: మిజోరం నూతన ముఖ్యమంత్రిగా జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) నేత లాల్దుహోమా(73) శుక్రవారం ప్రమాణం చేశారు. గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆయనతోపాటు 11 మంది మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. శాసనసభలోని 40 మంది ఎమ్మెల్యేలకు గాను సీఎంతో కలిపి 12 మంది వరకు మంత్రులుండొచ్చు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్) నేత, తాజామాజీ సీఎం లాల్ తన్‌హావ్లా, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు చెందిన ఒకరు హాజరయ్యారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఐపీఎస్ లాల్దుహోమాకు చెందిన జెడ్‌పీఎం ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

నేవీలో 10వేల మందికి పైగా సిబ్బంది కొరత

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో కీలక విభాగమైన భారత నావికాదళంలో సిబ్బంది కొరత భారీస్థాయిలో ఉంది. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా శుక్రవారం పార్లమెంట్‌లో కేంద్రం తెలిపిన వివరాల ఆధారంగా ఈ విషయం వెల్లడైంది. అక్టోబర్ 31వ తేదీ నాటికి నౌకాదళంలో మొత్తంగా 10,896 ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. వీటిలో ఆఫీసర్ ర్యాంక్ పోస్టులే 1,777 దాకా ఉన్నాయని లోక్‌సభలో కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్ తెలిపారు.

నకిలీ టోల్‌ప్లాజాతో కోట్లు కొట్టేశారు

- గుజరాత్‌లో రూ.75 కోట్లకు పైగా వసూళ్ల పర్వం
- ఐదుగురి అరెస్ట్

గాంధీనగర్: పూర్వం రహదారిపై దారి దోపిడీలు జరిగేవి. ఇప్పుడు దొంగలు ఏకంగా జాతీయరహదారిపై టోల్‌ప్లాజా ఒకటి తెరిచేసి దర్జాగా టోల్ వసూళ్లు మొదలెట్టేశారు. ఈ దోపిడీ ఘటనకు గుజరాత్ రాష్ట్రంలోని జాతీయరహదారి వేదికైంది. నకిలీ టోల్‌ప్లాజా ద్వారా మోసగాళ్ల ముఠా ఏకంగా రూ.75 కోట్లకుపైగా వసూళ్లకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఏడాదికాలంగా ఇది జరుగుతున్నా పోలీసులకు ఇంతకాలం సమాచారం లేకపోవడం విడ్డూరం. నకిలీ టోల్‌ప్లాజా గుట్టుమట్లు తాజాగా స్థానికంగా వెలుగులోకి వచ్చాక చిట్టచివరన పోలీసులకు తెలిశాయి. ప్రస్తుతం కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలెట్టి ఐదుగురిని అరెస్ట్ చేశారు. సంబంధిత వివరాలను పోలీసులు వెల్లడించారు.

తక్కువ రేటు కావడంతో అంతా గప్‌చుప్

మోర్బీ జిల్లా, కచ్ జిల్లాలను కలిపే 8ఏ నంబర్ జాతీయరహదారిపై వాఘసియా టోల్ ప్లాజా ఉంది. దీని గుండా వెళ్లకుండా సమీప ప్రాంతం గుండా వెళ్లొచ్చని వాహనదారులు కనిపెట్టారు. అనుకున్నదే తడవుగా ఆ ప్రాంతం గుండా వెళ్లడం మొదలెట్టారు. ఈ విషయం తెల్సుకున్న ఒక ముఠా ఒక కొత్త పథకంతో రంగంలోకి దిగింది. ఈ మార్గంలో నిరుపయోగంగా ఉన్న 'వైట్‌హౌజ్' అనే సిరామిక్ ఫ్యాక్టరీని అద్దెకు తీసుకున్నారు. దానికి ఇరువైపులా హైవే వరకు కొత్త రోడ్లు వేశారు. ఫ్యాక్టరీలో టోల్ ప్లాజా కౌంటర్ నిర్మించి వసూళ్ల పర్వానికి తెరలేపారు. సాధారణంగా జాతీయ రహదారిపై ఒక్కో వాహనాన్ని బట్టి రూ. 110 నుంచి రూ.595 వసూలుచేస్తారు. కానీ ఈ 'దొంగ' మార్గంలో వెళ్లే వాహనదారుల నుంచి ఈ ముఠా కేవలం రూ.20 నుంచి రూ.200 వసూలుచేసేవారు. ఇంత తక్కువకే టోల్‌గేట్‌ను దాటేస్తుండటంతో తెల్సినవారంతా ఈ మార్గంలోనే రాకపోకలు సాగించేవారు. కొత్త వాహనదారులకు, స్థానికులకు ఇది బోగస్ టోల్‌ప్లాజా అని తెల్సికూడా.. తక్కువ ధరలో పని అయిపోతుందని మిన్నకుండిపోయారు. దాంతో ముఠా వ్యాపారం ఒక ఏడాదిపాటు యథేచ్ఛగా సాగింది. గత 18 నెలల్లో ఈ ముఠా దాదాపు రూ.75 కోట్లు కొట్టేసిందని మాజీ ఐపీఎస్ రమేశ్ ఆరోపించారు.

నిందితుల్లో పటేల్ నేత కుమారుడు

స్థానిక మీడియాలో కథనాలు, విమర్శలు రావడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఐదుగురిని అరెస్ట్‌చేశారు. సిరమిక్ ఫ్యాక్టరీ యజమాని అమర్షి పటేల్‌తోపాటు అతని నలుగురు అనుచరులు, మరో వ్యక్తినీ అరెస్ట్‌చేశారు. అమర్షి సౌరాష్ట్ర ప్రాంతంలో కీలకమైన పటిదార్ సామాజిక వర్గానికి చెందిన నేత కుమారుడు కావడం గమనార్హం.

దోచిన ప్రతి పైసా కక్కిస్తాం

- విపక్షాలకు మోదీ హెచ్చరిక
- ఏమిటీ కరెన్సీ గుట్టలంటూ ఎక్స్‌లో పోస్టు

న్యూఢిల్లీ: ''ప్రజల నుంచి గతంలో మీరు దోచుకున్న ప్రతి పైసానూ కక్కిస్తా. దాన్నంతటినీ ప్రజలకు తిరిగిచ్చేయాల్సిందే'' అని విపక్షాలను ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. 'ఇది మోదీ హామీ' అంటూ శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జార్ఖండ్ కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహుకు చెందినదిగా చెబుతున్న వ్యాపార సంస్థ నుంచి రూ.200 కోట్లను ఐటీ శాఖ రికవర్ చేసిందన్న వార్తను ప్రధాని ట్యాగ్ చేశారు. పలు అల్మారాల్లో అరల నిండా పేర్చిన కరెన్సీ నోట్లకు సంబంధించిన ఫొటోలు సోషల్ సైట్లలో వైరల్‌గా మార్చడం తెలిసిందే. ఈ కరెన్సీ నోట్ల గుట్టను దేశ ప్రజలంతా చూడాలని మోదీ కోరారు. తర్వాత నిజాయితీపై కాంగ్రెస్ నేతలు దంచే స్పీచులు వినాలంటూ ఎద్దేవా చేశారు. పలు ఎమోజీలను కూడా పోస్టుకు జత చేశారు.


వెడ్ ఇన్ ఇండియా సంపన్నులకు మోదీ పిలుపు

డెహ్రాడూన్: సంపన్నులు డెస్టినేషన్ పెళ్లిళ్లకు దేశీయ లొకేషన్లనే ఎంచుకోవాలని మోదీ కోరారు. ఇందుకోసం మేడిన్ ఇండియా మాదిరిగానే 'వెడ్ ఇన్ ఇండియా' అంటూ విప్లవమే రావాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. సంపన్న పారిశ్రామికవేత్తలు తమ కుటుంబాల్లో కనీసం ఒక్క పెళ్లినైనా ఉత్తరాఖండ్ వంటి చోటప్లాన్ చేయాలని సూచించారు. తద్వారా ఈ హిమాలయ రాష్ట్రం వెడ్డింగ్ డెస్టినేషన్‌గా మారుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. శుక్రవారం ఇక్కడ ఉత్తరాఖండ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ తొలి సెషన్‌లో మోదీ ప్రసంగించారు. భారత్‌లో సంపన్న వ్యాపార వర్గాలు పెళ్లిళ్లకు విదేశాలనే ఎంచుకోవడం ఫ్యాషన్‌గా మారిందన్నారు. ''పెళ్లిళ్లు స్వర్గంలో నిర్ణయమవుతాయంటారు. మరి వాటిని చేసుకునేందుకు యువ జంటలు దేవ భూమి ఉత్తరాఖండ్‌కు బదులు విదేశాలకు ఎందుకు వెళ్లడం?'' అని ప్రశ్నించారు.

సౌర కళలు సూపర్

అపురూపమైన ఫొటోలు తీసిన ఆదిత్యఎల్1

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యునిపై పరిశోధనల నిమిత్తం ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహం అపూర్వమైన ఫొటోలను అందించింది. తొలిసారిగా సూర్యుని ఫుల్ డిస్క్ ఇమేజీలను భూమికి పంపింది. ఉపగ్రహంలోని సోలార్ అల్ట్రా వయొలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్) విజయవంతంగా ఈ ఫొటోలు తీసినట్టు ఇస్రో శుక్రవారం పేర్కొంది. వాటిని తన వెబ్‌సైట్‌లో ఉంచింది. ఈ ఫొటోలను 200–400 ఎన్ఎం తరంగదైర్ఘ్య పరిధిలో తీసినట్టు వెల్లడించింది. ఈ ఫొటోల్లో సూర్యుని ఫొటోస్ఫియర్, క్రోమోస్ఫియర్‌లను 11 వేర్వేరు శాస్త్రీయ ఫిల్టర్లను ఉపయోగించి ఆదిత్య ఎల్1 బంధించింది. ఆ స్ఫియర్లపై లోతైన సమాచారాన్ని ఈ ఫొటోలు అందించినట్టు ఇస్రో తెలిపింది. భూ వాతావరణంపై సౌర ధార్మికత ప్రభావం తదితరాలను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి తాజా ఫొటోలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపింది. వాటిలో సూర్య వలయాల వంటివి కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. గత సెప్టెంబర్ 2న ప్రయోగించిన ఆదిత్య ఎల్1 సూర్యుని దిశగా ప్రయాణంలో భాగంగా లాంగ్రేజియన్ పాయింట్1కు చేరింది. దీంట్లోని ఏడు పేలోడ్లను పూర్తిగా దేశీయంగానే రూపొందించారు.



ఆదిత్య ఎల్1 తీసిన సూర్యుని ఛాయాచిత్రాలు

నేను రాజ్యాంగానికి సేవకుడిని

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ/ముంబై: రాజ్యాంగానికి, చట్టానికి తానో సేవకుడినని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. నిర్దేశించిన స్థానాన్ని అనుసరించాల్సి ఉంటుందని అన్నారు. సీజేఐ సారథ్యంలోని ధర్మాసనం శుక్రవారం కార్యకలాపాలు ప్రారంభించగానే, మాథ్యూస్ జె.నెడుంపర అనే న్యాయవాది ఓ అంశాన్ని ప్రస్తావిస్తూ..సీనియర్ న్యాయవాది హోదా విధానాన్ని రద్దు చేయడంతోపాటు కొలీజియం వ్యవస్థలో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దీనిపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ..'మనస్సులో ఉన్న విషయం చెప్పే స్వేచ్ఛ మీకుంది. భారత ప్రధాన న్యాయమూర్తిగా, ఒక జడ్జిగా, నేను చట్టానికి, రాజ్యాంగానికి సేవకుడిని. నాకు నిర్దేశించిన స్థానాన్ని అనుసరించాల్సి ఉంటుంది. అంతేతప్ప, నాకు నచ్చింది కాబట్టి, ఇది నేను చేస్తాను అని చెప్పలేను'అని పేర్కొన్నారు. లాయర్లకు సీనియర్ హోదా ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నెడుంపర మరో ఏడుగురు వేసిన పిటిషన్‌పై అక్టోబర్‌లో విచారణ చేపట్టిన అప్పటి సుప్రీంకోర్టు బెంచ్.. సీనియర్ న్యాయవాది హోదాను ప్రతిభకు గుర్తింపుగా పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. అదేవిధంగా, సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(సీఏటీ) ముంబై ధర్మాసనం కొత్త కార్యాలయాన్ని శుక్రవారం సీజేఐ ప్రారంభించారు. న్యాయమూర్తుల నియామకంపై అంతిమ నియంత్రణ ఎవరిదనే అంశంపై నిత్యం తర్జనభర్జనలు జరుగుతూనే ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జడ్జీల పోస్టుల ఖాళీలు పెరుగుతుండగా, నియామకాలు పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్పారు. కోర్టుల్లో జాప్యాలను నివారించి, సకాలంలో న్యాయం అందించే విషయంలో ట్రిబ్యునళ్లు కీలకంగా మారాయన్నారు.

జడ్జీలు బోధనలు చేయరాదు

బాలికలపై కలకత్తా హైకోర్టు వ్యాఖ్యలకు సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: కౌమార బాలికలు లైంగిక కోరికలను నియంత్రించుకోవాలని, బాలురు మహిళలను గౌరవించడం అలవర్చుకోవాలంటూ కలకత్తా హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇటువంటి తీర్పు ఎంతో అభ్యంతరకరం, అవాంఛనీయమని పేర్కొంది. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తుల వ్యాఖ్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం కౌమార వయస్కుల హక్కులను పూర్తి స్థాయిలో ఉల్లంఘించడమేనని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం పేర్కొంది. 'సంబంధిత అప్పీల్‌లో న్యాయపరమైన అంశాలను పరిశీలించాలే తప్ప,న్యాయమూర్తులు తమ వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తపరచరాదని, బోధనలు చేయరాదని ప్రాథమికంగా మేం భావిస్తున్నాం'అని తెలిపింది. ఈ అంశంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి, సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది మాధవి దివాన్‌ను అమికస్ క్యూరీగాను, ఆమెకు సాయం అందించేందుకు న్యాయవాది లిజ్ మాథ్యూను నియమించింది. 'ప్రతి కౌమార బాలిక లైంగిక కోరికలను నియంత్రించుకోవాలి. అలా కాకుండా, కేవలం రెండు నిమిషాల లైంగిక ఆనందాన్ని ఆస్వాదించడం కోసం లొంగిపోతే సమాజం దృష్టిలో ఆమె ఓడిపోయినట్లే'అని కలకత్తా హైకోర్టు అక్టోబర్ 18వ తేదీన ఓ కేసు తీర్పు సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం సుప్రీంకోర్టు స్వయంగా విచారణ జరిపింది.

ఒడిశాలో ఐటీ దాడులు..156 సంచుల్లో డబ్బు

భువనేశ్వర్/రాంచీ: ఒడిశాకు చెందిన డిస్టిలరీ గ్రూప్‌పై ఆదాయ పన్ను శాఖ అధికారులు కొనసాగిస్తున్న సోదాల్లో కళ్లు చెదిరే రీతిలో కట్టల కొద్దీ అక్రమ నగదు బయటపడుతోంది. గురువారం బొలంగీర్‌లోని బల్దేవ్ సాహు అండ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో జరిపిన తనిఖీల్లో రూ.200 కోట్ల నగదు బయటపడింది. శుక్రవారం బొలంగీర్ జిల్లా సుదపడలో జరిపిన సోదాల్లో నిండా కరెన్సీ నోట్లున్న 156 సంచులను గుర్తించారు. వీటిలో ఏడు బ్యాగుల్లో నగదును లెక్కించగా రూ.20 కోట్లుగా తేలిందని అధికారులు తెలిపారు. దీంతో, ఇప్పటి వరకు లభ్యమైన డబ్బు రూ.220 కోట్లకు చేరుకుందన్నారు. లిక్కర్ కంపెనీతో సంబంధాలున్నట్లు అనుమానాలున్న జార్ఖండ్ ఎంపీ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని పీటీఐ తెలిపింది. రాంచీలోని ఆయన కార్యాలయం సిబ్బంది కూడా ఎంపీ అందుబాటులో లేరని చెబుతున్నారు. పన్ను ఎగవేత ఆరోపణలపై ఐటీ అధికారులు మూడు రోజులుగా డిస్టిలరీ గ్రూప్ సంస్థలకు చెందిన సంబల్‌పూర్, బొలంగీర్, తితిలాగఢ్, సుందర్‌గఢ్, రూర్కెలా, భువనేశ్వర్‌లలో తనిఖీలు సాగిస్తున్నారు.

ఢిల్లీ మద్యం కేసులో బినోయ్‌కి బెయిల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం విధానం కేసులో నిందితుడు హైదరాబాద్ వ్యాపారవేత్త బినోయ్‌బాబుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బినోయ్ బెయిల్ దరఖాస్తుపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం శుక్రవారం విచారించింది. బినోయ్‌బాబుపై ఎలాంటి అభియోగాలు మోపకుండా 13 నెలలపాటు జైలులో ఉంచినందుకు ఈడీపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఈడీ తీరు సరికాదు. వ్యక్తుల్ని ఎక్కువ కాలం ముందస్తు నిర్బంధంలో ఉంచలేరు. ఈ కేసు ఇంకా ఎంతకాలం సాగుతుంది తెలియదు. బినోయ్‌బాబుపై మోపిన ఆరోపణలకు సంబంధించి ఈడీ, సీబీఐ వాదనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అనంతరం బినోయ్‌కి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ప్రముఖ మద్యం తయారీదారు పెర్నోడ్ రికర్డ్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఉన్న బినోయ్‌బాబు, విజయ్ నాయర్‌లను గత ఏడాది నవంబర్‌లో ఈడీ అరెస్ట్ చేసింది.

యూపీఎస్సీ మెయిన్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసులకు ఉద్యోగుల ఎంపిక నిమిత్తం నిర్వహించిన యూపీఎస్సీ–2023 మెయిన్స్ ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. మెయిన్స్ పరీక్షలను గత సెప్టెంబర్‌లో నిర్వహించడం తెలిసిందే. గత మే నెలలో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలను దాదాపు 13 లక్షల మంది రాశారు. 15 వేల మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారు. వారిలో దాదాపు 2,500 మంది తాజాగా ఇంటర్వ్యూకు అర్హత సాధించినట్టు సమాచారం. ఇంటర్వ్యూ తేదీలతో త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఈసారి మొత్తం 1,105 మందిని సివిల్ సర్వీసులకు యూపీఎస్సీ ఎంపిక చేయనుంది.



రాజన్న దారిలో..

వేములవాడఅర్బన్: రాజన్న దర్శనానికి శుక్రవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని క్యూలైన్‌లలో బారులు తీరారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



గోదావరిలో పుణ్యస్నానాలు

ధర్మపురి: ధర్మపురి గోదావరినదిలో శుక్రవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీకమాసం సందర్భంగా వివిధప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి గంగమ్మ, గౌరమ్మకు మొక్కులు చెల్లించారు.

గరిష్టం/కనిష్టం
28.0/20.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. పాక్షికంగా ఎండ వస్తుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అక్రమ హోర్డింగ్ తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పాఠశాల ఆవరణలోని అక్రమ హోర్డింగ్‌ను ఎట్టకేలకు తొలగిస్తున్నారు. గత నెలలో ఎలాంటి అనుమతి లేకుండా, పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా హోర్డింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై హోర్డింగ్స్.. నో రూల్స్ శీర్షికన గత నెల 11న 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, తాము అనుమతి ఇవ్వలేదని, చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో గత నెల 25న అక్రమ హోర్డింగ్ తొలగింపులో మీనమేషాలు పేరిట మరో కథనం ప్రచురితమైంది. మాజీ మేయర్ రవీందర్ సింగ్ కళాశాలకు వెళ్లి, హోర్డింగ్‌ను తొలగించాలని లేదంటే తామే తొలగించాల్సి వస్తుందని తేల్చిచెప్పారు. దీంతో ఆ హోర్డింగ్ తొలగింపునకు బాధ్యులు ముందుకు వచ్చారు. సగానికి పైగా తొలగించారు.

క్వింటాల్ పత్తి రూ. 6,800

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.6,800 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 52 వాహనాల్లో 610 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.6,000ను వ్యాపారులు చెల్లించారు. గన్నీ సంచుల్లో ఏడుగురు రైతులు 9 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,300, మోడల్ ధర రూ.6,100, కనిష్ఠ ధర రూ.5,800కు కొనుగోలు చేశారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలోని 9 మంది రైతుల నుంచి సీసీఐ 152.35 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,020, మోడల్ ధర రూ.6,995, కనిష్ఠ ధర రూ.6,809 పలికింది. కాగా, మార్కెట్‌కు శని, ఆదివారాల్లో సాధారణ సెలువులు ఉంటాయని, సోమవారం క్రయవిక్రయాలు యథావిధిగా జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి రెడ్డి నాయక్ తెలిపారు.

పేదలకు విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలి

కరీంనగర్: అనూహ్యమైన ప్రజల తీర్పుతో రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం పేదలకు విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తేవాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ ఒక ప్రకటనలో కోరారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ప్రాణత్యాగం చేసిన తెలంగాణ అమరవీరుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. ప్రశ్నించే గొంతుకలైన ఉద్యమకారులు, జర్నలిస్టులు ఎత్తిచూపుతున్న సమస్యల పరిష్కరించాలని పేర్కొన్నారు. రాజ్యాంగం, చట్టాలకు అనుగుణంగా పరిపాలన సాగాలన్నారు.

నేటి నుంచి డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు

కరీంనగర్‌సిటీ: డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం సెకండ్ స్పెల్ (సప్లిమెంటరీ) పరీక్షలు ఎస్సారార్ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తామని ప్రాంతీయ సమన్వయ కేంద్రం అధికారి డా. ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు 9 నుంచి 12 వరకు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తృతీయ సంవత్సరం పరీక్షలు 9 నుంచి 14 వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 16 నుంచి 21 వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే 2023 విద్యా సంవత్సరం పీజీ ద్వితీయ సంవత్సరం తరగతులు శనివారం ప్రారంభమవుతాయని శ్రీనివాస్ పేర్కొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎస్సారార్ కళాశాల, సప్తగిరికాలనీ సబ్‌స్టేషన్, ఉజ్వల పార్క్ ఏరియా, పద్మనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంబేడ్కర్‌నగర్, మెహర్‌నగర్, వావిలాలపల్లి, వాటర్ వర్క్(హౌసింగ్ బోర్డు) ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ నరేందర్ తెలిపారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా కొత్తపల్లి, బొమ్మకల్, మొగ్దుంపూర్, చెర్లభూత్కూర్, రేకుర్తి, శాతవాహన వర్సిటీ, నగునూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ రాజు పేర్కొన్నారు.

ఇక బదిలీల పర్వం!

- పోలీస్, రెవెన్యూ అధికారుల బదిలీలకు రంగం సిద్ధం
- ఎన్నికల ముందు మారిన పోలీసు బాసులు
- కొత్త హోంమంత్రి ఆధ్వర్యంలో నూతన ఐపీఎస్‌ల నియామకం?
- లెటర్ల కోసం ప్రయత్నాలు
- ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారానికి ముందే 'కమిట్‌మెంట్లు'
- కొత్త ప్రభుత్వంలోనైనా లెటర్ల సంస్కృతికి చెక్ పడేనా?



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సహజంగానే తొలుత ఐపీఎస్ అధికారుల బదిలీలకు ప్రాధాన్యమిచ్చింది. ఇప్పటికే కేబినెట్ కూర్పు పూర్తవడంతో ఇక శాఖల కేటాయింపు, ఆపై ఐపీఎస్ అధికారుల బదిలీలు లాంఛనం అనే ప్రచారం జోరందుకుంది. వాస్తవానికి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. తొలుత పోలీసు అధికారుల బదిలీలకే పెద్దపీట వేస్తారు. ఆ వెంటనే ఐఏఎస్, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్ తదితర రెవెన్యూ అధికారుల బదిలీలు కూడా ఉంటాయి. రెండు, మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు బదిలీ అవుతారని తెలిసింది. మొత్తానికి బదిలీల జాబితాలో ఎవరెవరు ఉంటారన్న చర్చ డిపార్ట్‌మెంటులో జోరుగా సాగుతోంది.

కలెక్టర్ల బదిలీలపై చర్చ

కలెక్టర్ల విషయానికొస్తే.. ఎన్నికల ముందు పెద్దపల్లి కలెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్, సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి రెండేళ్ల కిందట బాధ్యతలు చేపట్టారు. జగిత్యాల కలెక్టర్‌గా యాస్మిన్‌బాషా ఈ ఏడాది ఫిబ్రవరిలో నియమితులయ్యారు. వీరిలో ఎవరు బదిలీ కానున్నారనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్ల బదిలీలు కూడా త్వరలోనే ఉంటాయని రెవెన్యూ అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు.

లెటర్ల సంస్కృతికి మంగళం?

కొత్త ప్రభుత్వం ఏర్పాటుకాగానే డీఎస్పీ/ఏసీపీ ర్యాంకు నుంచి ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ ర్యాంకు ఆఫీసర్లలో కొందరు పోస్టింగుల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో చాలా మటుకు పోస్టింగులు ఎమ్మెల్యేల సిఫారసు లేఖల ద్వారానే జరిగాయన్న అపవాదు ఉంది. ఈ విషయం పలుమార్లు అప్పటి పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి సైతం వెళ్లడం, మీడియాలో కథనాలు కోకొల్లలుగా వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూడా అదే సంస్కృతి వస్తుందనుకున్న అధికారులు తమకు సన్నిహితంగా ఉన్న నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణ స్వీకారం చేయకముందే వారితో పైరవీలు ప్రారంభించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, రామగుండం, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో ఇంత కాలం పోస్టింగులు లేకుండా ఎదురుచూస్తున్న కొందరు పోలీసు అధికారులు ఈసారి వినూత్న విధానం అవలంబించారని సమాచారం. గెలిచే అవకాశమున్న నేతలకు ఎన్నికల్లో వెనక ఉండి, అన్ని విధాలా సాయపడ్డారని, అందుకు ప్రతిఫలంగా కొత్త సర్కారులో తమకు పోస్టింగులు వస్తాయని ధీమాగా ఉన్నట్లు తెలిసింది. ఈసారి పోలీసు పోస్టింగుల్లో అధికారపార్టీ నేతల జోక్యాన్ని నివారించేందుకు ఎస్పీలు, సీపీలకే పూర్తిస్థాయి స్వేచ్ఛను ఇచ్చే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ పరిణామాన్ని సీనియర్ పోలీసు అధికారులు స్వాగతిస్తున్నారు. దీంతో ప్రతిభావంతులకు పోస్టింగులు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నలుగురిలో బదిలీ ఎవరికో?

ఒక ప్రభుత్వం నియమించిన ఐపీఎస్ అధికారులను తరువాత వచ్చిన ప్రభుత్వం సహజంగానే మారుస్తుంది. ఎన్నికల సమయంలో ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చిన అధికారులను ఎన్నికల సంఘం కూడా బదిలీ చేస్తుంది. ఈక్రమంలోనే సరిగ్గా ఎన్నికల ముందు అక్టోబర్ 27న అప్పటి కరీంనగర్ సీపీ సుబ్బారాయుడును ఎన్నికల సంఘం బదిలీ చేసి, ఆ స్థానంలో అభిషేక్ మహంతికి పోస్టింగ్ ఇచ్చింది. కరీంనగర్ కలెక్టర్ బి.గోపి స్థానంలో ప్రస్తుత కలెక్టర్ పమేలా సత్పతికి పోస్టింగ్ కల్పించింది. జగిత్యాల ఎస్పీ భాస్కరన్ స్థానంలో సన్‌ప్రీత్‌సింగ్‌కు బాధ్యతలు అప్పగించింది. ఇక సిరిసిల్ల ఎస్పీగా అఖిల్ మహాజన్, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరీ కొనసాగుతున్నారు. ఎన్నికల సంఘం దాదాపు మెజారిటీ ఐపీఎస్‌లపై బదిలీవేటు వేసినా అఖిల్‌మహాజన్, రెమా రాజేశ్వరీలను కొనసాగించేందుకే మొగ్గుచూపింది. కొత్త ప్రభుత్వంలో ఈ నలుగురిలో ఎవరు బదిలీ అవుతారన్నది ఆసక్తికరంగా మారింది.

ఎన్నికల వేళ.. చదువులేల?

- మొన్న అసెంబ్లీ, ఇప్పుడు స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలు
- టీచర్లకు విధుల కేటాయింపుతో సిలబస్‌పై ప్రభావం
- దగ్గర పడుతున్న పదోతరగతి పరీక్షలు
- పిల్లల భవిష్యత్ ఏంటని తల్లిదండ్రుల్లో ఆందోళన
- జిల్లాలో పరిస్థితి ఇదీ..!



కరీంనగర్: విద్యార్థుల చదువులు గందరగోళంగా మారాయి. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి. అక్కడివారు ఇక్కడికి, ఇక్కడివారు అక్కడికి స్థానచలనం పొందగా.. కొందరు వేరేచోటుకి.. మరికొన్ని చోట్ల మా సారు మాకే కావాలంటూ పిల్లలు కోరడంతో నెల రోజులపాటు చదువులు ఆగమయ్యాయి. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో టీచర్లందరూ ఎన్నికల శిక్షణ, విధులకు వెళ్లడంతో సిలబస్ వెనకబడింది. అసెంబ్లీ ఎన్నికలు ముగియగా.. ఆ వెంటనే ఎన్నికల సంఘం పంచాయతీతోపాటు పార్లమెంట్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. జనవరిలో మూడు విడతల గ్రామ పంచాయతీ, ఏప్రిల్ నెలలో లోక్‌సభ ఎన్నికలు, మే నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి.

ఫిబ్రవరిలో సీబీఎస్సీ, మార్చిలో ఎస్సెస్సీ

విద్యాసంవత్సరం త్వరితగతిన ముగియాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ముందుగానే అన్ని పబ్లిక్ పరీక్షలు నిర్వహించడానికి షెడ్యూల్ ఖరారు చేసింది. ఫిబ్రవరిలో సీబీఎస్ఈ, మార్చిలో ఎస్సెస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కానీ, ఎన్నికల సీజన్ ఇబ్బందులకు గురిచేస్తోంది. మరోవైపు అడ్డంకులను అధిగమించి, వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ సమాయత్తమవుతోంది. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ గత నెల ఒకటి నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. దాన్ని పూర్తి చేయడానికి ఎన్నికల విధులు అడ్డంకిగా మారనున్నాయి.

జిల్లాలో 2,800 మంది టీచర్లు

కరీంనగర్ జిల్లాలో 2,800 మంది ఉపాధ్యాయులుండగా.. వీరిలో సుమారు 2,500 మంది అసెంబ్లీ ఎన్నికల విధులు నిర్వహించారు. తాజాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు విడతలవారీగా ఉపాధ్యాయులందరూ శిక్షణకు హాజరయ్యేందుకు ఆదేశాలు వచ్చాయి. మరోవైపు పదోతరగతి విద్యార్థులకు ఫిబ్రవరిలో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమవుతోంది. ఈ పరిస్థితుల్లో పిల్లల చదువులు ఎలా గాడిన పెట్టాలో అర్థం కావడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. తమ పిల్లల భవిష్యత్ ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

'పది' విద్యార్థులు 14 వేల మందికి పైనే

జిల్లాలోని 16 మండలాల్లో 150 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. మొత్తం 14 వేల పైచిలుకు మంది విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలకు హాజరు కానున్నారు. పాఠ్యాంశాలు పూర్తి కాక, కొండంత ఉన్న సిలబస్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో లాంగ్వేజ్ పాఠ్యాంశాలు సరిగా బోధించలేదు. చాలా స్కూళ్లలో ఆ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు కూడా లేరు.

ఫలితాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా విద్యాశాఖ పదోతరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. నవంబర్ 1వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రత్యేక తరగతులు నడుపుతున్నారు. టీచర్లు ఏటా డిసెంబర్ చివరి వరకు సిలబస్ పూర్తి చేసేవారు. ప్రస్తుతం పలుచోట్ల 75 శాతమే పూర్తయ్యింది. తరగతులు వేగవంతం చేసినా.. విషయాలపై పట్టు సాధించకపోవడం, నెమ్మదిగా సాగితే అనుకున్న సమయానికి పూర్తి చేయలేక విద్యార్థులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.

సిలబస్ పూర్తయ్యేలా చర్యలు



పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులందరూ విడతల వారీగా శిక్షణకు హాజరు కానున్నారు. పదోతరగతి ఫలితాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టాం. సిలబస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి 10 జీపీఏ సాధనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఎక్కడైనా సబ్జెక్టు టీచర్లు తక్కువగా ఉంటే సమీపంలోని వారికి బాధ్యతలు అప్పగించాం. – జనార్దన్‌రావు, డీఈవో

'మహాలక్ష్మి' జర్నీ నేటి నుంచే



- మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం

కరీంనగర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి అనుగుణంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నేటి నుంచి అమల్లోకి రానుంది. ఈ పథకానికి 'మహాలక్ష్మి'గా నామకరణం చేసింది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో గల 459 పల్లె వెలుగు, 207 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, ఆడపిల్లలు ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. ఆధార్‌కార్డు గానీ, ఏ ఇతర గుర్తింపు కార్డు గానీ చూపించి, ప్రయాణించవచ్చు. సామాన్య ప్రజలతోపాటు ఉద్యోగులు రాష్ట్రంలోని ఎక్కడ నుంచి ఎక్కడికైనా వెళ్లవచ్చు. రీజియన్ పరిధిలోని బస్సులు రోజుకు 3.50 లక్షల కి.మీ. ప్రయాణిస్తూ రూ.1.50 కోట్ల ఆదాయం సమకూరుస్తున్నాయి. నిత్యం 2.50 లక్షల మందిని గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో రీజియన్ పరిధిలో రోజుకు రూ.60 లక్షల నష్టం వాటిల్లుతుందని అధికారులు చెబుతున్నారు. మహాలక్ష్మి ప్రారంభోత్సవానికి పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.మాధవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రారంభించనున్నారు.

టీఎన్‌జీవో నాయకుల సంబరాలు



మిఠాయిలు పంచుతున్న నాయకులు

కరీంనగర్ అర్బన్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ పరిణామమని టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సందర్భంగా సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచారు. తెలంగాణ ఉద్యమంలో తమతో కలిసి పనిచేసిన పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా మొదటి తారీఖునే జీతాలను ఇవ్వడంతోపాటు పెండింగ్, లీవ్ శాలరీ, మెడికల్, సప్లిమెంటరీ, జీపీఎస్ లోన్ బిల్లులు క్లియర్ చేయాలన్నారు. ప్రధానంగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, సహాధ్యక్షుడు రాగి శ్రీనివాస్, కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, మహిళా జేఏసీ చైర్మన్ శారద, సబిత, సునీత, సరిత, విజయలక్ష్మి, అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ హర్మీందర్ సింగ్, అఫ్జల్, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్ భరద్వాజ్, నేరెళ్ల కిషన్, రవీందర్ రెడ్డి, సుధీర్, గంగారం రమేశ్, శంకర్, ప్రసాద్ రెడ్డి, పోలు కిషన్, నాలుగో తరగతి ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, నరసింహారెడ్డి, అజ్గర్, ప్రభాకర్, యాదగిరి, డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మంజిత్ సింగ్, రజినీకర్, సుధాకర్‌రెడ్డి, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో చాన్స్

- ఈ నెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జనవరి 6న ముసాయిదా
- ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటన
- పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈసీ చర్యలు



కరీంనగర్ అర్బన్: ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో చాన్స్ వచ్చింది. గ్రామ పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికలుండటంతో ఎన్నికల సంఘం సదరు ప్రక్రియకు కసరత్తు చేస్తోంది. ఏటా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ ప్రకటిస్తోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు అవకాశమిచ్చింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, అక్టోబర్‌లో తుది జాబితా ప్రకటించగా నవంబర్ రెండో వారంలో అనుసంధాన జాబితా ఇచ్చింది. దాని ప్రకారమే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించింది.

జనవరి 5 వరకు గడువు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ చేపట్టనున్నారు. బూత్ స్థాయి అధికారులు(బీఎల్వో) మళ్లీ ఇంటింటికీ తిరిగి కొత్త దరఖాస్తులతోపాటు మార్పులు, సవరణలుంటే వివరాలు సేకరిస్తారు. ఈ ప్రక్రియ 2024 జనవరి 5 వరకు చేపట్టనున్నారు. అదే నెల 6న ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. 22 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. బీఎల్వోలు మరోసారి సర్వే చేపట్టి, పరిష్కరిస్తారు. 2024 ఫిబ్రవరి 2న జాబితా పరిశీలించి, అదే నెల 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

వచ్చే నెల ఒకటి ప్రామాణికం

జాబితాలో పేరు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని ఎన్నికల సంఘం పేర్కొంది. సీఈవో వెబ్‌సైట్‌లో గానీ స్థానికంగా ఉండే బీఎల్వో వద్ద గానీ ఫాం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరిలో ఇచ్చే తుది జాబితాలో పేరుంటే లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

ప్రత్యేక క్యాంపెయిన్

పోలింగ్ బూత్ స్థాయిలో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. శని, ఆదివారాలు ప్రత్యేకంగా కార్యక్రమం జరగనుండగా ఎన్నికల సంఘం త్వరలోనే తేదీలను ప్రకటించనుందని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా ఉండేవారు కొత్తగా నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం అర్జీలను బీఎల్వోలకు అందించాల్సి ఉంటుంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

కరీంనగర్‌లో 3,55,054, చొప్పదండిలో 2,32,990, మానకొండూరులో 2,21,613, హుజూరాబాద్‌లో 2,49,558, హుస్నాబాద్‌లో 2,42,177, జగిత్యాలలో 2,31,468, కోరుట్లలో 2,40,855, ధర్మపురిలో 2,26,880, పెద్దపల్లిలో 2,54,266, రామగుండంలో 2,21,019, మంథనిలో 2,36,442, సిరిసిల్లలో 2,44,426, వేములవాడలో 2,22,251 మంది ఓటర్లు ఉన్నారు.

'ఎఫ్ఎల్ఎన్' పూర్తిస్థాయిలో అమలు చేయాలి



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్: ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం జిల్లాలో పటిష్టంగా అమలు జరగాలని జిల్లా విద్యాశాఖాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు అన్నారు. శుక్రవారం మండల విద్యాధికారులు, మండల నోడల్ అధికారుల జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో డీఈవో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్కడా అలసత్వం పనికిరాదని, కార్యక్రమం సమర్థవంతంగా జరగాలని తెలిపారు. విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు తప్పనిసరిగా రావాల్సిన అవసరం ఉందని, వాటిపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని అన్నారు. సంబంధిత మండల నోడల్ అధికారులు పాఠశాలలను పర్యవేక్షించి ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు పూర్తిస్థాయిలో జరిగేవిధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి కర్ర అశోక్ రెడ్డి, ఉమ్మడి పరీక్షల బోర్డ్ సెక్రెటరీ ఎం.స్వదేశీ కుమార్, సీపీడీ ఇన్‌చార్జి గాజుల రవీందర్, రాజభాను చంద్ర ప్రకాశ్, కోట లక్ష్మారెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి హౌస్ వైరింగ్(పురుషులకు)లో 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని సంస్థ డైరెక్టర్ డి.సంపత్ తెలిపారు. ఆసక్తిగలవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఉమ్మడి కరీంనగర్ (పెద్దపల్లి, సిరిసిల్ల జగిత్యాల, కరీంనగర్) జిల్లాలకు చెందినవారై ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం టూల్స్, యూనిఫామ్ ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. దరఖాస్తుదారుల వయసు 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. దరఖాస్తు ఫామ్‌తోపాటు ఎస్సెస్సీ మెమో, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతోపాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతపర్చాలని సూచించారు. వివరాలకు 9949448157 నంబర్ సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

టీఎస్‌సెట్‌కు అర్హత సాధించిన రేగుంట వాసి


రాజోజి వెంకట సాయికృష్ణ

మల్లాపూర్: ఉస్మానియ విశ్వవిద్యాలయం విడుదల చేసిన టీఎస్‌సెట్ ఫలితాల్లో మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన రాజోజి వెంకటసాయికృష్ణ అర్హత సాధించాడు. గత ఆగస్టులో టీఎస్‌సెట్ నోటిఫికేషన్ విడుదల కాగా.. అక్టోబర్ 28న అర్హత పరీక్ష నిర్వహించారు. డిసెంబర్ 6న విడుదలైన ఫలితాల్లో వెంకటసాయికృష్ణ ప్రతిభ కనబరిచి సెట్‌లో అర్హత సాధించాడు. ప్రస్తుతం వెంకటసాయికృష్ణ జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఓ ప్రయివేటు డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సెట్‌లో అర్హత సాధించిన వెంకటసాయికృష్ణను జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్‌ఎంపీపీ గౌరు నగేశ్, రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు దేవ మల్లయ్య, మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్ కుందేల్ల నర్సయ్య తదితరులు అభినందించారు.

కేసీఆర్ సర్జరీలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నిర్వహించిన హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఎర్రవెల్లిలోని తన ఫాంహౌజ్‌లో గురువారం రాత్రి సమయంలో జారిపడడంతో కేసీఆర్ తొంటికి గాయాలైన సంగతి తెలిసిందే. ఈ మేరకు యశోద ఆసుపత్రిలో చేర్పించగా.. వైద్య బృందం సర్జరీ నిర్వహించారు. ఈ బృందంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కూడా పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 23 టీఎంసీలు


మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 23.39 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో లేదని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు

జమ్మికుంట(హుజూరాబాద్): పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఏడోతరగతి విద్యార్థి ఎం.సిద్ధు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు మంచిర్యాలలో జరిగే అండర్–14 రాష్ట్రస్థాయి హాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ ఎండీ. ఫారియ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ నవీన్, ఫిజికల్ డైరెక్టర్ సుమన్, టీచర్లు రాజేందర్, రవికుమార్, లలిత తదితరులు శుక్రవారం అభినందించారు.

స్వాతంత్య్ర సమరయోధురాలి మృతి


లసుమమ్మ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: కాట్రపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు లసుమమ్మ(95) అనే వృద్ధురాలు అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పలువురు సంతాపం తెలిపారు.

మట్టిలో మాణిక్యాలు

- సర్కారీ బడి పిల్లలు.. ఆటల్లో మెరికలు
- పల్లె నుంచి జాతీయస్థాయికి..
- ప్రతిభ చూపుతున్న విద్యార్థులు
- చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తున్న పల్లెబిడ్డలు


వాలీబాల్ బాలికల జట్టు


వాలీబాల్ బాలుర జట్టు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వారంతా రైతుబిడ్డలు. మైదానంలో దిగితే మాత్రం చిరుతలే. వాలీబాల్ కోర్టులో షాట్ కొడితే పాయింట్ రావాల్సిందే.. ఖోఖో కోర్టులో అడుగుపెడితే ప్రత్యర్థి ఔట్ కావాల్సిందే.. ఇదంతా రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభకు తార్కాణం. సామన్య కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలు, తమలోని టాలెంట్‌కు పదునుపెట్టి రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. సర్కార్ బడి పిల్లలు ఎందులోనూ తక్కువ కాదంటూ నిరూపించారు.

ఆడితే కప్పు కొట్టుడే

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలలో రాణిస్తున్నారు. ప్రతీ క్రీడలో సత్తా చాటుతూ కప్పు కొడుతున్నారు. పీఈటీగా ప్రభాకర్ 2018లో ఈ స్కూల్‌కు వచ్చారు. అప్పటి నుంచి నిత్యం ఉదయం, సాయంత్రం కఠోర శిక్షణలో వందలాది మంది విద్యార్థులు మెరికల్లా తయారయ్యారు. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. పాఠశాల నుంచి రాష్ట్రస్థాయికి 35 మంది ఎంపికై ప్రతిభ చూపడమే కాకుండా.. ముత్యాల మనోజ్ వాలీబాల్‌లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. కరోనా సమయంలో కొంత బ్రేక్ వచ్చినప్పటికీ పట్టువదలని విక్రమార్కుడిలా నిత్య కఠోర సాధన చేస్తూ ఆటల్లో రాణిస్తున్నాడు.

ఆడిన చోట.. గెలుపు బాట

- 2018లో సాధన మొదలుపెట్టారు.
- 2019, 2020లలో మంచిర్యాలలో రాష్ట్రస్థాయి వాలీబాల్, చెస్ పోటీలలో విష్ణు, శ్వేత ప్రతిభ చూపారు.
- 2020–21లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో జి.లయ, ఎం.అరవింద్, ఎండీ.సాయిబ్, ఎల్.అనూషలు పాల్గొన్నారు.
- 2021–22లో సిద్దిపేటలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ఎం.ఐశ్వర్య, ఎస్.వైష్ణవి, బి.శ్రీలత, పి.శనూష పతకాలు సాధించారు.
- 2022–23లో మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో డి.శ్రీజ, ఎ.సంయుక్త రాణించారు.
- 2022–23లో వరంగల్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో డి.శ్రీజ, ఎం.మనోజ్, డి.శివకుమార్ పతకాలు సాధించారు
- 2022–23లో మెదక్‌లో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ఎ.మనోజ్, లక్ష్మీచైతన్య, రవికాంత్ పతకాలు సాధించారు.
- 2023–24లో హన్మకొండలో అథ్లెటిక్స్‌లో సీహెచ్.సాహితి, రవికాంత్, ఎ.సంయుక్త పతకాలు సాధించారు.
- 2023–24లో పశ్చిమబెంగాల్‌లో వాలీబాల్ పోటీలలో ఎం.మనోజ్ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు.
- 2023–24లో మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ పోటీలలో సీహెచ్.సాహితీ, ఎం.శ్రీహర్ష పతకాలు సాధించారు. అదే సంవత్సరంలో ఎం.మనోజ్, ఏ.మనోజ్ వాలీబాల్‌లో ప్రతిభ కనబర్చారు.
- 2023 సీఎం కప్ చాంపియన్‌షిపస్ రాచర్లబొప్పాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు దక్కించుకున్నారు.

విద్యార్థుల్లో టాలెంట్ ఉంది



మా స్కూల్ విద్యార్థుల్లో చాలా టాలెంట్ ఉంది. స్కూల్‌లోనే నిత్యం ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నా. కఠిన శిక్షణను తట్టుకున్నారు కాబట్టే ఏ స్థాయిలో ఆడినా విజయం సాధిస్తున్నారు. మరిన్ని విజయాలే లక్ష్యంగా ముందుకెళ్తాం.

– ప్రభాకర్, పీఈటీ, రాచర్లబొప్పాపూర్ హైస్కూల్



ఫ్రీడమ్ కప్‌తో పాఠశాల క్రీడాకారులు

సార్ ప్రోత్సాహంతో..



పీఈటీ ప్రభాకర్ సార్ ప్రోత్సాహంతో నేషనల్ స్థాయికి ఎంపికయ్యాను. పాఠశాలలో నిత్యం ఉదయం, సాయంత్రం పట్టుదలతో వాలీబాల్‌లో సాధన చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలలో సత్తాచాటాం. జాతీయస్థాయికి ఎంపికవడం సంతోషంగా ఉంది.

– ముత్యాల మనోజ్, వాలీబాల్ నేషనల్ ప్లేయర్

అవకాశాలను అందిపుచ్చుకొని..



పాఠశాల స్థాయిలో అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని వాలీబాల్‌లో రాణించాను. జిల్లా స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ పోటీలలో చాంపియన్‌షిప్ గెలుచుకున్నాం. ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయికి ఎంపిక చే యగా, మహబూబ్‌నగర్‌లో జరిగిన క్రీడాపోటీలలో పతకాలు సాధించాం.

– ముత్యాల శ్రీహర్ష, స్టేట్ లెవల్ వాలీబాల్ ప్లేయర్

కఠోర శ్రమతో..



నిత్యం స్కూల్‌లో చేసిన ప్రాక్టీస్‌తోనే రా ష్ట్రస్థాయిలో రాణించగలిగాం. చదువుతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాం. మొదట్లో ఆడడం ఇబ్బందిగా ఉన్నప్పటికీ తల్లిదండ్రులు, సార్ల ప్రోత్సాహంతో ముందకెళ్లాం. మేము పడ్డ శ్రమకు తగిన ఫలితం దక్కింది.

– పల్లె సంయుక్త, రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్లేయర్

జాతీయస్థాయి లక్ష్యంగా..



జాతీయస్థాయికి ఎంపికవడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నాం. ప్రభుత్వ బడి అయినప్పటికీ మా దగ్గర ఉన్న వసతులతోనే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొని పతకాలు సాధిస్తున్నాం. మా ఊరి పేరును నిలబెడుతాం.

– బి.శివ, వాలీబాల్ ప్లేయర్

చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం


పర్శరాములు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆవునూర్ శివారులో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారంకు చెందిన కూరాకుల ఎల్లవ్వ, దేవరాజు దంపతుల కుమారుడు పర్శరాములు(27) గురువారం రాత్రి గూడెంలోని రైస్‌మిల్లుకు బైక్‌పై వచ్చాడు. మిల్లులో తాడు తీసుకుని తిరుగు ప్రయాణంలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో పర్శరాములు రోడ్డు కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఎంత వెతికిన పర్శరాములు కనిపించలేదు. శుక్రవారం ఉదయం గ్రామస్తులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పర్శరాములు నాలుగేళ్లు దుబాయ్‌కు వెళ్లి ఇటీవల వచ్చాడు. వెంకటాపూర్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండేవాడు. మృతుడి తండ్రి దేవరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహ్రెయిన్‌లో ప్రమాదం.. బావుసాయిపేట వాసి మృతి


లింగంపెల్లి బాబు(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం పరాయిదేశం వెళ్లిన ఓ యువకుడు అక్కడ జరిగిన ప్రమాదానికి బలయ్యాడు. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన లింగంపెల్లి రాజనర్సయ్య–లచ్చవ్వల కుమారుడు నెల రోజుల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడి ఓ కంపెనీలో పనిచేస్తుండగా గురువారం సెంట్రింగ్ పనికి వినియోగించే పెద్ద రాడ్ నాలుగో అంతస్తు మీది నుంచి బాబుపై పడింది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతిచెందినట్లు తోటి స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి రాజనర్సయ్య గత కొన్నేళ్ల క్రితమే చనిపోయాడు. తల్లి లచ్చవ్వ, భార్య శిరీష, కుమారుడు(4) ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


మృతిచెందిన దండు సంజయ్(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): శుభకార్యానికి వెళ్లివస్తుండగా జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, మరో యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. కోనరావుపేటకు చెందిన దండు రవి–రమ దంపతుల కుమారుడు సంజయ్(22), అతని స్నేహితుడు గాజుల శకుంతల కుమారుడు వినయ్ గురువారం రాత్రి మర్తనపేటలో ఓ శుభకార్యానికి వెళ్లారు. అదే రాత్రి తిరిగి వస్తుండగా ధర్మారం శివారులోని రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట గ్రామస్తులు వెంటనే చేరుకుని ఇద్దరిని కరీంనగర్ తరలించారు. కానీ అప్పటికే సంజయ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ వినయ్‌కి చికిత్స అందిస్తున్నారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నారు.

బావిలో పడి యువకుడు మృతి


అచ్యుత్ మృతదేహం

వెల్గటూర్: ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సమీపంలో గల మామిడితోటలో ధర్మారం మండల కేంద్రానికి చెందిన బొలిశెట్టి అచ్యుత్(28) శుక్రవారం స్నేహితులతో కలిసి విందులో పాల్గొన్నాడు. బహిర్భూమికి వెళ్లివస్తానని తోటలోని బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. అచ్యుత్ ఎంతసేపటికీ రాకపోవడంతో స్నేహితులు వెళ్లి చూడగా బావి వద్ద అతని చెప్పులు ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమక్షంలో బావిలో గాలించగా చాలాసేపటికి మృతదేహం బావిలో లభ్యమైంది. మృతదేహాన్ని బావినుండి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

సీపీఐ మావోయిస్టు దళ సభ్యుడి అరెస్ట్

- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి


అరెస్ట్ చూపిస్తున్న రెమా రాజేశ్వరి

గోదావరిఖని: సీపీఐ మావోయిస్టుపార్టీ దళ సభ్యుడు పామిడిమల్ల అవినాశ్ అలియాస్ మల్లేశ్‌ను అరెస్ట్ చేసినట్లు రామగుండం పోలీస్‌కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శుక్రవారం అవినాశ్ అరెస్ట్‌ను చూపించారు. ఈ సందర్భంగా పలు విషయాలు వెల్లడించారు. సీపీఐ మావోయిస్ట్ పార్టీ కోల్‌బెల్ట్ ఏరియాలో తన ప్రాభవాన్ని పునరుద్ధరించుకోవడానికి చేసే ప్రయత్నాల్లో భాగంగా సికాస కార్యకలాపాలు విస్తరించడానికి గోదావరిఖనికి వచ్చిన మావోయిస్టు పార్టీ సభ్యుడిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఈనెల 8న వేకువజామున ఒంటిగంట ప్రాంతంలో గోదావరిఖని ఆర్జీ–1 జీఎం ఆఫీస్ జంక్షన్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఓ వ్యక్తి చేతిలో సంచితో సీఎస్పీకాలనీ వైపువెళ్తూ పోలీసులకు కనిపించాడన్నారు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు సమీపించగా పారిపోయే ప్రయత్నం చేశాడన్నారు. వెంటనే అప్రమత్తమై అతన్ని పట్టుకుని విచారించగా పార్టీ ఆదేశాలతో గోదావరిఖనికి వచ్చినట్లు తెలిపినట్లు సీపీ వెల్లడించారు. బీఎస్సీ నర్సింగ్ చేసిన అవినాశ్ తన గ్రామంలో ప్రింటింగ్‌ప్రెస్ నడుపుతూ ఉండేవాడని, ఈ క్రమంలో ప్రజా సంఘాల కరపత్రాల ముద్రణ కోసం వచ్చివెళ్లేవారన్నారు. ఈ పరిచయం ద్వారా సీపీఐ మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఏర్పడి వారి భావజాలంపై ఆకర్షితుడయ్యాడని వివరించారు. రెండేళ్ల క్రితం పార్టీలో చేరి పనిచేస్తున్నాడన్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సింగరేణి కార్మిక సమాఖ్య విభాగం ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చాడన్నారు. అతని నుంచి వాల్‌పోస్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పాల్గొన్నారు.

బొగ్గుబాయి

కార్మిక సమస్యల పరిష్కారానికి పోరాటం


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రామగిరి: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం ఏఐటీయూసీ పోరాటం చేస్తుందని జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2, జీఎం కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించారు. కార్మికుల హక్కుల సాధన, సంక్షేమం కేవలం ఏఐటీయూసీతోనే సాధ్యమని, కార్మికులందరూ ఏఐటీయూసీకి మద్దతు పలకాలని కోరారు. కార్మికుల సంక్షేమం, ఐటీ మినహాయింపుతో పాటు అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టీబీజీకేఎస్ సంఘం యాజమాన్యం తొత్తుగా మారి కార్మికుల హక్కులను కాలరాసిందని ఆరోపించారు. సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన కోసం పోరాడుతామని, ఏఐటీయూసీని గెలిపించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సెంట్రల్ సెక్రటరీ జూపాక రాంచందర్, ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఫీట్ సెక్రటరీ మర్రి రాజు, వర్క్‌షాప్ సెక్రటరీ ఎ.పోచం, పోల్ కనకయ్య, సదానందం, పోశం, ఎండీ శ్యామ్, ఎస్.సురేందర్, ఎం.వెంకటేశ్వర్లు, సాంబశివరెడ్డి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ ప్రదర్శనకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ఎం.సాయివినీల్ ఆటోమేటెడ్ డ్రైనేజీ క్లీనర్ ప్రాజెక్టును రూపొందించాడు. ఇది జాతీయస్థాయి రాష్ట్రీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నెల 26 నుంచి మహారాష్ట్రలోని పుణేలో జాతీయ సైన్స్ ప్రదర్శన నిర్వహించనున్నారు. సాయివినీల్‌ను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా మంత్రులకు జ్ఞాపికలు


పొన్నం ప్రభాకర్‌కు బహుమతినిస్తున్న దృశ్యం


శ్రీధర్‌బాబుకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

సిరిసిల్లటౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి తెలంగాణ మంత్రి వర్గంలో నియమితులైన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్‌లను సిరిసిల్ల కాంగ్రెస్ నేతలు శుక్రవారం కలిశారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు తదితరులు కలిసి జ్ఞాపికలు అందించి అభినందనలు తెలిపారు.

రెండిళ్లలో చోరీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మ కాలనీలో రెండిళ్లలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బీడి కార్మికురాలు వేల్ల లావణ్య, ఓబులాపూర్‌లో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న కొమ్మెట నవీన ఇళ్లకు తాళాలు వేసి ఇతర గ్రామాలకు వెళ్లారు. శుక్రవారం దొంగతనం జరిగినట్లు చుట్టుపక్కల వారు గుర్తించి తంగళ్లపల్లి పోలీసులకు సమాచారం అందించారు. లావణ్య కుటుంబం ఈ మూడు రోజుల క్రితం దైవదర్శనానికి తుల్జాపూర్ వెళ్లగా.. కొమ్మెట నవీన కుటుంబం గురువారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు రెండిళ్లలో చోరీకి తెగబడ్డారు. నవీన ఇంట్లో 2 తులాల బంగారం, 12 తులాల వెండి, లావణ్య ఇంట్లో రూ.6వేల విలువ చేసే ముక్కుపుడక, రూ.2వేల నగదు ఎత్తుకెళ్లారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు చేరుకుని డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఉయ్యాల చందర్ గౌడ్(40) అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి, మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందర్ గౌడ్ శుక్రవారం తాటి చెట్టు ఎక్కి, కల్లు గీసి దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తోటి గీత కార్మికులు గమనించేలోపే మృతిచెందాడు. ఎస్‌ఐ ఆసిఫ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా, గౌడ సంఘం నాయకుడు పల్లె రాజమల్లు గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పీఈటీ ఎంపిక


మొహియుద్దీన్

కోనరావుపేట(వేములవాడ): రాష్ట్రస్థాయిలో జరిగే ఖోఖో పోటీలకు టెక్నికల్ ఆఫీసర్‌గా కోనరావుపేట మండలం ధర్మారం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్‌కే మొహియుద్దీన్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ఈనెల 8–10 తేదీల్లో నిజామాబాద్ జిల్లా నందీపేట్‌లో జరుగుతున్నాయి. పోటీలకు ఎంపికైన పీఈటీని ఎంపీపీ చంద్రయ్య, ధర్మారం సర్పంచ్ గున్నాల అరుణ, ఎస్ఎంసీ చైర్మన్ వంగ మాధవి, హెచ్ఎం మురళీనాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన బీసీ సంఘం నాయకులు



మంత్రి ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్ర మంత్రిగా పొన్నం ప్రభాకర్ నియమితులవడం పట్ల బీసీ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తంగళ్లపల్లి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాము శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. వెనకబడిన వర్గాలకు చెందిన, తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన పొన్నంకు మంత్రి పదవి రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాకేశ్



విద్యానగర్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన మల్యాల రాకేశ్ ఎన్నికయ్యారు. ఢిల్లీలో జరుగుతున్న 69వ జాతీయ మహాసభల సందర్భంగా గురువారం హైదరాబాద్ నిర్వహించిన రాష్ట్ర 42వ మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్‌గా ఉన్న రాకేశ్ గతంలో నగర కార్యదర్శి, రాష్ట్ర కార్య సమితి సభ్యుడిగా పని చేశారు.

నూతన నియామకం



లక్ష్మణ్

విద్యానగర్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కరీంనగర్ అర్బన్ అధ్యక్షుడిగా దుస్స లక్ష్మణ్‌ను జాతీయ అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్ నియమించారు. ఉపాధ్యక్షులుగా రావుల శివప్రసాద్, గోరిట్యాల రాజేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల మునీష్, కార్యదర్శిగా సుద్దాల సురేశ్, కన్వీనర్‌గా తాటిపెల్లి అశోక్, కో–కన్వీనర్‌గా మండల రమేశ్, ప్రచార కార్యదర్శిగా మేకల శివకుమార్, కార్యవర్గ సభ్యుడిగా కాంతల నవీన్ రెడ్డి నియమితులయ్యారు.

పరామర్శ



నివాళి అర్పిస్తున్న రామకృష్ణారావు, నాయకులు

కరీంనగర్: తీగలగుట్టపల్లిలో కార్పొరేటర్ కాశెట్టి శ్రీనివాస్ తల్లి రంగమ్మ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు శుక్రవారం పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు శేఖర్‌గౌడ్, సర్పంచ్ పృథ్వీరాజ్, నాయకులు యాదగిరి, శంకర్ తదితరులున్నారు.

యువతి అదృశ్యం

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని గౌతమినగర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. బాధితురాలు ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఏ చదువుతోంది. శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్తానని చెప్పి, ఇంట్లో నుంచి వెళ్లింది. సాయంత్రం తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబసభ్యులు తమ బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ పేర్కొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



స్విచ్ ఆన్ చేస్తున్న శ్రీనివాస్ గౌడ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.2 లక్షలతో వీరహనుమాన్ గుడి, 9వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు మాదాసు శివరామకృష్ణ, మైలారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఔదార్యం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్‌కు వెళ్తూ తరచూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతుండగా ఆ గ్రామ ఎంపీటీసీ గుడిపాటి సరిత సమస్యకు పరిష్కారం చూపారు. సింగాపూర్ గ్రామాన్ని ఆనుకొని ఉన్న మాలపల్లె గ్రామస్తులు మినరల్ వాటర్ కోసం సింగాపూర్ గ్రామానికి వస్తుంటారు. ఇదే క్రమంలో తరుచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల బారినపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లడానికి అంబులెన్స్, గ్రామంలోనే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఔదార్యం చాటుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల నజర్

- నగరంలో నిత్యం తనిఖీలు
- ఈ ఏడాది నమోదైన కేసులు 2,432
- 55 మంది మందుబాబులకు జైలు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

కరీంనగర్ క్రైం: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. అత్యధిక ప్రమాదాలు మద్యం మత్తులోనే జరుగుతుండటంతో ప్రత్యేక దృష్టిసారించారు. నిత్యం నగరంలో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ట్రాఫిక్ పోలీసులతోపాటు సివిల్ పోలీసలు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నారు. కేసులు నమోదు చేస్తూ కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 2,432 కేసులు నమోదు చేయగా కోర్టు 55 మందికి కోర్టు జైలుశిక్ష, వారితోపాటు పలువురికి రూ.30 లక్షల జరిమానా విధించింది.

నిషేధాజ్ఞలు 31 వరకు పొడిగింపు

మద్యం, గంజాయి మత్తులోనే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ప్రజల భద్రత, రక్షణ కోసం కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలు విధించారు. వాటిని ఈ నెల 31 వరకు పొడిగిస్తూ సీపీ అభిషేక్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు.

పొన్నం, దుద్దిళ్లకు పదవులపై హర్షం

- స్వీట్లు పంచి, టపాసులు పేల్చిన కాంగ్రెస్ నాయకులు



ఇందిరాచౌక్‌లో స్వీట్లు పంచుతున్న నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణ ఉద్యమకారుడు పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవితో సముచిత స్థానం లభించిందని పీసీసీ నాయకుడు వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. జిల్లాకు చెందిన వ్యక్తికి మంత్రి పదవి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు. మంకమ్మతోటలోని పొన్నం ప్రభాకర్ నివాసం, ఇందిరాచౌక్ వద్ద కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు, నగర అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచి, టపాసులు పేల్చారు. పొన్నం ప్రభాకర్ తెలంగాణ సాధనకు అలుపెరగని పోరాటం చేశారని, ఎంపీగా పార్లమెంట్‌లో ప్రాణాలకు తెగించి కొట్లాడారని తెలిపారు.

సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాచౌక్‌లో సంబరాలు జరిపారు. నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందన్నారు. ప్రజలు మెచ్చిన ప్రజాసర్కార్ వచ్చిందని పేర్కొన్నారు.

కరీముల్లా షా దర్గాలో ప్రార్థనలు

జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ. తాజ్ ఆధ్వర్యంలో నగరంలోని కాపువాడ కరీముల్లా షా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రేవంత్‌రెడ్డి సీఎం కావడం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు మంత్రులు కావడం హర్షణీయమన్నారు.

ఫతేపుర చౌరస్తా వద్ద..

నగరంలోని ఫతేపురచౌరస్తా వద్ద సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ.మోసిన్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంత్రులు కావడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. కార్యక్రమాల్లో పీసీసీ కార్యదర్శి సమద్ నవాబ్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు ముస్తాక్, చర్ల పద్మ, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, మునిగంటి అనిల్, ఆరిఫ్, ఆమీర్, ఇమ్రాన్, కలీం, అరుణ్, మోహన్, రాజేశం, బాబు, కుర్ర పోచయ్య, ముద్దసాని రంగన్న, కొమ్మెర రవీందర్ రెడ్డి, పులి కృష్ణ, బొబ్బిలి విక్టర్, రాంరెడ్డి, విద్యాసాగర్, సతీశ్, రమేశ్, నరేశ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేతలను కలిసిన మంత్రి, ఎమ్మెల్యే



మంత్రి ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు, వెంకట్‌రెడ్డి

కరీంనగర్: మద్దతు ఇచ్చి, కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి రెడ్డిలను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ సీపీఐ కార్యాలయానికి వెళ్లి, పుష్పగుచ్ఛాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీపీఐ నాయకులు వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, హుస్నాబాద్ నాయకులు కొయ్యడ సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేయొద్దు

తిమ్మాపూర్: మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఏసీలు, ఫ్యాన్లు పాడైపోతే స్టోర్‌రూంలో వేశామని, వాటిని ఆర్‌అండ్‌బీ డీఈకి ఎమ్మెల్యే పీఏ ద్వారా అప్పజెప్పామని తెలిపారు. సొంత డబ్బులతో కొనుగోలు చేసిన ఏసీలను కూడా రసమయి కార్యాలయంలోనే వదిలేశారని, దొంగే దొంగ అన్న చందంగా కాంగ్రెస్ నాయకులు రసమయిని టార్గెట్ చేస్తున్నారని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన ప్రజాక్షేత్రంలోనే ఉంటూ రసమయి బాలకిషన్ ప్రజల పక్షాన పోరాటం చేస్తారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినందున నాయకులు హుందాగా మెదలాలన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం జిల్లా పరిషత్ పాఠశాల పదోతరగతి విద్యార్థి అజయ్ ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రవీణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 7న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–17 కబడ్డీ పోటీలు రామగుండంలోని జడ్పీహెచ్‌ఎస్ ఫెర్టిలైజర్ సిటీలో నిర్వహించగా కరీంనగర్, సిరిసిల్ల జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. జిల్లా జట్టు తరపున పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించాడని తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పారమిత విద్యాసంస్థల యాజమాన్యం

కొత్తపల్లి: స్థానిక పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.శ్రీతేజ్ 9వతరగతి, సి.హెచ్.అభినవ్ 10వతరగతి చదువుతున్న విద్యార్థులు ఇటీవల ఎస్‌జీఎఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జగిత్యాలలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వివిధ జిల్లాల్లో జరిగే 67వ ఎస్.జీ.ఎఫ్. బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రితీష్ మెహతా తెలిపారు. ఈనెల 8 నుంచి 10 వరకు రంగారెడ్డి జిల్లాలో జరిగే అండర్–14 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఎం.శ్రీతేజ్ పాల్గొంటారని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగే అండర్–17 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు సి.హెచ్.అభినవ్ ఎంపికైనట్లు తెలిపారు. చైర్మన్ ప్రసాదరావు, డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, ప్రసూన వినోద్‌రావు, వి.యు.ఎం. ప్రసాద్, ప్రిన్సిపాల్ రితీష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్త రాము, పి.ఇ.టి. రాజు అభినందించారు.

ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం శనివారం నుంచి ప్రారంభమవుతుందని హుజూరాబాద్ డిపో మేనేజర్ పి. అర్పిత తెలిపారు. శుక్రవారం డిపో కార్యాలయంలో మాట్లాడారు. 9 నుంచి అన్ని పల్లెవెలుగు, మినీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని, ఆధార్‌కార్డు లేదా ఏదైనా ఇతర గుర్తింపు కార్డులు చూపించవచ్చని, ట్రాన్స్ జెండర్స్ సైతం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): నూతన ప్రభుత్వంలో ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు సుంకిశీల ప్రభాకర్‌రావు, మండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రమేశ్ మాట్లాడుతూ అర్ధంతరంగా ఆగిపోయిన ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతిపై నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్సీ నివేదికను త్వరగతిన పూర్తి చేసుకొని మెరుగైన పీఆర్సీని అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, సంఘం నాయకులు శ్రీనివాసరాజు, రవీందర్‌రావు ఉన్నారు.

జాతీయ కరాటే పోటీలకు ఎంపిక



మంథని: న్యూఢిల్లీలో ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి కరాటే పోటీలకు బేర ఆదిత్య ఎంపికైనట్లు పట్టణానికి చెందిన షోటోఖాన్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు తెలిపారు. ఈ నెల నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ముగ్గురు విద్యార్థులు పాల్గొనగా అండర్ 17–25 కేజీ విభాగంలో బేర ఆదిత్య తేజ ప్రతిభ కనబరచారు. గోల్డ్ మెడల్ సాధించి న్యూఢిల్లీలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు నాగరాజు పేర్కొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



హుజూరాబాద్: పట్టణంలోని సాయి రూప గార్డెన్‌లో శుక్రవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించామని చర్చి పాస్టర్లు తెలిపారు. వేడుకలకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్రదర్ ఎడ్వర్డ్ విలియమ్ హాజరై దైవ సందేశం వివరించారు. ప్రతి ఒక్కరూ ఉన్నత విలువలతో జీవించాలని, జాలి, దయ, ప్రేమ కలిగి ఉండాలన్నారు. అనంతరం చర్చి పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాస్టర్ ఉదయ్‌కుమార్, కార్యదర్శి జాన్ ప్రభాకర్, కోశాధికారి ఇమ్మానియేల్, దేవదాసు, నవీన్, రాజ్‌కుమార్, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మనోవికాస్ పాఠశాలలో అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

విద్యానగర్: కరీంనగర్‌లోని మనోవికాస్ మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం దివ్యాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్లు పృథ్వీరెడ్డి, సాయిరాం, రజనీకాంత్, శ్రావణ్, లక్ష్మి, జాహెద్ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి బాల కిషన్‌రావు, ప్రిన్సిపాల్ ఉమారాణి, పాఠశాల కమిటీ బాధ్యులు చీటీ రామారావు, పరమేశ్వర్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఉపాధిహామీ గ్రామసభలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు రూ.2.70 కోట్లతో ఉపాధిహామీ పనులు చేపట్టామని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఈజీఎస్ ఏపీవో శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. వాటిపై ఈ నెల 10 నుంచి 15 వరకు సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.10న దుర్శేడ్, 11న చేగుర్తి, మొగ్దుంపూర్, ఎలబోతారం, నగునూరు, జూబ్లీనగర్, 12న చామనపల్లి, బొమ్మకల్, గోపాల్‌పూర్, చెర్లభూత్కూర్, 14న మందులపల్లి, దుబ్బపల్లి, ఫకీర్‌పేట, బహదూర్‌ఖాన్‌పేట, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, తాహెర్‌కొండాపూర్ గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయన్నారు. 15న ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తామని, ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు హాజరు కావాలని కోరారు.

గత ప్రభుత్వ అవినీతిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

విద్యానగర్: కేసీఆర్ సారథ్యంలోని గత ప్రభుత్వ అవినీతిపై విచారణ జరిపి, చర్య తీసుకోవాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక రకాలుగా అవినీతికి పాల్పడి, రూ.లక్షల కోట్లు దోపిడీ చేసిందని ఆరోపించారు. బాధ్యుల నుంచి డబ్బులు రికవరీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, హైదరాబాద్ భూములు, గ్రానైట్, ఇసుక దందాల ద్వారా రూ.5 లక్షల కోట్లు దోచుకున్నారని అన్నారు. దోపిడీ, కుటుంబ పాలనకు ప్రజలు చరమ గీతం పాడారని తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాప్రభుత్వాన్ని పడగొడతామని బీరాలు పోతున్నారని, ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బోయినిపల్లి చంద్రయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు

18న సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి

విద్యానగర్: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఈ నెల 18న నగునూర్ శ్రీ దుర్గాభవానీ ఆలయం ప్రాంగణంలోని వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయంలో ఉదయం 9 గంటలకు స్వామివారికి ఫలపంచామృతాభిషేకం, పూజలు నిర్వహిస్తామని వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ తెలిపారు. అదేరోజు సాయంత్రం వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామివార్ల కల్యాణం జరుపుతామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చోరీ చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

తిమ్మాపూర్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫర్నిచర్ ఎత్తుకెళ్లిన వారిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి కోరారు. ఎల్ఎండీ కాలనీలోని మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో 16 ఫ్యాన్లు, మూడు గ్రీజర్లు, రెండు ఏసీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీ అయ్యాయన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి అనుచరులు చోరీ చేశారని స్థానికుల ద్వారా తెలుసుకున్నామని తెలిపారు . ఈమేరకు ప్రభుత్వ అధికారులకు సమాచారం తెలియజేశామని తెలిపారు. తక్షణమే స్పందించి సంఘటనపై విచారణ చేసి ఫ్యాన్లు, ఏసీలు, గీజర్లు స్వాధీనం చేసుకున్నారని, మిగతా ఫర్నిచర్ దొరకలేదని, చోరీ చేసినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డ్రైనేజీలా ఎస్సారెస్పీ కాలువ



తీగలగుట్టపల్లి ఎస్సారెస్పీ కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. లైనింగ్ శిథిలమైంది. కాల్వలో పేరుకుపోయిన పూడిక తొలగించకపోవడంతో నీళ్లు ముందుకు పోలేని పరిస్థితి. మురికి నీటిని వదలడంతో డ్రైనేజీని తలపిస్తోంది. సమీప కాలనీవాసులు చెత్తాచెదారాన్ని పడేస్తున్నారు. ఫలితంగా పిచ్చిమొక్కలు, తుంగ, పూడికతో అధ్వానంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కాలువలోని పూడిక తొలగించాలని రైతులు కోరుతున్నారు.
– కరీంనగర్‌రూరల్

అండగా నేనున్నా..

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఏపీ సీఎం జగన్ ఓదార్పు


సాక్షి తిరుపతి: అధైర్యపడొద్దు.. అండగా నేనున్నానంటూ తుపాను బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం తిరుపతి, బాపట్ల జిల్లాల్లో పర్యటించి బాధితులను స్వయంగా కలుసుకుని పరామర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో రైతన్నకు జరిగిన అపార నష్టాన్ని చూసి చలించిపోయారు. ఖరీఫ్ సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, పంట నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీతో శనగ విత్తనాలను సరఫరా చేస్తామని తెలిపారు. తిరుపతి నుంచి మొదలుపెడితే సుదీర్ఘ కోస్తా తీరం మొత్తాన్ని తుపాన్ తీవ్రంగా దెబ్బ తీసిందని, ఎప్పుడూ చూడని వర్షం నాలుగు రోజుల్లోనే కురవడంతో పొలాల్లో నీరు నిలిచిపోయి రైతన్నలకు అపార నష్టం వాటిల్లిందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తీసుకొచ్చిన వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. విపత్తు వేళ అధికార యంత్రాంగం వెంటనే అప్రమత్తమై బాధిత ప్రాంతాల్లో విద్యుత్తు పునరుద్ధరణకు చర్యలు తీసుకుందన్నారు. గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్ తొలుత తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని తుపాను బాధిత ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం కోట మండలం విద్యానగర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామానికి చేరుకుని కోతకు గురైన స్వర్ణముఖి నది, వరి పంటలను పరిశీలించారు. స్వర్ణముఖి కోతకు గురి కావటానికి కారణాలను ఆరా తీశారు. బాలిరెడ్డిపాలెంలో తుపాను బాధితులతో నేరుగా మాట్లాడారు.



బాపట్ల జిల్లా పాతనందాయపాలెంలో వర్షానికి తడిసిన వరి కంకులను పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న సీఎం జగన్

బాబు కోర్టు ధిక్కారం

- బెయిల్ షరతులు ఉల్లంఘించి మరీ ఉపన్యాసం
- తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో తన కేసు గురించి ప్రస్తావన
- స్కిల్ స్కాం గురించి మాట్లాడకూడదని చెప్పిన హైకోర్టు, సుప్రీంకోర్టు
- కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా ప్రసంగం
- తప్పు చేయకుండా తనను జైల్లో పెట్టారంటూ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి బెయిల్‌పై బయట ఉన్న చంద్రబాబు బెయిల్ షరతులను యథేచ్ఛగా ఉల్లంఘించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వెళ్లి అక్కడ తన అరెస్టు, జైలు గురించి ప్రసంగించి కోర్టు ఆదేశాలను ధిక్కరించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తన అరెస్టు గురించి మాట్లాడి కోర్టులంటే తనకు లెక్కలేదన్నట్లుగా వ్యవహరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉన్న చంద్రబాబుకు అక్టోబర్ 31న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు గురించి ఎక్కడా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మాట్లాడకూడదని హైకోర్టు బెయిల్ ఆర్డర్‌లో స్పష్టంగా పేర్కొంది. కేసులోని విషయాల గురించి బయట ఎక్కడా చర్చించవద్దని స్పష్టంచేసింది. అలాగే, హైకోర్టు ఆదేశాలను చంద్రబాబు తప్పకుండా పాటించాలని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసు గురించి ఎక్కడా మాట్లాడకూడదని సుప్రీం కోర్టు కూడా ఆదేశించింది. అయితే, చంద్రబాబు మాత్రం వీటిని బహిరంగంగా ఉల్లంఘించారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం అత్తోటలో శుక్రవారం తుపాను బాధితులను పరామర్శించి అక్కడ రాజకీయ ప్రసంగం చేశారు. తుపాను దెబ్బకు అన్ని విధాలుగా నష్టపోయి రైతులు ఆందోళనలో ఉంటే చంద్రబాబు మాత్రం అక్కడకు వెళ్లి తనను అన్యాయంగా అరెస్టు చేశారని, ఏ తప్పు చేయకుండా జైల్లో పెట్టారంటూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు గురించి మాట్లాడారు.

45 ఏళ్లుగా టెక్నికల్‌గా, లీగల్‌గా తప్పుచేయలేదు..

తనలాంటి వాళ్లను కూడా జైల్లో పెట్టేయగలుగుతున్నారని, బాధ కలగదా అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. 45 ఏళ్లుగా తానెక్కడా ఒక్క తప్పు కూడా చేయలేదని, టెక్నికల్‌గా, లీగల్‌గా ఒక్క తప్పూ చేయకుండా ఉన్నానని, అలాంటి తనను జైల్లో పెట్టారని చెప్పారు. ఎలాంటి తప్పు కూడా చేయకుండా ఉన్న పళంగా కేసు బుక్‌చేసి లోపలేశాడని సీఎంను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాను కూడా మనిషినేనని, తనకూ బాధలు ఉంటాయని, తనకూ మనసు ఉంటుందని, చేయని తప్పుకి శిక్ష అనుభవిస్తే ఎలా ఉంటుందంటూ ప్రజల సానుభూతి కోసం ఆయన ప్రయత్నించారు. తన కోసం 52 రోజులుగా అందరూ వీరోచితంగా పోరాడారని, తనను అరెస్టుచేస్తే అందరినీ బెదిరించవచ్చనే ఉద్దేశంతో సీఎం ఇలా చేసినట్లు చంద్రబాబు పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

న్యాయకోవిదుల విస్మయం..

బెయిల్ షరతులను ఉల్లంఘించి తాను అరెస్టయిన కేసు గురించి చంద్రబాబు మాట్లాడడంపై న్యాయకోవిదులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. బెయిల్ పొందినప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటానని చెప్పి బయటకు వచ్చాక ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటనలో అందుకు సంబంధించిన విషయాల గురించి కాకుండా తాను జైలుపాలవడం, కేసుల గురించి మాట్లాడడం ఏమిటనే ప్రశ్నలు సాధారణ ప్రజానీకం నుంచి వినిపిస్తున్నాయి. ఇక అనారోగ్య కారణాలతో మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు కూడా రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు గంటల తరబడి ర్యాలీ చేసుకుంటూ వచ్చి ఆయన కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. తనకు ఆరోగ్యం బాగోలేదని బెయిల్ తీసుకుని భారీఎత్తున ర్యాలీలు చేయడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే, విజయవాడ ఏసీబీ కోర్టు ఈ కేసులోనే ఆయనకు రిమాండ్ విధించినప్పుడు సైతం న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విపరీతంగా కామెంట్లు చేశారు. సోషల్ మీడియాలో న్యాయమూర్తిని అసభ్యపదజాలంతో దూషిస్తూ పోస్టులు పెట్టారు. చంద్రబాబు జైల్లో ఉన్నన్ని రోజులు ఆయన కుమారుడు లోకేశ్, ఇతర నాయకులు కోర్టులను మేనేజ్ చేశారంటూ న్యాయ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడారు. చివరికి అదే న్యాయ వ్యవస్థ నుంచి చంద్రబాబు బెయిల్ పొంది బయటకొచ్చారు. ఇప్పుడు ఆ కోర్టు ఆదేశాలనే ధిక్కరిస్తూ స్కిల్ కుంభకోణం గురించి రాజకీయ ఉపన్యాసం చేయడం గమనార్హం.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ : స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్‌బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ కేసులో ప్రతివాది కౌంటరు దాఖలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. స్కిల్ కుంభకోణం కేసులో పీడీ చట్టం సెక్షన్ 17ఏ పై తీర్పు ఇంకా వెలువరించలేదని చంద్రబాబు తరఫు న్యాయవాది హరీష్ సాల్వే ధర్మాసనానికి తెలిపారు. తీర్పు ఇచ్చేలా ఉంటే వాయిదా వేయాలని, లేదంటే తదుపరి విచారణ తేదీ తెలపాలని ధర్మాసనాన్ని కోరారు. కౌంటరు దాఖలు చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. అయితే, తదుపరి విచారణ జనవరి మూడో వారంలో చేపడతామని ధర్మాసనం పేర్కొంది. తేదీ ఖరారు చేయాలని హరీష్ సాల్వే కోరగా.. జనవరి 19కి వాయిదా వేస్తున్నామని, అప్పటి లోగా కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

ఏపీలో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల

- 81 పోస్టులు భర్తీ చేయనున్న ఏపీపీఎస్సీ
- జనవరి 1 నుంచి 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- మార్చి 17న ఆఫ్‌లైన్‌లో ప్రిలిమ్స్ నిర్వహణ
- ఈ నెలాఖరుకు మరిన్ని నోటిఫికేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయిలో అత్యున్నత సర్వీసులైన గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 81 గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. గురువారం 897 గ్రూప్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సర్వీస్ కమిషన్ తాజాగా గ్రూప్-1 పోస్టులకుసైతం నోటిఫికేషన్‌జారీ చేసింది. అభ్యర్థులు తమ వన్ టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) ఆధారంగా జనవరి 1 నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కొత్త అభ్యర్థులు తొలుత కమిషన్ వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకుని, ఓటీపీఆర్‌తో దరఖాస్తు చేసుకోవాలి. ప్రిలిమినరీ పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో మార్చి 17న ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు సర్వీస్ కమిషన్ పేర్కొంది. డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనుంది. కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 విభాగంలో 9 డిప్యూటీ కలెక్టర్లు, 18 అసిస్టెంట్ ట్యాక్స్ కమిషనర్స్ పోస్టులు, 26 డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్స్, ఆర్టీవో, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్స్, జిల్లా బీసీ సంక్షేమ వంటి ఉన్నత స్థాయి పోస్టులు ఉన్నాయి. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు సైతం ఆఫ్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలోనే నిర్వహించనున్నారు. మొత్తం పోస్టులు, వేతనం, అర్హతలతో కూడిన పూర్తి సమాచారం కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. కాగా, ఇప్పటికే ఆర్థికశాఖ అనుమతినిచ్చిన మరికొన్ని పోస్టులకు ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ఏపీపీఎస్సీ ప్రణాళిక సిద్ధం చేసింది.

వివాదరహితంగా పోస్టుల భర్తీ

గతంలో ఉండే అనేక న్యాయపరమైన వివాదాలను, చిక్కులను పరిష్కరించి ప్రభుత్వం సర్వీస్ కమిషన్‌లో సంస్కరణలు తీసుకొచ్చింది. దాంతో గతేడాది ఏపీపీఎస్సీ ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా ఎలాంటి వివాదాలకు తావులేకుండా 11 నెలల కాలంలో పూర్తి పారదర్శకంగా మెయిన్స్, ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేసింది. గ్రూప్-1 పరీక్షలు, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక సమర్థవంతంగా నిర్వహించి, హేతుబద్ధంగా అభ్యర్థుల వాస్తవిక నైపుణ్యాన్ని అంచనా వేసి ఎంపిక చేశారు. ఈ నియామకాలు అతి తక్కువ సమయంలోనే కమిషన్ పూర్తి చేసింది. ఇదే తరహాలో ఇప్పుడు ప్రకటించిన నోటిఫికేషన్లలో ఇచ్చిన పోస్టులు సైతం సమర్థవంతంగా, సత్వరం భర్తీ చేసేందుకు కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది.

వైద్యశాఖలో 170 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో ఉండే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 144, విశాఖపట్నంలోని విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ ద్వారా శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీ చేయనున్నట్టు బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బోధనాస్పత్రుల్లో వివిధ స్పెషాలిటీలలో ఖాళీగా ఉన్న 144 పోస్టుల్ని శాశ్వత ప్రాతిపదికన (డైరెక్ట్/లేటరల్) భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి ఈనెల 18, 20 తేదీల్లో విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాక్‌ఇన్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తారు. ఇక విమ్స్‌లో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయడం కోసం ఈనెల 15న విశాఖపట్నంలోని విమ్స్‌లోనే వాక్ ఇన్ రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఆయా తేదీల్లో నిర్ణీత ప్రదేశాలకు స్వయంగా హాజరు కావాల్సి ఉంటుంది. అర్హత, ఇతర నియమనిబంధనలతో కూడిన సమగ్ర నోటిఫికేషన్‌ను https://dme.ap.nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉంచకుండా సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఆందోళన

- కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థినుల ర్యాలీ
- పనిష్మెంట్ పేరుతో వేధిస్తోందని ఆవేదన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రిన్సిపాల్ తమతో వ్యవహరిస్తున్న తీరు సక్రమంగా లేదని, వెంటనే ఆమెను సస్పెండ్ చేయాలంటూ.. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు రోడ్డెక్కారు. శుక్రవారం ఉదయం 7 గంటలకే కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ఆందోళన తెలిపారు. పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ దివ్యారాణి తమను మానసికంగా వేధిస్తోందని, కళాశాలకు వచ్చే ఆహార పదార్థాలను బయటకు తీసుకెళ్తోందని ఆరోపించారు. ఉన్నతాధికారులు కళాశాలకు వచ్చినప్పుడు తమకు కలిసే అవకాశం ఇవ్వడం లేదన్నారు. ప్రశ్నించిన వారిని పనిష్మెంట్ పేరుతో బాత్రూంల వద్ద నిలబెట్టడం, చెప్పుల వద్ద కూర్చోని అన్నం తినమని వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధను ఎవరూ పట్టించుకోకపోవడంతోనే రోడ్డెక్కినట్లు తెలిపారు.

అధికారుల హామీతో కళాశాలకు..

విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్నారనే విషయం తెలుసుకున్న డీఆర్వో సురేశ్, డీటీడీవో రమాదేవి, డీఎస్పీ వెంకటరమణ, ఎస్సై మహేందర్, పీటీజీ ప్రిన్సిపాల్ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో పీటీజీ ప్రిన్సిపాల్ సురేశ్ ఫోన్ ద్వారా గిరిజన గురుకులాల అసిస్టెంట్ కమిషనర్ సోమనాథ్‌శర్మతో మాట్లాడించారు. ప్రిన్సిపాల్ దివ్యారాణిని సస్పెండ్ చేస్తామని ఆయన హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ఆందోళన విరమించి కళాశాలకు వెళ్లారు. మధ్యాహ్నం అసిస్టెంట్ కమిషనర్ సోమనాథ్‌శర్మ, ఆర్సీవో గంగాధర్ కళాశాలకు చేరుకుని బాలికలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ శారదకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు.

ఆర్జీయూకేటీ విద్యార్థులకు బంపర్ ఆఫర్

- రూ.17 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు



మహ్మద్ అమరత్



విగ్నేష్

భైంసా టౌన్: బాసర ఆర్జీయూకేటీలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో పలువురు విద్యార్థులు భారీ వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈసారి వందకుపైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికిగాను అత్యధికంగా రూ.17 లక్షల వార్షిక వేతనంతో ఓ విద్యార్థి ఉద్యోగానికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థుల సహవ్యవస్థాపక సంస్థ వైట్ క్యారెట్ ద్వారా ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. మహమ్మద్ అమరత్, వడ్ల నాగరాజు, దూస విగ్నేష్, తిలక్ తుమ్మనపల్లి, పూజిత వెన్నపురెడ్డి, తదితరులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని వెంకటరమణ అభినందించారు.

మంచు సోయగం.. మరో కశ్మీరం







మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లా కశ్మీర్‌ను తలపిస్తోంది. వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు కురుస్తున్న దట్టమైన పొగ మంచు ప్రజలకు కనువిందు చేస్తుండగా వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. వర్షాన్ని తలపించేలా కురుస్తున్న హిమంను చూస్తే మనం ఆదిలాబాద్‌లో ఉన్నామా.. కశ్మీర్‌లో ఉన్నామా అనే సందేహం కలుగకమానదు. తుపాను ప్రభావంతో మారిన వాతావరణం ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సింగరేణిలో తగ్గుతున్న కార్మికులు



సింగరేణి కార్మికులు

- పెరుగుతున్న కాంట్రాక్టీకరణ
- 1.25లక్షల నుంచి 39వేలకు కార్మికులు
- 25వేలకు పెరిగిన కాంట్రాక్టు కార్మికులు
- తగ్గుతున్న భూగర్భ గనులు

గోదావరిఖని: సింగరేణిలో కాంట్రాక్టీకరణ, యాంత్రీకరణ శరవేగంగా సాగుతోంది. తెలంగాణకు కొంగు బంగారంగా నిలుస్తున్న సింగరేణి సంస్థలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఏటేటా వేటు పడుతోంది. పర్మినెంట్ కార్మికులు తగ్గిపోతుండగా.. కాంట్రాక్టు కార్మికులు పెరుగుతూ వస్తున్నారు. 2007–08లో 75వేల కార్మికులుండగా.. నేడు 39,748 మందికి చేరుకున్నారు. రానున్న రోజుల్లో కార్మికుల సంఖ్య మరింత తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. ఒకప్పుడు 1.25లక్షల మందితో కళకళలాడిన సింగరేణి సంస్థలో కార్మికుల సంఖ్య తగ్గిపోయి నేడు 39వేలకు చేరుకుంది. సంస్థలో శరవేగంగా యాంత్రీకరణ, ప్రైవేటీకరణ పెరుగుతూ వస్తోంది. కార్మికుల సంఖ్య తగ్గినా.. యాంత్రీకరణ శరవేగంగా సాగుతుండటంతో బొగ్గు ఉత్పత్తి ఏటా పెరుగుతూ 35మిలియన్ టన్నుల నుంచి 74మిలియన్ టన్నులకు చేరుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సింగరేణి సంస్థలో కార్మికుల కుదింపును కార్మిక సంఘాలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూగర్భ గనులు గణనీయంగా తగ్గిపోతుండగా.. వాటి స్థానంలో ఓసీపీ ఎక్స్‌టెన్షన్ మైన్స్ వస్తుండటంతో నూతన రిక్రూట్‌మెంట్ లేకుండా పోతోందని వాపోతున్నారు.

ఏటేటా తగ్గుతోంది

- సింగరేణిలో భూగర్భ గనుల సంఖ్య ఏటేటా తగ్గిపోతోంది.
- ప్రస్తుతం అండర్ గ్రౌండ్ గనులు 29, ఓసీపీలు 19 ఉన్నాయి.
- రాబోయే కాలంలో కొత్త గనుల సంఖ్య తగ్గే అవకాశముంది.
- యాంత్రీకరణ పెరిగిపోవడంతో తక్కువ మంది కార్మికులతో ఎక్కువ బొగ్గు ఉత్పత్తి తీస్తున్నారు.
- భూగర్భ గనుల్లో తట్టాచెమ్మాస్ కనుమరుగైంది. తట్టాచెమ్మాస్ స్థానంలో సెమిమెకనైజ్డ్, పూర్తిస్థాయి యాంత్రీకరణ గనులుగా తీర్చిదిద్దబడ్డాయి.
- తక్కువ మందితో యంత్రాల ద్వారా ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నారు.
- రాబోయే రోజుల్లో కార్మికుల సంఖ్య కుదింపుపై కార్మిక సంఘాలు స్పష్టమైన ప్రకటన చేయాల్సిన తరుణం ఆసన్నమైంది.

కనుమరుగైన విభాగాలు

- సింగరేణిలో ఉద్యోగాల సంఖ్య తగ్గుతూ వస్తోంది.
- గనులు, పలు విభాగాల్లో పలు డిజిగ్నేషన్లు కనుమరుగైయ్యాయి.
- భూగర్భ గనుల్లో చాలాచోట్ల కోల్‌కట్టర్, రూఫ్‌బోల్టింగ్, సపోర్టుమెన్ పనులకు తాత్కాలిక కార్మికులను వినియోగిస్తున్నారు.
- గనిపైన ఉన్న క్యాంటీన్లు ప్రైవేట్‌పరమయ్యాయి.
- క్యాంటీన్లలో కాంట్రాక్టు కార్మికుల ద్వారా పనులు నిర్వహిస్తున్నారు.
- సివిల్, సివిక్, స్టోర్స్, బెల్ట్ క్లీనింగ్, తోటమాలి తదితర విభాగాల్లో కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు.
- సంస్థలో ప్రస్తుతం కాంట్రాక్టు కార్మికుల సంఖ్య 25వేలకు చేరింది.
- తెలంగాణ సంస్థకు కొంగు బంగారంలా నిలిచిన సింగరేణిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వం, కార్మిక సంఘాలపై ఉంది.

ఎప్పుడు	ఎంతమంది
2007-08	75,573
2008-09	70,586
2009-10	69,043
2010-11	67,615
2011-12	66,466
2012-13	64,600
2013-14	61,778
2014-15	58,837
2015-16	58,491
2016-17	56,282
2017-18	54,043
2018-19	48,942
2019-20	46,021
2020-21	43,895
2021-22	42,300
2022-23	39,748



నేటి నుంచే మహిళలకు | ఉచిత ప్రయాణం

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు హైదరాబాద్ సిటీలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో అనుమతి

- మధ్యాహ్నం ఒకటిన్నరకు అసెంబ్లీ వద్ద ప్రారంభించనున్న సీఎం రేవంత్
- 2 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు.. ట్రాన్స్‌జెండర్లకూ అవకాశం
- టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర సరిహద్దు వరకు అనుమతి
- తొలి వారం రోజులు ఎలాంటి గుర్తింపు కార్డు చూపాల్సిన అవసరం లేదు
- రూ.2,500 కోట్ల వరకు ఆదాయం కోల్పోనున్న సంస్థ.. రీయింబర్స్ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది. టీఎస్ ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తెలంగాణ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా సోనియాగాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం నుంచి దీన్ని అమల్లోకి తెస్తున్నారు. 1.30 గంటల సమయంలో అసెంబ్లీ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆ రెండు కేటగిరీలకు చెందిన బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారు. కర్ణాటకలో ఇప్పటికే దీనిని అమలు చేస్తున్నారు. సంస్థ ఈడీ మునిశేఖర్, రంగారెడ్డి ఆర్‌ఎం శ్రీధర్ ఆధ్వర్యంలో రెండు బృందాలు గురువారం అక్కడ పథకాన్ని పరిశీలించి వచ్చాయి. వారు సమర్పించిన నివేదికపై శుక్రవారం ఎండీ సజ్జనార్, ఇతర ఉన్నతాధికారులు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయి చర్చించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక తరహాలో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పథకాన్ని వర్తింపజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ వెంటనే పథకానికి సంబంధించిన మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వును రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేశారు.

ప్రయాణికుల్లో మహిళల వాటా 45 శాతం

రాష్ట్ర వ్యాప్తంగా మినీ పల్లెవెలుగు, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో, హైదరాబాద్ నగరంలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పథకం అమలవుతుంది. ఈ కేటగిరీలకు సంబంధించిన బస్సులు 7,292 ఉన్నాయి. వీటి ద్వారానే ఆర్టీసీకి ఎక్కువ ఆదాయం సమకూరుతుంది. వీటిల్లో నిత్యం దాదాపు 33 లక్షల మంది ప్రయాణిస్తారు. వీరిలో మహిళల వాటా దాదాపు 45శాతం. ఈ రూపంలో ఇంతకాలం ఆర్టీసీకి వస్తున్న ఆదాయం దాదాపు రూ. 2,200 కోట్ల నుంచి రూ.2,500 కోట్లు. కాగా ఈ ఆదాయం ఇప్పుడు నిలిచిపోనుంది. ఇకపై ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య భారీగా పెరుగుతుందని, నష్టపోయే మొత్తం త్వరలో రూ.3 వేల కోట్లకు చేరుతుందని భావిస్తున్నా రు. అయితే మహిళలకు ఉచిత ప్రయాణం రూపంలో ఆర్టీసీ నష్టపోయే మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయనుంది.

తెలంగాణ మహిళలకే..: తెలంగాణ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఈ వెసులుబాటు రాష్ట్ర సరిహద్దు వరకే ఉంటుంది. సరిహద్దు దాటి ప్రయాణించే దూరానికి టికెట్ కొనాల్సి ఉంటుంది. బాలికలు, యువతులు, మహిళలు, వృద్ధ మహిళలు.. ఇలా వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. వీరితోపాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ వెసులుబాటును కల్పించారు. తెలంగాణ ప్రాంత మహిళలు మాత్రమే ఈ వెసులుబాటు పొందేందుకు అర్హులు. అందుకోసం వారు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు అని నిర్ధారించే ఆధార్‌కార్డు సహా ఇతర ధ్రువ పత్రాల్లో ఏదో ఒకదాన్ని చూపించాల్సి ఉంటుంది. తొలి వారం రోజులు మాత్రం ధ్రువపత్రంతో సంబంధం లేకుండా మహిళలందరినీ ఉచితంగా అనుమతిస్తారు. ఇక అర్హులైన వారందరికీ మహాలక్ష్మీ స్మార్ట్ కార్డులను జారీ చేస్తారు. అప్పుడు స్మార్ట్ కార్డ్ చూపితే సరిపోతుంది. స్మార్ట్ కార్డులు సిద్ధం అయ్యే వరకు జీరో టికెట్‌లను జారీ చేస్తారు. రోజుకు ఎన్ని జీరో టికెట్లు జారీ చేశారో లెక్కించి ప్రభుత్వానికి నివేదిస్తే, దాని ఆధారంగా రీయింబర్స్‌మెంట్ మొత్తం ఆర్టీసీకి అందుతుంది. జీరో టికెట్లు జారీ ప్రారంభించేంతవరకు, బస్సుల్లో ప్రయాణించిన మహిళల సంఖ్యను రోజువారీగా లెక్కించి నమోదు చేయాల్సి ఉంటుంది.

కొత్త బస్సులొస్తున్నాయ్: సజ్జనార్

'ఇటీవలే 776 కొత్త బస్సులు కొన్నాం. జిల్లాల్లో ఇతర కేటగిరీలో తిరిగిన బస్సుల్లో దాదాపు 1,000 వరకు కన్వర్షన్ ద్వారా సిటీ బస్సులుగా మార్చాం. త్వరలో 1,050 కొత్త బస్సులు కొంటున్నాం. మరో 1,000 వరకు ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయి. అవసరమైతే మరిన్ని కొత్త బస్సులు కావాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదిస్తాం. ఆర్టీసీ ద్వారా బ్యాంకుల నుంచి రుణం తీసుకుని బస్సులు కొనేలా ఏర్పాట్లు చేస్తాం. ఇక డ్రైవర్ల అవసరం కూడా ఉన్నందున భర్తీ ప్రక్రియ కూడా ప్రారంభిస్తాం. ఈ గొప్ప పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తాం. ప్రజలు కూడా సహకరించాలి..' అని ఎండీ సజ్జనార్ కోరారు.

కొత్త బస్సులు వచ్చే వరకు సమస్యే: కర్ణాటకలో ఈ పథకం ప్రారంభమైన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళల రద్దీ పెరిగి గందరగోళం నెలకొంది. కర్ణాటకతో పోలిస్తే తెలంగాణలో ఆర్టీసీ బస్సుల సంఖ్య తక్కువ. అక్కడ బెంగళూరులోనే ఆయా కేటగిరీలకు చెందిన బస్సులు 5వేల వరకు ఉంటే, హైదరాబాద్‌లో రెండున్నర వేలు మాత్రమే ఉన్నాయి. రాష్ట్రమంతటా ఇదే తరహా పరిస్థితి ఉండటంతో మహిళల రద్దీ పెరిగితే ఇబ్బందులు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళల సంఖ్య పెరిగితే, పీక్ అవర్స్‌లో పురుషులు ప్రయాణించటం కష్టంగా మారే పక్షంలో పురుషుల కోసం ప్రత్యేక బస్సులు నడిపే అంశాన్ని పరిశీలిస్తామని సజ్జనార్ చెప్పారు. ఇప్పటికే బస్ పాసులు తీసుకున్న మహిళలకు డబ్బులు వెనక్కివ్వబోమన్నారు.

క్లుప్తంగా...

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి: బండి



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గాయపడటం బాధాకరమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తెలంగాణలో సమ్మక్క, సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉన్నత విద్య ప్రాప్తత, నాణ్యతను మెరుగుపరిచేందుకే కాకుండా గిరిజన కళలు, సంస్కృతి, సంప్రదాయాలపై బోధన, పరిశోధనలకు అవసరమైన వసతులకు ఉపయోగపడుతుందని మరో ట్వీట్ చేశారు.

సచివాలయంలో జర్నలిస్టులపై మళ్లీ ఆంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయంలో జర్నలిస్టుల ప్రవేశంపై ఆంక్షలను మళ్లీ పునరుద్ధరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త సచివాలయ భవన నిర్మాణం కోసం ఆయా కార్యాలయాలను సమీపంలోని బీఆర్‌కేఆర్ భవన్‌లోకి తరలించారు. అప్పట్లో ఈ భవన్‌లోకి జర్నలిస్టుల ప్రవేశంపై ఆంక్షలు ఉన్నాయి. కొత్త సచివాలయాన్ని ప్రారంభించిన తర్వాత కూడా జర్నలిస్టులను అనుమతించలేదు. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన సందర్భంగా తొలిసారిగా కొత్త సచివాలయంలో జర్నలిస్టులను అనుమతించారు. ఇది కేవలం ఒకరోజు ఆనందంగా మిగిలిపోయింది. శుక్రవారం ఉదయం సచివాలయంలోకి ప్రవేశించడానికి వెళ్లిన జర్నలిస్టులను గేట్ల వద్దే భద్రత సిబ్బంది అడ్డుకున్నారు. మీడియాను అనుమతించవద్దని సీఎస్ శాంతికుమారి నుంచి ఆదేశాలున్నాయని స్పష్టం చేశారు. దీనిపై జర్నలిస్టులు అసంతృప్తి వ్యక్తంగా చేయగా, ప్రభుత్వం స్పందించింది. సచివాలయం వెలుపల ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లోనే జర్నలిస్టులు వేచి ఉండాలని, సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే సమీక్ష సమావేశాల కవరేజీకి సంబంధించి ఏవైనా ఆదేశాలు వస్తే సమాచారం అందిస్తామని రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాలశాఖ విజ్ఞప్తి చేసింది.

సచివాలయానికి తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయ సందర్శనం కోసం ప్రజలు, కార్యకర్తలు శుక్రవారం భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయంలోకి అనుమతి అనే ప్రచారంతో పలు జిల్లాల నుంచి భారీగా వచ్చారు. కొందరు సమస్యలను చెప్పుకుందామని రాగా, మరి కొందరు సందర్శనార్థం వచ్చారు. సచివాలయంలోనికి అనుమతించే విషయంలో ఇంకా ఎలాంటి నియమనిబంధనలు రాలేదని చెప్పి అధికారులు నిరాకరించారు. అయితే సమ స్యలు, ఇతర పనుల కోసం వచ్చిన ప్రజలకు మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాసులు ఇచ్చి సచివాలయంలోకి అనుమతించారు. సీఎం రేవంత్‌ను కలిసేందుకు సచివాలయానికి రాగా అధికారులు నిరాకరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

అవినీతిపై సమాధానానికి సిద్ధంగా ఉండండి

మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలకు సుఖేశ్ చంద్రశేఖర్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: అవినీతి పై ప్రజలకు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలను ఉద్దేశించి మనీలాండరింగ్ కేసులో నిందితుడిగా ఉన్న సుకేశ్ చంద్రశేఖర్ అన్నాడు. ప్రస్తుతం అతను ఢిల్లీలోని మండోలి జైలులో ఉన్న విషయం తెలిసిందే. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోతుందని తాను ముందుగానే చెప్పానని, చేసిన అవినీతిపై నిజాలు చెప్పడానికి రెడీ కావాలని, త్వరలోనే వారు ఆమ్‌ఆద్మీపార్టీ అవినీతి నేతలను జైలులో కలుసుకుంటానని ఒక లేఖలో పేర్కొన్నాడు. అహంకారానికి తెలంగాణ ప్రజలు ముగింపు పలుకుతారని తాను ముందే చెప్పానని గుర్తుచేశారు.

జారిపడ్డ కేసీఆర్.. | విరిగిన తుంటి ఎముక

- బాత్రూంలోకి వెళ్లే క్రమంలో లుంగీ కాళ్లకు తగలడంతో పడిపోయిన మాజీ సీఎం
- ఎర్రవల్లి ఫాంహౌస్ నుంచి సోమాజిగూడ యశోదకు హుటాహుటిన తరలింపు
- విజయవంతంగా హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించిన వైద్యులు



ఆస్పత్రిలో మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో కేటీఆర్, కవిత, సంతోశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం అర్ధరాత్రి ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో కాలు జారి కిందపడిపోయారు. బాత్రూంలోకి వెళ్లే క్రమంలో లుంగీ కాళ్లకు తగిలి పడిపోవడంతో ఆయన ఎడమ తుంటికి తీవ్ర గాయమైంది. ఆయన సతీమణి శోభారాణి కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఎంపీ సంతోష్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హుటాహుటినా వాహనంలో కేసీఆర్‌ను హైదరాబాద్ సోమాజిగూడలోని యశోదా ఆస్పత్రికి తరలించారు. కేసీఆర్‌కు పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన ఎడమకాలి తుంటి ఎముక విరిగినట్లు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం ఆయనకు విజయవంతంగా హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు శస్త్రచికిత్స జరిగింది. యశోదా ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డా.ప్రవీణ్ కుమార్ ఈ సర్జరీకి సారథ్యం వహించారు. ఈ వైద్య బృందంలో బీఆర్‌ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, డాక్టర్ నితిన్ వెజ్జుం తదితరులు ఉన్నారు. ఈ మేరకు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై యశోద ఆసుపత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని... కోలుకొనేందుకు 6 నుంచి 8 వారాల సమయం పడుతుందని వెల్లడించింది. సర్జరీ అనంతరం కేసీఆర్‌ను గదికి షిఫ్ట్ చేశారు. ప్రస్తుతం ఆయనకు నొప్పి నివారణ మందులు, యాంటీ బయోటిక్స్ అందిస్తున్నారు. నేటి నుంచి అవసరమైన ఫిజియోథెరపీ, న్యూట్రిషన్ అందించనున్నట్టు వైద్యులు చెప్పారు.

వైద్యులతో చర్చించిన కుటుంబ సభ్యులు...

తమ తండ్రి ప్రమాదం బారిన పడటంతో కుమార్తె కవిత, కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్‌రావు, మనవడు హిమాన్షు, ఇతర కుటుంబ సభ్యులు హుటాహుటిన యశోదా ఆస్పత్రికి వెళ్లారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం ఉదయం నుంచే యశోదా ఆస్పత్రికి పోటెత్తారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ మాజీ స్పీకర్ పోచారంతోపాటు పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆస్పత్రిలో కేసీఆర్‌ను పరామర్శించారు. అయితే ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉన్నందున కార్యకర్తలు ఎవరూ ఆస్పత్రికి రావొద్దని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ ఆరోగ్యం కోసం అందరూ ఇంటి వద్దే ప్రార్థించాలని కోరారు.

మెరుగైన చికిత్స అందించాలని సీఎం రేవంత్ ఆదేశం

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆయనకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ యశోదా ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ఆరోగ్యంపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని రేవంత్ ఆదేశించారు.

త్వరగా కోలుకోవాలి: మోదీ

కేసీఆర్ ఆరోగ్యంపై ప్రధాని మోదీ స్పందించారు. కేసీఆర్ గాయప డ్డారని తెలియగానే బాధపడ్డట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యంతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తు న్నట్లు చెప్పారు.

ఆరోగ్య పరిస్థితిపై ఏపీ సీఎం జగన్ ఆరా

సాక్షి, అమరావతి: తెలంగాణ మాజీ సీఎం, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. కేసీఆర్ తనయుడు కేటీఆర్‌కు సీఎం జగన్ ఫోన్ చేసి పరామర్శించారు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష నేతగా కేసీఆర్!

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష నేతగా ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు శనివారం ఉదయం 9 గంటలకు బీఆర్‌ఎస్ తరపున శాసనసభకు ఎన్నికైన 38 మంది ఎమ్మెల్యేలు తెలంగాణభవన్‌లో భేటీ అవుతున్నారు. తుంటి ఎముక చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన కేసీఆర్ ఈ భేటీకి హాజరయ్యే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ ఎమ్మెల్యేల భేటీకి అధ్యక్షత వహిస్తారు. కేసీఆర్‌ను శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు వీలుగా ఈ భేటీలో ప్రవేశపెట్టే తీర్మానాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆమోదిస్తారు. శాసనసభాపక్ష నేత ఎన్నిక అనంతరం పార్టీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ అల్పాహారం చేస్తారు. అనంతరం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రత్యేక వాహనంలో అసెంబ్లీ ప్రాంగణం ఎదుట ఉన్న గన్‌పార్కుకు చేరుకొని తెలంగాణ అమరుల స్తూపానికి నివాళి అర్పిస్తారు. ఉదయం 11 గంటలకు ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన ప్రారంభమయ్యే తెలంగాణ మూడో శాసనసభ తొలి విడత సమావేశాలకు బీఆర్‌ఎస్ సభ్యులు హాజరవుతారు. ప్రొటెం స్పీకర్ సమక్షంలో నిబంధనలకు అనుగుణంగా ఎమ్మెల్యేలుగా బీఆర్‌ఎస్ తరపున ఎన్నికైన నేతలు ప్రమాణ స్వీకారం చేస్తారు.

విపక్ష నేతగా ఉండేందుకు కేసీఆర్ మొగ్గు

శాసనసభలో 119 మంది సభ్యులకుగాను బీఆర్‌ఎస్ తరపున 39 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో బలమైన ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ అవతరించిన నేపథ్యంలో పార్టీ శాసనసభాపక్ష నేతకు కేబినెట్ హోదా దక్కుతుంది. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో విపక్ష నేతగా ఉండేందుకు మొగ్గు చూపినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అయితే కేటీఆర్ లేదా మాజీ మంత్రి హరీశ్‌రావు బీఆర్‌ఎస్ శాసనసభా పక్షనేతగా వ్యవహరిస్తారనే ప్రచారం జరిగింది. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్, శాసనసభా పక్ష నేతగా హరీశ్‌రావుకు చెరో పదవి అప్పగిస్తారని బీఆర్‌ఎస్‌లో చర్చ కూడా జరిగింది. తాము నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని ప్రకటించిన బీఆర్‌ఎస్ తరపున కేసీఆర్ శాసనసభా పక్ష నేతగా వ్యవహరిస్తే అటు పార్టీకి, ఇటు ప్రజలకు మేలు జరుగుతుందనే భావన వ్యక్తమైనట్టు సమాచారం.

నేడు తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల భేటీ

- కేటీఆర్ అధ్యక్షతన ఉదయం 9 గంటలకు సమావేశం

తేలని శాఖలు

- ఢిల్లీలో ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ భేటీ
- శుక్రవారం అర్ధరాత్రి వరకు చర్చోపచర్చలు
- ఎవరికి ఏ శాఖ అనే అంశంపై నేడు స్పష్టత!

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన నేతలకు శాఖల కేటాయింపుపై సస్పెన్స్ కొనసాగుతోంది. శుక్రవారం ఈ అంశంపై స్పష్టత వస్తుందని భావించినా ఏమీ తేల్లేదు. ఈ అంశంపై చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైకమాండ్ పెద్దలతో భేటీ కావాల్సి ఉన్నప్పటికీ వారంతా బిజీ బిజీగా ఉన్నారు. ఇటీవల ఎన్నికలు జరిగిన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ ఎన్నికల ఫలితాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ రోజంతా సమీక్షల్లో పాల్గొన్నారు. దీంతో పార్టీ సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ దాదాపు రెండు గంటల సేపు భేటీ అయి శాఖల కేటాయింపుపై చర్చించారు. హోం, ఆర్థిక, రెవెన్యూ, వైద్యం, మునిసిపల్, విద్యుత్, నీటిపారుదల వంటి కీలక శాఖల కేటాయింపుపై సీనియర్ల నుంచి వస్తున్న వినతులపైనే ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. గతంలో మంత్రులుగా పనిచేసిన సీనియర్లకే కీలక శాఖలు ఇవ్వాలని ఈ భేటీలో నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు వంటి సీనియర్లకు కీలక శాఖలు ఇవ్వాలని, వారి సేవలను వినియోగించుకోవాలని కేసీ సూచించినట్లు సమాచారం. అయితే ఎవరికి ఏ శాఖ ఇచ్చేలా నిర్ణయం జరిగిందన్న విషయం బయటకు రాలేదు. కాగా ఈ భేటీ అనంతరం కేసీ, ఠాక్రే, రేవంత్ కలిసి ఖర్గే నివాసానికి వెళ్లారు. కాసేపటి తర్వాత రాహుల్ కూడా వారితో చేరారు. అర్ధరాత్రి వరకు చర్చలు కొనసాగాయి. శనివారం ఉదయానికి ఈ అంశంపై స్పష్టత వస్తుందని తెలుస్తోంది. ఇక మిగిలిన ఎమ్మెల్యేలలో ఎవరికి మంత్రివర్గంలో చోటు కల్పించాలి? అనే దానిపై మరోసారి చర్చిద్దామని వేణుగోపాల్ సూచించడంతో దీనిపై నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం.

ఎంపీ పదవికి రేవంత్ రాజీనామా

కొడంగల్ ఎమ్మెల్యేగా విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి, తన ఎంపీ పదవికి రాజీనామా చేశారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజక వర్గం నుంచి లోక్‌సభ సభ్యుడిగా ఉన్న ఆయన, స్పీకర్ ఓం బిర్లాను కలిసి తన రాజీనామా సమర్పించారు.

ఎమ్మెల్సీ పదవికి కసిరెడ్డి రాజీనామా



సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ పదవికి కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. కసిరెడ్డి రాజీనామాను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదించారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో కసిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన ఇదివరకు బీఆర్‌ఎస్ తరపున స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలుపొందారు.

'మేడిగడ్డ'పై సీబీఐ దర్యాప్తు చేపట్టాలి

కుంగుబాటుకు బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి.. హైకోర్టులో పిల్ దాఖలు చేసిన కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుకు కారకులెవరో తేల్చే నిమిత్తం కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును సీబీఐకి బదలాయించాలంటూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ రూ.86 వేల కోట్ల సేకరణ వ్యవహారంపై కూడా సీబీఐ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్‌ఎఫ్‌ఐఓ)లతో దర్యాప్తునకు ఆదేశాలివ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీబీఐ, జాతీయ విపత్తుల నిర్వహణ మండలి, డ్యాం సేఫ్టీ అథారిటీ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్‌ఎఫ్‌ఐఓ), రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(పీఎఫ్‌సీ), నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవెలప్‌మెంట్, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

సీబీఐకి అప్పగిస్తేనే కారణాలు బట్టబయలవుతాయి: మహదేవ్‌పూర్ పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తేనే కుంగుబాటుకు అసలు కారణాలు బట్టబయలు అవుతాయన్నారు. నవంబర్ 1న నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఇచ్చిన రిపోర్టును కూడా పరిగణనలోకి తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఇతర రిజర్వాయర్ల భద్రతకు వీలుగా చర్యలు చేపట్టేలా నేషనల్ డ్యాం సేఫ్టీ కౌన్సిల్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది.

'మేడిగడ్డ'పై న్యాయవిచారణ జరిపించాలి


కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో నిజంగా తెలంగాణ వచ్చినట్టుంది: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో సాంకేతిక, నిర్మాణ లోపాలున్నట్టు కేంద్ర జలశక్తి శాఖ చెప్పిందని, ఆ ప్రాజెక్టుకు అనుమతి కూడా లేదని, మేడిగడ్డ ప్రాజెక్టు అక్రమాలపై ప్రభుత్వం న్యాయవిచారణ జరిపించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సమైక్యాంధ్రగా ఉన్నప్పటి కంటే అధ్వానంగా గత ప్రభుత్వం పాలించిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో నిజంగా తెలంగాణ వచ్చినట్టు అయిందని వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టు అక్రమాల్లో బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మహారాష్ట్రతో ఉన్న ఒప్పందం మేరకు తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై వాస్తవాలను ప్రభుత్వం వెలికి తీయడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికలలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా ఆరు గ్యారంటీలపై మంత్రివర్గ నిర్ణయం తీసుకోవడం, మహిళలకు ఉచిత ప్రయాణం హామీని సోనియా పుట్టినరోజున అమలు చేయడం హర్షణీయమని జీవన్‌రెడ్డి చెప్పారు.

కొలువుదీరనున్న కొత్త సభ

- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు
- ప్రొటెమ్ స్పీకర్‌గా అక్బరుద్దీన్
- సాయంత్రం స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ నామినేషన్!
- ఆదివారం స్పీకర్ ఎన్నిక ప్రక్రియ
- 11న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం



శుక్రవారం రాత్రి విద్యుత్ వెలుగులలో అసెంబ్లీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ శనివారం ఉదయం 11 గంటలకు తొలిసారిగా కొలువుదీరనుంది. ఈ మేరకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదేశాల మేరకు అసెంబ్లీ కార్యదర్శి శుక్రవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేశారు. కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానం తదితరాల కోసం నాలుగు రోజుల పాటు అసెంబ్లీ తొలి సమావేశాలు జరుగనున్నాయి.

రాజ్‌భవన్‌లో అక్బరుద్దీన్ ప్రమాణ స్వీకారం

తొలిరోజు సమావేశంలో కొత్తగా ఎన్నికైన 119 మంది ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏఐఎంఐఎం సీనియర్ శాసన సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీని ప్రొటెమ్ స్పీకర్‌గా నామినేట్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రొటెమ్ స్పీకర్‌గా అక్బరుద్దీన్‌తో రాజ్‌భవన్‌లో శనివారం ఉదయం 8.30కు గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సీఎం ఎ.రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు ప్రొటెమ్ స్పీకర్ అధ్యక్షతన తెలంగాణ మూడో శాసనసభ తొలిరోజు సమావేశం ప్రారంభమవుతుంది. తొలుత సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆ తర్వాత తెలుగు అక్షరమాలలోని అక్షర క్రమంలో ఎన్నికైన ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేస్తారు.

కేసీఆర్, రాజాసింగ్ దూరం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శనివారం జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లేదు. బీజేపీ తరపున ఎన్నికైన రాజాసింగ్.. ప్రొటెమ్ స్పీకర్‌గా ఎంఐఎం ఎమ్మెల్యేను నియమించినందున తాను ఆయన ఎదుట ప్రమాణ స్వీకారం చేయబోనని ప్రకటించారు.

నేడు స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్

శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత స్పీకర్ ఎన్నిక కోసం శనివారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల కానుంది. వికారాబాద్ శాసనసభ్యుడిగా ఎన్నికైన మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శాసనసభ స్పీకర్‌గా కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించినట్లు సమాచారం. ఆయన శనివారం సాయంత్రం సీఎం రేవంత్, మంత్రివర్గం సమక్షంలో నామినేషన్ సమర్పిస్తారని తెలిసింది. కాగా రెండో రోజు ఆదివారం స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత బాధ్యతల స్వీకరణ కార్యక్రమం, ఆ తర్వాత కొత్త స్పీకర్ అధ్యక్షతన అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతాయి. ఈ నెల 11న సోమవారం జరిగే మూడో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత వాయిదా పడే సభ తిరిగి 12వ తేదీ మంగళవారం ఉదయం ప్రారంభమవుతుంది. నాలుగో రోజు సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన తర్వాత సభ నిరవధికంగా వాయిదా పడుతుంది.

బీఆర్‌ఎస్‌కు విపక్ష హోదా

శాసనసభలో మొత్తం 119 మంది సభ్యులకు గాను తెలంగాణ మూడో శాసనసభలో అధికార కాంగ్రెస్‌కు 64, మిత్రపక్షం సీపీఐకి ఒకరు చొప్పున ఎమ్మెల్యేల బలం ఉంది. బీఆర్‌ఎస్ 39, బీజేపీ 8, ఏఐఎంఐఎంకు ఏడుగురు సభ్యుల బలం కలిగి ఉన్నాయి. అధికార కాంగ్రెస్ తర్వాత ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలు ఉన్న బీఆర్‌ఎస్‌కు విపక్ష హోదా దక్కే అవకాశముంది.

ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్

మూడో శాసనసభ తొలి సమావేశాలు శనివారం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం అసెంబ్లీలో అధికారులతో సమీక్ష తర్వాత భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, అసెంబ్లీ చీఫ్ మార్షల్ కరుణాకర్, ఐఏఎస్ అధికారులు అశోక్‌రెడ్డి, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

తొలిసారిగా అసెంబ్లీకి 51 మంది

అన్ని పార్టీల తరఫున కలుపుకుని మొత్తం 51 మంది తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు కాగా, కరీంనగర్ జిల్లా నుంచి 8 మంది తొలిసారిగా ఎన్నికైన వారున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఇద్దరు తొలిసారి అడుగు పెడుతున్నారు. 51 మందిలో 18 మంది క్రియాశీల రాజకీయాల్లోకి అరంగేట్రం చేస్తున్న వారే.

పిల్లల కేర్ ఇంత



కొద్ది రోజులుగా వాతావరణంలో చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. చిన్నారులు, పెద్దవాళ్ల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే చలికాలంలో జలుబు, దగ్గుతోపాటు చిన్నపాటి సీజనల్ రుగ్మతలు పిల్లలను, వృద్ధులను బాధించడం సర్వసాధారణం కాబట్టి వారి సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఓసారి గుర్తు చేసుకుందాం.

శీతాకాలంలో చిన్నారులకు ఊపిరితిత్తుల సమస్య వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఈ కాలంలో వైరల్ జ్వరాలు వ్యాపించే ముప్పు ఉంటుంది. జ్వరం ఉన్నట్లయితే వైద్యుని సంప్రదించి మందులు వాడాలి.

ఇన్ఫెక్షన్లు: చిన్నారులకు ఈ కాలంలో రకరకాల ఇన్ఫెక్షన్ సోకే అవకాశాలుంటాయి. ముఖ్యంగా చెవులలో చీముతో కూడిన కురుపులు వస్తుంటాయి. అలాగే చలికి ముక్కు లోపల భాగం పొడిబారటం వల్ల రక్తం కారటం సర్వసాధారణం. అదేవిధంగా చర్మంపై దురదలు రావడం వల్ల గోకినప్పుడు పుండ్లు పడే వీలుంది. ఒకవేళ అలా పుండ్లు పడితే వైద్యులను సంప్రదించాలి. తగిన వైద్యం చేయించాలి. చెవులు కవర్ అయ్యే విధంగా మంకీ క్యాప్ పెట్టాలి. వైద్యుల సలహా మేరకు ముక్కులో, చెవిలో చుక్కల మందు వేయాలి.

చలిని తట్టుకునే ఆహారం..

చలికాలంలో పోషకాలు ఉండే ఆహారాలను ఇవ్వడం వల్ల వారికి జబ్బులను తట్టుకునే శక్తి వస్తుంది. పాలిచ్చే తల్లులయితే తాము తీసుకునే ఆహారంలో తగిన పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఆహారం తీసుకునేంత పిల్లలయితే వారికి సీజన్‌కు తగ్గ పండ్లు తినిపించాలి.

కురుల సంరక్షణ..

శీతాకాలంలో తొందరగా పొడిబారిపోయే గుణం ఉండటం వల్ల పిల్లలలో మాడుపై ఉండే తేమ ఆరిపోయి వారి లేతచర్మం చిట్లినట్లవుతుంది. అందువల్ల బేబీ హెయిరాయిల్‌తో తలపై సున్నితంగా మర్దన చేయడం వల్ల తలపై ఉండే లేత చర్మం పగలకుండా నివారించవచ్చు.

స్నానం ఇలా..

శిశువు చర్మసంరక్షణలో స్నానం ముఖ్యమైనది. చలికాలం కదా అని కొందరు పిల్లలకు బాగా వేడినీళ్లతో స్నానం చేయిస్తారు. దీనివల్ల పిల్లల్లో చర్మం పొడిబారుతుంది. అందువల్ల, చలికాలంలో బిడ్డల స్నానానికి ఎక్కువ సమయం కేటాయించకుండా వారి లేత శరీరం తట్టుకోగలిగేంత వేడినీటితో... అదీ వీలయినంత తొందరగా స్నానం చేయించడం ఉత్తమం. దీనివల్ల చర్మంలోని తేమ తగ్గదు. వాతావరణం మరీ చల్లగా ఉంటే స్పాంజ్ బాత్‌తో సరి పెట్టవచ్చు.

క్రీమ్, మాయిశ్చరైజర్

పిల్లల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి ఏదైనా క్రీమ్ లేదా లోషన్ ఉపయోగించే ముందు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా ముఖ్యం. ఇందు కోసం సహజ ఉత్పత్తులు లేదా డాక్టర్ ఆమోదించిన క్రీమ్ లేదా మాయిశ్చరైజర్‌ను ఉపయోగించడం మేలు. దీనిమూలంగా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. అంతేకాదు చలికాలంలో పిల్లల చర్మం చాలా త్వరగా గరుకుగా మారుతుంది. స్నానం చేయించిన తర్వాత వారి ఒంటికి బేబీ లోషన్ రాయాలి.



చర్మ సంబంధమైన సమస్యలు రాకుండా..

ఈకాలంలో ముందుగా చలి ప్రభావానికి గురయ్యేది చర్మమే కాబట్టి చర్మ సంబంధ సమస్యలు రాకుండా మాయిశ్చరైజింగ్ క్రీములు రాయాలి. లేదంటే స్నానం చేయించే ముందు వెన్న లేదా నువ్వుల నూనె రాసి కాసేపు ఎండ తగిలేలా ఉంచాలి. తర్వాత వారు తట్టుకోగలిగే వేడినీళ్లతో స్నానం చేయించాలి. చలి తీవ్రత తగలకుండా చిన్నారులకు ఉన్ని దుస్తులు వేయాలి. చేతులకు గ్లౌజు వేయాలి.

పెదవులు పగలకుండా..

చలికాలంలో పిల్లలకు పెదవులు పగిలిపోవడం సర్వసాధారణం. ఇలా కాకుండా నివారించడానికి వెన్న లేదా పేరిన నెయ్యిని వారి పెదవులకు రాస్తూ ఉండాలి. అది లోపలికి పోయినా ప్రమాదం ఉండదు. లేదంటే బేబీ లిప్ బామ్స్ అయినా వాడచ్చు.

డైపర్ ర్యాషెస్ రాకుండా..

ఏ కాలంలో అయినా పసిపిల్లలకు డైపర్ రాష్ సమస్యలు చాలా సాధారణం. డైపర్ రాష్‌ను ఎదుర్కోవడానికి వైద్యుల సలహా మేరకు క్రీమ్‌లు, మాయిశ్చరైజర్‌లను ఉపయోగించాలి. అలాగే, డైపర్ ప్రాంతాన్ని ఆల్కహాల్ లేని వెట్ వైప్‌లతో శుభ్రం చేయడం మేలు. లేదంటే అలోవెరా జెల్ రాసినా ఫరవాలేదు. అన్నింటికీ మించి బిడ్డలకు అమ్మ సామీప్యం ఎక్కువ వెచ్చదనాన్నిస్తుంది కాబట్టి వీలయినంత వరకు తల్లులు పిల్లలకు దగ్గరగా ఉండేలా చూసుకోవాలి.

ఈ జాగ్రత్తలు తీసుకుంటే పిల్లలు చలికాలంలోనూ ఆరోగ్యంగా కేరింతలు కొడతారు. చివరగా... వృద్ధులూ పిల్లల్లాంటివారేనని మరవకండి.

ఎలా చదువుతున్నారు?



ఈ విద్యాసంవత్సరంలో దాదాపు మూడు వంతులు అయిపోయింది. మరో మూడు నాలుగు నెలల్లో సంవత్సరాంత పరీక్షలు వస్తాయి. ఇంతవరకు పిల్లలు ఏదో చదువుకుంటున్నారులే అని సరిపెట్టుకుంటున్న తల్లిదండ్రులు, ఇంకా నాలుగైదు నెలలు ఉంది కదా.. అప్పుడు చదువుకోవచ్చులే అనుకునే విద్యార్థులు కనీసం ఇప్పటినుంచి అయినా చదువు మీద దృష్టి పెట్టి ప్రణాళికాబద్ధంగా చదువుకోకపోతే తర్వాత బాధపడి ప్రయోజనం ఉండదు.

చదవడం మంచిదే కానీ దానికి ఒక ప్రణాళిక అంటూ ఉండాలి. సరైన ప్లాన్ లేకుండా చదవడం వల్ల అనుకున్న లక్ష్యాన్ని సాధించడం కష్టం అవుతుంది. అందువల్ల ముందుగా మీరు ఏం చదవాలనుకుంటున్నారు? ఇంకా ఎంత పోర్షన్ చదవాల్సి ఉంది? అది పూర్తి చేయడానికి ఇంకా ఎంత సమయం ఉంది... అనే అంశాలపై ఒక అవగాహనకు రండి. దాని ప్రకారం ప్లాన్ చేసుకుని చదవండి. తల్లిదండ్రులయితే కనీసం ఇప్పుడైనా పిల్లల లక్ష్యాలకు లేదా మీ అభిరుచులకు తగిన విధంగా ప్లాన్ వేసి చదివిస్తే అనుకున్న లక్ష్యం తప్పక నెరవేరుతుంది.

పడుకుని చదవడం

చదువుకునే వారికి ఉండకూడని అలవాట్లలో బెడ్‌పై పడుకుని చదవడం ఒకటి. ఇలా చేయడం వల్ల మీరు మీ చదువుపై సరైన దృష్టి పెట్టలేరు. అందుకే మీ గదిలో ఒక టేబుల్, దాని పక్కనే ఒక కుర్చీ ఏర్పాటు చేసుకోవాలి. కుర్చీపై కూర్చుని చదువుకుంటే మీ ఏకాగ్రత పెరిగి మీరు చదివింది తలకెక్కుతుంది. తల్లిదండ్రులు మీ పిల్లలు ఎలా చదువుతున్నారో ఒక కన్నేసి ఉంచడం మేలు.



పక్కనే ఫోన్ పెట్టుకోవడం... ఫోన్ చూస్తూ చదవడం

చదువుకునే సమయంలో ఫోన్ పక్కనే పెట్టుకోవడం చాలా తప్పు. దగ్గరలోనే ఫోన్ ఉండటం వల్ల దృష్టి అంతా ఫోన్ పైనే ఉంటుంది. మీకు తెలియకుండానే సమయం వృథా అవుతుంది. అందుకే మీ ఫోన్ వీలైనంత దూరంలో పెడితే మంచిది. పిల్లలు చదువుకునేటప్పుడు తల్లిదండ్రులు వారి చేతికి ఫోన్ అందకుండా చేయడం సరైన మార్గం.

రీడింగ్ టేబుల్ నీట్‌గా

మీ రీడింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసుకున్న టేబుల్‌పై ఎలాంటి అనవసర వస్తువులు, ఇతర చెత్తాచెదారం లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే వాటిపైకి దృష్టి మరలి ఏకాగ్రత దెబ్బతింటుంది.

విశ్రాంతి లేకుండా చదవడం

కొందరు అదేపనిగా చదువుతూ పోతారు. అయితే అలా గ్యాప్ లేకుండా చదవడం సరికాదు. ప్రతి రెండు లేదా మూడు గంటలకు ఒకసారి మధ్యలో కొద్దిపాటి బ్రేక్ తీసుకుని కూర్చున్న చోటు నుండి లేచి అలా బయటికి వచ్చి విశ్రాంతి తీసుకోవాలి. లేదా అలా కాసేపు కళ్లు మూసుకుని రిలాక్స్ అవడం, ఇంకా వీలైతే ధ్యానం చేయడం మంచిది.

సెల్ఫ్ కేర్ లేకుండా చదవడం

ఫస్ట్ ర్యాంక్ కోసం ఆరాటపడే కొంతమంది విద్యార్థులు, ఉద్యోగాల కోసం కుస్తీలు పట్టే వారు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా పుస్తకాల్లో తల దూరుస్తుంటారు. అది కూడా సరి కాదు. తగిన ఆహారం, నిద్ర, కావలసినంత విశ్రాంతి లేకుండా చేసే ఏ పనిలోనూ పూర్తిస్థాయిలో ఏకాగ్రత సాధించడం చాలా కష్టం. దీర్ఘకాలంలో అది ఆరోగ్యానికే ప్రమాదం అని విషయం మర్చిపోవద్దు.

చివరి నిమిషంలో చదవడం

కొంతమంది ముందుగా సమయం వృథా చేసి చివరి నిమిషంలో పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. అది మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి సరిపోయే సమయం కాదని మరచిపోవద్దు. దానివల్ల మీరు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని మీరే చిన్నది చేసుకోవడంతోపాటు అది నీరుగారిపోయేలా చేసుకున్న వారు అవుతారు.

తల్లిదండ్రులు పిల్లలకు తాము అనుకున్న మార్కులు రాలేదని తీరా పరీక్షలు అయిపోయి ఫలితాలు వచ్చిన తర్వాత బాధపడకుండా ముందు నుంచే వారి చదువుపై దృష్టి పెట్టడం మంచిది.

కలిపి తినకండి...



కాకరకాయలను తినడం వల్ల శరీరానికి బోలెడు లాభాలు కలుగుతాయి. ఇందులో ఉండే పోషకాలు శరీరంలోని అనారోగ్య సమస్యలకు ఉపశమనం కలిగిస్తాయి. ముఖ్యంగా మధుమేహులకు ఇవి దివ్యౌషధంలాంటివి. అయితే చాలామంది కాకరను తినకూడని వాటితో కలిపి తింటున్నారు. ఇలా తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఏయే ఆహార పదార్థాల్లో కాకరను కలిపి తీసుకోకూడదో తెలుసుకుందాం.

పాలు

కాకరకాయతో తయారు చేసిన ఆహార పదార్థాలు తిన్న వెంటనే పాలు తాగకూడదని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇలా రెండింటిని కలిపి తీసుకోవడం వల్ల చాలా రకాల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి.

పెరుగుతో...

కాకరకాయలను తిన్న తర్వాత పెరుగన్నం తినడం శరీరానికి హానికరమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మజ్జిగలో లాక్టిక్ యాసిడ్, కాకరలో ఉండే పోషకాలు కలవడం వల్ల చర్మ సమస్యల వచ్చే అవకాశాలు ఉన్నాయి.

మామిడితో...

వేసవి కాలంలో అందరూ మామిడిని ఎంతో ఇష్టపడి తింటూ ఉంటారు. అయితే కాకరతో తయారు చేసిన ఆహారాల్లో మామిడిని వినియోగించి తీసుకోవడం తీవ్ర ఉదర సమస్యలకు దారి తీయవచ్చని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. దీనివల్ల వాంతులు, మంట, వికారం, ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. కొందరిలో జీర్ణ సంబంధ సమస్యలు కూడా వచ్చే అవకాశాలున్నాయి.

ముల్లంగితో...

కాకరకాయ, ముల్లంగిని కలిపి తీసుకోవడం వల్ల కూడా తీవ్ర అనారోగ్య సమస్యల రావచ్చని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. దీని కారణంగా కొంతమందిలో ఎసిడిటీ, కఫం వంటి సమస్యలు వస్తాయి. కాబట్టి వీటిని కలిపి తీసుకోవడం మానుకోవాల్సి ఉంటుంది.





హిట్ డైరెక్షన్



● శ్రీకాంత్ ఓదెల ● వేణు ఎల్దండి ● శౌర్యువ్ ● షణ్ముఖ్ ప్రశాంత్ ● కల్యాణ్ శంకర్ ● క్లాక్స్ ● సెబాస్టియన్

లైఫ్ డైరెక్షన్ బాగుండాలంటే కెరీర్ మంచి డైరెక్షన్‌లో వెళ్లాలి. ఆ డైరెక్షన్‌ని సెట్ చేసుకోవడంలోనే టాలెంట్ ఉంటుంది. సెట్ చేసుకున్నాక హిట్ డైరెక్షన్‌లో వెళ్లడానికి శ్రమ అనుకోకుండా వీలైనంత కష్టపడాలి. ఈ ఏడాది కొందరు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లోకి గోల్ సెట్ చేసుకుని, ఎంతో తపనతో ఎంటరయ్యారు. ఫస్ట్ మూవీతో నిరూపించుకోవడానికి హార్డ్‌వర్క్ చేశారు. హిట్ అయిన డైరెక్టర్ల శాతం ఎక్కువే ఉంది. అలా 'హిట్ డైరెక్షన్'లో కెరీర్ పరంగా ఒక మెట్టు ఎక్కిన దర్శకులతో పాటు పరిచయం అయిన ఇతర దర్శకుల గురించి తెలుసుకుందాం.

లక్ అంటే శ్రీకాంత్ ఓదెలదే. మరి.. దర్శకత్వం వహించిన తొలి చిత్రమే ('దసరా') పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అంటే లక్కే కదా. పైగా నేచురల్ స్టార్ నాని సినిమాకి చాన్స్ అంటే చిన్న విషయం కాదు. యాక్చువల్‌గా శ్రీకాంత్ పదో తరగతి చదువుతున్నప్పుడే సుకుమార్ దర్శకత్వం వహించిన 'జగడం' చూసి, సినిమాలపై ఆసక్తి పెంచుకున్నారు. అయితే ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఏ దర్శకుడి (సుకుమార్) సినిమా చూసి స్ఫూర్తి పొందారో.. అదే దర్శకుని వద్ద అసిస్టెంట్‌గా చేరేందుకు నాలుగేళ్లు కష్టపడ్డారు. 'నాన్నకు ప్రేమతో', 'రంగ స్థలం' చిత్రాలకు సుకుమార్ వద్ద అసిస్టెంట్‌గా చేశారు శ్రీకాంత్. 'రంగస్థలం' తర్వాత తన నిజ జీవిత ఘటనలతో 'దసరా' కథ రాసుకున్నారు. ఆ కథ నిర్మాత సుధాకర్ చెరుకూరి, నానీలకు నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. తెలంగాణలోని గోదావరిఖని సమీపంలో ఉన్న సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందిన 'దసరా' పాన్ ఇండియా స్థాయిలో విడుదలై, నాని కెరీర్‌లో తొలి వంద కోట్ల సినిమాగా నిలిచింది. శ్రీకాంత్ మలి చిత్రం కూడా నానీతోనే రూపొందనుందని టాక్.

• • •

హాస్యనటుడిగా ప్రేక్షకులను అలరించిన వేణు యెల్దండిలో మంచి ఎమోషనల్ డైరెక్టర్ ఉండి ఉంటాడని ఎవరూ ఊహించి ఉండరు. 'బలగం' సినిమాతో తనలోని మంచి దర్శకుణ్ని ఆవిష్కరించుకున్నారు వేణు. వాస్తవానికి దగ్గరగా మరణం, భావోద్వేగాల చుట్టూ కథ రాసుకుని ప్రేక్షకులతో కన్నీళ్లు పెట్టించారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌లో హర్షిత్ రెడ్డి, హన్షితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎవరూ ఊహించని వసూళ్లను రాబట్టింది. ఇక తనకు తొలి చాన్స్ ఇచ్చిన 'దిల్' రాజు ప్రొడక్షన్‌లోనే మలి సినిమా చేసేందుకు కథ సిద్ధం చేసుకుంటున్నారు వేణు.

• • •

చదివింది ఇంజినీరింగ్ అయినా డైరెక్టర్ కావాలనే కలతో హైదరాబాద్‌లో అడుగుపెట్టారు షణ్ముఖ ప్రశాంత్. తన సొంత కథలతోనే పలు షార్ట్ ఫిలింస్ తీశారాయన. ఆ సమయంలో సుహాస్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో సుహాస్ హీరోగా నటించిన 'కలర్ ఫోటో' చిత్రంలో కొన్నాళ్లు దర్శకత్వం విభాగంలో చేశారు. ఆ తర్వాత సుహాస్ హీరోగా చేసిన 'ఫ్యామిలీ డ్రామా' చిత్రానికి రైటర్‌గా చేశారు. ఆ టైమ్‌లో తాను సిద్ధం చేసుకున్న 'రైటర్ పద్మభూషణ్' కథని సుహాస్‌కి చెప్పడం.. ఆయనకి నచ్చడంతో ఈ సినిమా పట్టాలెక్కింది. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా నటించారు. మదర్ అండ్ ఫాదర్ సెంటిమెంట్, ఎమోషనల్–కామెడీ డ్రామాతో తొలి హిట్ సాధించారు షణ్ముఖ ప్రశాంత్.

• • •

చిత్తూరు జిల్లా మంగళంపేటకు చెందిన కల్యాణ్ శంకర్ 'మ్యాడ్'తో దర్శకుడిగా పరిచయమయ్యారు. స్వగ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు మీడియంలో చదువుకున్న కల్యాణ్ శంకర్ తొలి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్నారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియారెడ్డి, అనంతికా సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'మ్యాడ్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర నిర్మించారు. విడుదలైన రెండు మూడు రోజుల్లోనే ఈ సినిమా లాభాల బాట పట్టింది.

• • •

భీమవరానికి చెందిన క్లాక్స్ (అసలు పేరు ఉద్దరాజు వెంకటకృష్ణ పాండురంగ రాజు) తొలి చిత్రం 'బెదురులంక 2012'తో హిట్ అందుకున్నారు. కార్తికేయ, నేహాశెట్టి జంటగా రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇండస్ట్రీలోకి రాకముందు క్లాక్స్ పలు ఉద్యోగాలు చేశారు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అనే ఇటాలియన్ సినిమా చూశాక ఇండస్ట్రీకి వెళ్లాలనే ఆలోచన కలిగింది. దర్శకులు సుధీర్ వర్మ, రామ్ గోపాల్ వర్మ, దేవా కట్టాల వద్ద అసిస్టెంట్‌గా చేశారాయన. డైరెక్టర్ అజయ్ భూపతి ద్వారా హీరో కార్తికేయ పరిచయం కావడంతో ఆయనతో 'బెదురులంక 2012' తీసి హిట్ అందుకున్నారు.

• • •



● పూజా కొల్లూరు

తెలుగు చిత్ర పరిశ్రమలో మహిళా దర్శకుల సంఖ్య తక్కువగా ఉంటుంది. ఈ ఏడాది 'మార్టిన్ లూథర్ కింగ్' సినిమాతో పూజా కొల్లూరు దర్శకురాలిగా పరిచయమయ్యారు. అమెరికాలో డైరెక్షన్, స్క్రీన్ రైటింగ్, సినిమాటోగ్రఫీ విభాగాల్లో డిగ్రీ పట్టా పొందారు పూజ. 30కి పైగా చిత్రాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలకు పని చేసిన పూజ పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. సమాజానికి మంచి సినిమాలు అందించాలన్న లక్ష్యంతో ఇండియా వచ్చారామె. తొలి ప్రయత్నంగా సంపూర్ణేశ్ బాబు హీరోగా 'మార్టిన్ లూథర్ కింగ్' సినిమా తెరకెక్కించారామె. తమిళంలో విజయవంతమైన 'మండేలా'కు తెలుగు రీమేక్‌గా ఇది రూపొందింది. ప్రధానంగా ఓటు విలువని తెలియజెప్పేలా ఈ చిత్రం సాగుతుంది. సమాజంలోని అసమానతల్ని ఎత్తి చూపుతూ ఆలోచింపజేస్తుందీ చిత్రం. తొలి చిత్రంతో దర్శకురాలిగా మంచి మార్కులు తెచ్చుకున్న పూజా కొల్లూరు తన తర్వాతి చిత్రాలకు కథలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఈ ఏడాది ఆఖరి నెలలో విడుదలైన 'హాయ్ నాన్న' చిత్రంతో దర్శకునిగా పరిచయమయ్యారు శౌర్యువ్. తొలి సినిమాతోనే హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారాయన. నాని, మృణాల్ ఠాకూర్ జంటగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. వైజాగ్‌కి చెందిన శౌర్యువ్‌ని ఇంట్లో వాళ్లు మెడిసిన్ చేయమన్నారు. అయితే సినిమాలపై ఇష్టంతో మూవీ నేపథ్యం లేకున్నా పరిశ్రమలోకి వచ్చారాయన. కన్నడ, తెలుగు భాషల్లో తెరకెక్కిన 'జాగ్వార్', 'అర్జున్ రెడ్డి' తమిళ రీమేక్ 'ఆదిత్య వర్మ' చిత్రాలకు సహాయ దర్శకుడిగా చేశారు. నాలుగేళ్ల క్రితమే 'హాయ్ నాన్న' కథ రాసుకున్నారు. ఈ కథ తొలుత నిర్మాతలకు, ఆ తర్వాత నానీకి నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. తండ్రీ కూతురు మధ్య ఉండే అనుబంధం, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం హిట్‌తో దూసుకెళుతోంది.

• • •

ఇంకా 'వినరో భాగ్యము విష్ణుకథ'తో మురళీ కిశోర్ అబ్బూరు, 'నరకాసుర'తో సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్, 'విమానం'తో శివ ప్రసాద్ యానాల, 'మిస్టర్ ప్రెగ్నెంట్'తో శ్రీనివాస్ వింజనంపాటి వంటి దర్శకులు హిట్ అందుకున్నారు. వీరితో పాటు మరికొందరు కొత్త దర్శకులు తమ ప్రతిభని నిరూపించుకునే ప్రయత్నం చేశారు.

యశ్ టాక్సిక్



● 'టాక్సిక్'లో యశ్

'కేజీఎఫ్' ఫేమ్ హీరో యశ్ నటించనున్న తాజా చిత్రానికి 'టాక్సిక్' అనే టైటిల్ ఖరారైంది. ఈ విషయాన్ని శుక్రవారం ఓ వీడియో ద్వారా యశ్ షేర్ చేశారు. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్‌లైన్. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఈ సినిమాను వెంకట్ కె. నారాయణ నిర్మించనున్నారు. 2025 ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. ''రెండు వేర్వేరు ప్రపంచాల కలయికగా ఈ చిత్రకథ ఉంటుంది'' అన్నారు గీతూ మోహన్‌దాస్. ''బలమైన భావోద్వేగాలకు మాస్, యాక్షన్ అంశాలను జోడించి ఈ కథ రెడీ చేయడానికి గీతూ కొంత టైమ్ తీసుకున్నారు'' అన్నారు వెంకట్ కె. నారాయణ.

చెన్నైలో స్కై థియేటర్స్ ఏర్పాటు చేస్తున్నాం

- నిర్మాత సి. కల్యాణ్



''దాదాపు 83 చిత్రాలను విజయవంతంగా చేశాం. అయితే రెండేళ్లుగా నా ఏకాగ్రత చెన్నైలో నిర్మిస్తున్న కల్యాణ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌పై ఉంది. ఈ పార్క్ ప్రారంభోత్సవం త్వరలో జరగనుంది. తమిళనాడు సీఎం స్టాలిన్, ఉదయ్‌నిధి స్టాలిన్‌గార్లు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు బాగా సపోర్ట్ చేశారు. తొలిసారిగా స్కై థియేటర్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాజెక్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని సినిమాలు నిర్మించడానికే వినియోగిస్తాను'' అని నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. నేడు (09.12.) ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా శుక్రవారం విలేకర్లతో కల్యాణ్ మాట్లాడుతూ– ''జగన్‌గారు ఇండస్ట్రీకి ఏమీ చేయలేదు.. ఏదో అలా చేశారని అంటున్నారు. మరి.. సినిమా టికెట్ ధరల గురించి చంద్రబాబు నాయుడుగారితో తొమ్మిదిసార్లు సమావేశాలు జరిపాం. ఆయన సానుకూలంగా జీవో ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. నేనెవర్నీ వ్యతిరేకించడం లేదు. చిరంజీవిగారితో పాటు మేమందరం ఏపీ సీఎం జగన్‌గారిని కలిసినప్పుడు, ఆయన సానుకూలంగా స్పందించారు. సినిమావాళ్లను వదులుకోనని, వైజాగ్‌లో స్థలాలు కేటాయిస్తానని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేయండని చెప్పారు'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''అవార్డుల వేడుక అంటే పరిశ్రమ అంతా ఒక ఫ్యామిలీలా హాజరవ్వాలి. కానీ ఇప్పుడు అవార్డు వచ్చినవారు తప్పితే మిగతా వారు ఇంట్లోనే కూర్చునే పరిస్థితి. అవార్డు తీసుకున్న ఆర్టిస్టు కూడా తనకి ఓ గౌరవమని భావించే పరిస్థితి లేదిప్పుడు. ఈ పరిస్థితుల్లో అవార్డు వేడుకలు ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమౌతోంది'' అని చెప్పుకొచ్చారు.

హారరా? థ్రిల్లరా?



● గోపీచంద్, రాంబాబు, రాజేశ్వరి చంద్రజ, భానుశ్రీ

భాను శ్రీ, సోనాక్షీ వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'కలశ'. కొండా రాంబాబు దర్శకత్వంలో శ్రీమతి రాజేశ్వరి చంద్రజ వాడపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన దర్శకుడు గోపీచంద్ మలినేని మాట్లాడుతూ–''కలశ ట్రైలర్ బాగుంది. ఈ సినిమా థ్రిల్లరా? లేక హారరా? అనే సందేహం కలిగేలా ట్రైలర్‌ను కట్ చేశారు. యూనిట్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు. ''కలశ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుంది. థియేటర్స్‌లో చూడండి'' అని యూనిట్ పేర్కొంది.

రహస్యాలెన్నో..



● శ్రీనివాస్ గోపిశెట్టి, ప్రియదర్శి

'కాలగర్భంలో కలిసిపోయిన మన తాంత్రిక శాస్త్రాన్ని తెరిస్తే అందులో ఊహకందని రహస్యాలెన్నో!' అనే వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'తంత్ర' సినిమా టీజర్. శ్రీహరి తమ్ముడి కొడుకు ధనుష్ రఘుముద్రి హీరోగా పరిచయం అవుతున్న ఈ సినిమాలో అనన్యా నాగళ్ల, సలోని, 'టెంపర్' శీను ఇతర ప్రధాన పాత్రధారులు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు. పి, రవి చైతన్య నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదలైంది. ''ఇందులో దుష్టశక్తి బారిన పడిన అమ్మాయి పాత్రలో అనన్య, తాంత్రికుడిగా 'టెంపర్ శీను', ఓ మిస్టీరియస్ పాత్రలో సలోని కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
304	68
69,826	20,969

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,350	▲	10
డోజోన్స్	36,143	▲	33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,554	▲	41
డాక్స్	16,759	▲	130
షాంఘై	2,969	▲	3
నికాయ్	32,308	▼	550

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)		
62,415	▼	47
బంగారం (22 క్యారెట్)		
62,166	▼	47
వెండి (కిలో)		
73,711	▼	117

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒక్కటి	82.95	83.97
£	బ్రిటన్ పౌండ్	ఒక్కటి	103.09	106.45
€	యూరో	ఒక్కటి	88.90	91.25
¥	జపాన్ ఎన్ (100)	ఒక్కటి	57.37	58.68
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒక్కటి	54.18	56.11
S$	సింగపూర్ డాలర్	ఒక్కటి	61.38	63.37
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.29	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.69	23.84
¥	చైనా యువాన్	పదింటికి	10.38	12.33

అయిదోసారీ అక్కడే..!

- 6.5 శాతంగా రెపో రేటు కొనసాగింపు
- ఆర్థిక వృద్ధి అంచనాలు 7 శాతానికి పెంపు
- ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలు
- ఫిబ్రవరి 6–8 మధ్య మరోసారి భేటీ

ద్రవ్యోల్బణంపై ఆహార ధరల ఎఫెక్ట్..

"సెప్టెంబర్ క్వార్టర్ వృద్ధి గణాంకాలు పటిష్టంగా ఉండి, అందర్నీ ఆశ్చర్యపర్చాయి. ఆహార ధరల్లో నెలకొన్న అనిశ్చితి రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణ అంచనాలపై గణనీయంగా ప్రభావం చూపవచ్చు. వేగంగా మారిపోయే ఆహార ధరల సూచీలన్నీ కూడా కీలక కూరగాయల రేట్ల పెరుగుదలను సూచిస్తున్నాయి. ఫలితంగా సమీప భవిష్యత్తులో రిటైల్ ద్రవ్యోల్బణం పెరగొచ్చు." – శక్తికాంత దాస్, ఆర్‌బీఐ గవర్నర్



ముంబై: ద్రవ్యోల్బణంపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో అంతా ఊహించినట్లే రిజర్వ్ బ్యాంక్ వరుసగా అయిదోసారీ కీలక వడ్డీ రేట్లను యథాతథంగా 6.5 శాతంగానే కొనసాగించాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న దేశం హోదాను నిలబెట్టుకుంటూ భారత్ మరింత వృద్ధి నమోదు చేయగలదని అంచనా వేసింది. అటు ఆస్పత్రులు, విద్యా సంస్థలకు యూపీఐ చెల్లింపుల పరిమితిని రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచింది. మరోవైపు, రికరింగ్ చెల్లింపుల ఈ–మ్యాండేట్ పరిమితిని రూ. 15 వేల నుంచి రూ. 1 లక్షకు పెంచాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 6–8 మధ్య ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ మళ్లీ సమావేశం అవుతుంది. ఆర్‌బీఐ నిర్ణయాలు అధిక వృద్ధి సాధనకు దోహదపడగలవని బ్యాంకర్లు, కార్పొరేట్లు వ్యాఖ్యానించగా .. రేటును తగ్గించి ఉంటే ప్రయోజనకరంగా ఉండేదని రియల్టీ రంగం అభిప్రాయపడింది. వచ్చే సమీక్షలోనైనా తగ్గించాలని కోరింది.

వివరాల్లోకి వెడితే.. బుధవారం నుంచి మూడు రోజుల పాటు సాగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షకు సంబంధించి మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం ప్రకటించారు. ప్రామాణిక రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై రిజర్వ్ బ్యాంక్ వసూలు చేసే వడ్డీ రేటు) 6.5%గా కొనసాగించాలని కమిటీలోని సభ్యులందరూ (ఆరుగురు) ఏకగ్రీవంగా తీర్మానించారు. ధరలను కట్టడి చేసే దిశగా 2022 మే నుంచి ఇప్పటివరకు ఆర్‌బీఐ రెపో రేటును 2.5% పెంచింది.



అంచనాల పెంపు సముచితమే..

ప్రథమార్ధంలో సాధించిన వృద్ధి, ఆ తర్వాత రెండు నెలల్లో (అక్టోబర్, నవంబర్) గణాంకాలన్నీ సానుకూల సంకేతాలనే ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో వృద్ధి అంచనాలను ఆర్‌బీఐ పెంచడం సముచితమే. – నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక మంత్రి



రేటు తగ్గించాల్సింది..

వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడం మంచి నిర్ణయమే. అయితే, ప్రస్తుతం స్థూల–ఆర్థిక పరిస్థితులు సానుకూలంగా ఉన్నందున రేటును తగ్గించి ఉంటే రియల్టీ రంగం, ఎకానమీకి గణనీయంగా ప్రయోజనం కలిగేది. – బొమన్ ఇరానీ, నేషనల్ ప్రెసిడెంట్, క్రెడాయ్



సానుకూల సంకేతాలు

ద్రవ్యోల్బణం స్థిర స్థాయిలో ఉంటూ, ఎకానమీ అధిక వృద్ధి సాధించే దిశగా ముందుకెడుతుందని పాలసీ స్పష్టమైన, సానుకూల సంకేతాలిస్తోంది. వరుసగా మూడో ఏడాది 7 శాతం వృద్ధిని సాధించే అవకాశాలను సూచిస్తోంది. – దినేష్ ఖారా, చైర్మన్, ఎస్‌బీఐ

యూపీఐ పరిమితులు పెంపు..

- ఆస్పత్రులు, విద్యా సంస్థలకు యూపీఐ ద్వారా జరిపే చెల్లింపుల పరిమితి రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంపు.
- మళ్లీ మళ్లీ చేసే (రికరింగ్) చెల్లింపులకు సంబంధించి ఈ–మ్యాండేట్ పరిమితి రూ. 15 వేల నుంచి రూ. 1 లక్షకు పెంపు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలు 6.5 శాతం నుంచి 7%కి పెంపు. జీడీపీ డిసెంబర్ త్రైమాసికంలో 6.5%గా, మార్చి క్వార్టర్‌లో 6 శాతంగా ఉంటుందని అంచనా.
- వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం క్యూ3లో 5.6%గా, క్యూ4లో 5.2%గా ఉండొచ్చని అంచనా. 2024–25 జూన్ క్వార్టర్‌లో ఇది 5.2 శాతంగా, సెప్టెంబర్ త్రైమాసికంలో 4 శాతంగా, డిసెంబర్ క్వార్టర్‌లో 4.7 శాతంగా ఉండవచ్చు.
- డేటా భద్రత, గోప్యతను మరింతగా పెంచే దిశగా ఆర్థిక రంగం కోసం ఆర్‌బీఐ క్లౌడ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేనుంది.
- ఆర్థిక రంగ పరిణామాలను మరింత మెరుగ్గా అర్థం చేసుకునేందుకు వీలు కల్పించేలా ''ఫిన్‌టెక్ రిపాజిటరీ''ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. 2024 ఏప్రిల్‌లో లేదా అంతకన్నా ముందే రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ దీన్ని అందుబాటులోకి తేనుంది. ఫిన్‌టెక్ సంస్థలు స్వచ్ఛందంగా సంబంధిత వివరాలను రిపాజిటరీకి సమర్పించవచ్చు.
- డిసెంబర్ 1 నాటికి విదేశీ మారక నిల్వలు 604 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే రూపాయి మారకంలో ఒడిదుడుకులు తక్కువగానే ఉన్నాయి.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో 'జీక్యూజీ'కి 4.7 శాతం వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ జీక్యూజీ పార్ట్‌నర్స్ 4.7 శాతం వాటా చేజిక్కించుకుంది. బ్లాక్ డీల్స్ ద్వారా ఒక్కొక్కటి రూ.59.09 చొప్పున సుమారు 29 కోట్ల షేర్లను రూ.1,672 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది.



జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో శుక్రవారం మొత్తం 3 ప్రధాన బ్లాక్ డీల్స్ ద్వారా ఒక్కో షేరు రూ.58.2–59.25 చొప్పున 12.6% వాటాలు చేతులు మారాయి. వీటి మొత్తం విలువ రూ.4,465 కోట్లు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో వాటా కొనుగోలు చేసిన కంపెనీల్లో నోమురా ఇండియా ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, స్టిక్టింగ్ డిపాజిటరీ ఏపీజీ ఎమర్జింగ్ మార్కెట్స్ ఈక్విటీ పూల్ సైతం ఉన్నాయి. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో తనకున్న మొత్తం 7.27 శాతం వాటాలను యూకే కంపెనీ ఏఎస్ఎన్ ఇన్వెస్ట్‌మెంట్స్ విక్రయించింది. ఏ/డీ ఇన్వెస్టర్స్ ఫండ్, వరేనియం ఇండియా అపార్చునిటీ ఫండ్ సైతం వాటాలను విక్రయించాయి.

అన్‌లిమిటెడ్ 'రెడ్ అలర్ట్ సేల్'



న్యూఢిల్లీ: అన్‌లిమిటెడ్ స్టోర్స్ 'రెడ్ అలర్ట్ సేల్ ఆఫర్'ను ప్రకటించింది. అన్ని బ్రాండెడ్ వస్త్రాలపై 50% ఫ్లాట్ డిస్కౌంట్ అందిస్తుంది. అలాగే రూ.3వేల షాపింగ్‌పై అంతే విలువైన ఉత్పత్తులు ఉచితంగా పొందవచ్చు. దేశవ్యాప్తంగా 87 స్టోర్లలో జనవరి 1 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఫ్యాషన్ ఇష్టపడే ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

మార్చికల్లా అదే రోజు సెటిల్‌మెంట్

సెబీ చీఫ్ మాధవీ పురి బచ్




న్యూఢిల్లీ: కొత్త ఏడాది(2024)లో ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లలో లావాదేవీ చేపట్టిన రోజునే సెటిల్‌మెంట్ పూర్తికానుంది. స్టాక్ ఎక్స్ఛేంజీలలో మార్చికల్లా అదే రోజు సెటిల్‌మెంట్‌కు తెరతీయనున్నట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చీఫ్ మాధవీ పురి బచ్ తాజాగా వెల్లడించారు. వెరసి 2024 మార్చి నుంచి టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) నిర్వహించిన ప్రపంచ ఆర్థిక విధానాల వేదిక 2023లో బచ్ పేర్కొన్నారు. ఈ బాటలో ఇప్పటికే సెబీ స్టాక్ లావాదేవీల సెటిల్‌మెంట్ గడువులను తగ్గిస్తూ వస్తోంది. దీంతో ప్రస్తుతం లావాదేవీ చేపట్టిన మరుసటి రోజు (టీప్లస్1) సెటిల్‌మెంట్ అమలవుతోంది. దీన్ని మరో 3 నెలల్లోగా ఒకే రోజుకు పరిమితం చేయనున్నట్లు బచ్ చెప్పారు. కాగా.. టీప్లస్‌జీరో సెటిల్‌మెంట్ అమలు తదుపరి అప్పటికప్పుడు(ఇన్‌స్టేనియస్) సెటిల్‌మెంట్‌ను తీసుకురానున్నట్లు వెల్లడించారు. అయితే ఇది ఆప్షనల్‌గా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-12-2023	
విశాఖ	550–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
8-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535–00
వరంగల్	537–00
రిటైల్ ధర	5.95

ఆర్‌బీఐ అండతో మళ్లీ రికార్డుల మోత

- మెప్పించిన రిజర్వ్ బ్యాంకు ద్రవ్య పాలసీ
- కొత్త గరిష్టాలకు సెన్సెక్స్, నిఫ్టీ
- తొలిసారి 21,000ను తాకిన నిఫ్టీ



ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి మెప్పించడంతో స్టాక్ మార్కెట్లో మళ్లీ రికార్డుల మోత మోగింది. రిజర్వ్ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) వృద్ధి రేటు అంచనాలు పెంచడం, వరుసగా అయిదోసారి కీలక వడ్డీ రేట్ల జోలికెళ్లకపోవడం ఇన్వెస్టర్లకు ఉత్సాహాన్నిచ్చాయి. ఫలితంగా వడ్డీ రేట్ల ఆధారిత బ్యాంకులు, ఫైనాన్స్ సర్వీసులు, రియల్టీ షేర్లకు భారీ డిమాండ్ లభించడంతో సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు నమోదు నమోదు చేశాయి. సెన్సెక్స్ 304 పాయింట్లు లాభపడి 69,826 వద్ద వద్ద, నిఫ్టీ 68 పాయింట్లు పెరిగి 20,969 వద్ద స్థిరపడ్డాయి. ఉదయం సూచీలు స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి కమిటీ సమీక్షా సమావేశ నిర్ణయాలు వెల్లడి(ఉదయం 10 గంటలు) తర్వాత కొనుగోళ్లు మరింత పెరిగాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 372 పాయింట్లు బలపడి 69,894 వద్ద, నిఫ్టీ 105 పాయింట్లు పెరిగి తొలిసారి 21 వేల స్థాయిపై 21,006 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి.

- బ్లాక్ డీల్ ద్వారా 75.81 కోట్ల షేర్లు చేతులు మారినట్లు డేటా వెల్లడి కావడంతో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ షేరు 12% లాభపడి రూ.69 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



అర్షిన్

భారత్ శుభారంభం

ఆసియా కప్ అండర్–19 పురుషుల క్రికెట్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. అఫ్గానిస్తాన్‌తో దుబాయ్‌లో శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్లతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 173 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో అర్షిన్ కులకర్ణి (3/29), నమన్ తివారి (2/30), రాజ్ లింబాని (3/46) రాణించారు. అనంతరం భారత్ 37.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (70 నాటౌట్; 4 ఫోర్లు), ముషీర్ ఖాన్ (48 నాటౌట్; 3 ఫోర్లు) ఆకట్టుకున్నారు.

సెమీస్‌లో పంకజ్ అద్వానీ

జాతీయ బిలియర్డ్స్–స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భాగంగా 6–రెడ్ స్నూకర్ ఈవెంట్‌లో ప్రపంచ చాంపియన్ పంకజ్ అద్వానీ (పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. చెన్నైలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో పంకజ్ 6–4 ఫ్రేమ్‌ల తేడాతో బ్రిజేశ్ దమానిపై విజయం సాధించాడు.

దబంగ్ ఢిల్లీ బోణీ



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు గెలుపు బోణీ చేసింది. బెంగళూరు బుల్స్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 38–31తో విజయం సాధించింది. ఢిల్లీ తరఫున నవీన్ అత్యధికంగా 13 పాయింట్లు స్కోరు చేయగా... ఆశు మలిక్ తొమ్మిది పాయింట్లు సాధించాడు. బెంగళూరు తరఫున భరత్ 12 పాయింట్లు సంపాదించాడు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 43–32తో యు ముంబాను ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో హరియాణా స్టీలర్స్; యూపీ యోధాస్‌తో తెలుగు టైటాన్స్ తలపడతాయి.

ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
గుజరాత్ జెయింట్స్	4	3	1	0	16
పట్నా పైరేట్స్	2	2	0	0	10
పుణేరి పల్టన్	2	2	0	0	10
బెంగాల్ వారియర్స్	2	1	0	1	8
యూపీ యోధాస్	2	1	1	0	6
యు ముంబా	3	1	2	0	6
తమిళ్ తలైవాస్	1	1	0	0	5
దబంగ్ ఢిల్లీ	2	1	1	0	5
జైపూర్ పింక్ పాంథర్స్	2	0	1	1	4
బెంగళూరు బుల్స్	3	0	3	0	3
తెలుగు టైటాన్స్	2	0	2	0	1
హరియాణా స్టీలర్స్	1	0	1	0	0

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

165 మంది ప్లేయర్లు... 30 స్థానాలు!

- నేడు డబ్ల్యూపీఎల్ మినీ వేలం
- చమరి అటపట్టు, డాని వైట్‌లపై దృష్టి
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం





డాని వైట్



చమరి

ముంబై: ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్ (2024) కోసం మినీ వేలానికి రంగం సిద్ధమైంది. వేర్వేరు దేశాలకు చెందిన 165 మంది మహిళా క్రికెటర్లు ఈ లీగ్ వేలంలో పాల్గొంటున్నారు. అయితే డబ్ల్యూపీఎల్‌లో ఉన్న ఐదు జట్ల కోసం కేవలం 30 స్థానాలు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. వీటిలో గరిష్టంగా 9 మంది విదేశీ క్రీడాకారిణులను ఎంచుకునే అవకాశం ఉంది. గత సీజన్‌లో విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్‌తో పాటు రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్, మూడో స్థానంతో ముగించిన యూపీ వారియర్స్ దాదాపు అదే జట్టును అట్టి పెట్టుకొని తక్కువ మందిని మాత్రమే విడుదల చేశాయి. దాంతో ఆర్‌సీబీ, గుజరాత్ టీమ్‌లలోనే ఎక్కువ ఖాళీలు ఉన్నాయి. ఒక్కో జట్టులో గరిష్టంగా 18 మంది ప్లేయర్లు ఉండాలి. ఐదు జట్లకు కలిపి 90 మంది కాగా అన్ని టీమ్‌లలోనూ కలిపి ప్రస్తుతం 60 మంది ప్లేయర్లు ఇప్పటికే ఉన్నారు. ఒక్కో జట్టు ప్లేయర్ల కోసం గరిష్టంగా రూ. 13.35 కోట్లు కేటాయించాల్సి ఉండగా మినీ వేలం కోసం ప్రస్తుతం అత్యధికంగా గుజరాత్ వద్ద రూ. 5.95 కోట్లు ఉన్నాయి. వేలంలో అందుబాటులో ఉన్న అగ్ర శ్రేణి ప్లేయర్లలో ప్రధానంగా ఇద్దరిపై అందరి దృష్టి నిలిచింది. శ్రీలంకకు చెందిన చమరి అటపట్టు, ఇంగ్లండ్ స్టార్ డాని వైట్ వేలంలో ఎక్కువ మొత్తం పొందే అవకాశం ఉంది. అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో పాటు వీరి అంతర్జాతీయ అనుభవం డబ్ల్యూపీఎల్‌లో కీలకం కానుంది. వీరిద్దరు రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలో నిలిచారు. వీరితో పాటు గత సీజన్ ఆడి జట్లు వదిలేసుకున్న తర్వాత మళ్లీ వేలంలో నిలిచిన ప్లేయర్లలో అనాబెల్ (ఆస్ట్రేలియా), షబ్నిమ్ (దక్షిణాఫ్రికా), దేవిక వైద్య (భారత్), తారా నోరిస్ (అమెరికా), సారా బ్రైస్ (స్కాట్లాండ్) చెప్పుకోదగ్గవారు. ఇంకా భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించని యువ క్రీడాకారిణుల్లో ఉమా, మన్నత్ లాంటివారిపై వేలంలో జట్లు ఆసక్తి చూపించవచ్చు.

జట్టు	ఖాళీల సంఖ్య	మిగిలిన మొత్తం
ఢిల్లీ	3	రూ. 2.25 కోట్లు
గుజరాత్	10	రూ.5.95 కోట్లు
ముంబై	5	రూ.2.10 కోట్లు
బెంగళూరు	7	రూ.3.35 కోట్లు
యూపీ	5	రూ.4 కోట్లు
మొత్తం	30	రూ.17.65 కోట్లు

గెలిస్తేనే... సిరీస్‌లో నిలిచేది

- నేడు ఇంగ్లండ్ మహిళల జట్టుతో భారత్ రెండో టి20
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం



హర్మన్‌ప్రీత్, హీతెర్ నైట్

ముంబై: మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ గెలవాలన్నా... రేసులో నిలవాలన్నా భారత మహిళల జట్టు ఈ రెండో మ్యాచ్ కచ్చితంగా గెలవాల్సిందే. లేదంటే ఇంకో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ఇంగ్లండ్ సొంతం చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ బృందం కీలకమైన మ్యాచ్‌లో సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. గతితప్పిన బౌలింగ్‌ను, నిలకడ లోపించిన టాపార్డర్‌ను మెరుగుపర్చుకొని ఇంగ్లండ్‌ను ఓడించాలనే లక్ష్యంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది. తొలి టి20లో ఓపెనర్ షఫాలీ వర్మ తప్ప ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోరే చేయలేదు. హిట్టర్లు స్మృతి మంధాన, వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ గత మ్యాచ్ వైఫల్యాన్ని అధిగమించి తాజాగా ఈ మ్యాచ్‌లో చెలరేగితే భారత బ్యాటింగ్ కష్టాలు తీరతాయి. ఎందుకంటే మిడిలార్డర్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఆదుకోగలదు. జట్టు మేనేజ్‌మెంట్ బెంగ ఏదైనా ఉందంటే అది బౌలింగే! సీమర్ రేణుక సింగ్ మినహా మొత్తం బౌలింగ్ విభాగం చేతులెత్తేసింది. దీప్తి శర్మ, పూజ ఒక్క వికెట్ తీయకపోగా... పరుగుల్ని అతిగా సమర్పించుకున్నారు. వికెట్లు తీసిన శ్రేయాంక పాటిల్, సైకా ఇషాక్‌లు కూడా పరుగుల వేగాన్ని అడ్డుకోలేకపోయారు. మరోవైపు తొలిమ్యాచ్‌లో శుభారంభం చేసిన ఇంగ్లండ్ అమ్మాయిల బృందం వరుస విజయంతో ఏకంగా సిరీస్‌పైనే కన్నేసింది. బ్యాటర్లు, బౌలర్లు ఫామ్‌లో ఉండటంతో ఇంగ్లండ్ ఆత్మ విశ్వాసంతో ఉంది. ఇక వేదిక (వాంఖెడె) ఒక్కటే కావడంతో పిచ్ గత మ్యాచ్‌కు భిన్నంగా ఉండదు. బ్యాటింగ్‌కు కలిసొచ్చే వికెట్ కావడంతో బౌలర్లకు కఠిన పరీక్ష తప్పదు.

సెమీస్‌లో మాళవిక



గువాహటి: గువాహటి మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో మాళవిక 21–12, 21–16తో కరుపతెవన్ లెట్షానా (మలేసియా)పై గెలుపొందింది. మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) ద్వయం 22–20, 21–16తో జెసితా పుత్రి మియాన్‌తారో–ఫెబి సెతియనిన్‌గ్రమ్ (ఇండోనేసియా) జంటను ఓడించి సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో దొడ్డవరపు అచ్యుతాదిత్య రావు–వెంకట హర్షవర్ధన్ (భారత్) ద్వయం 9–21, 14–21తో చూంగ్ హోన్ జియాన్–హైకాల్ (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ పిచ్ 'యావరేజ్'



దుబాయ్: వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు ఆతిథ్యమిచ్చిన అహ్మదాబాద్ స్టేడియం పిచ్ సాధారణంగా ఉందని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తేల్చింది. ఐసీసీ ప్రమాణాల ప్రకారం దీనికి 'యావరేజ్' రేటింగ్ ఇచ్చింది. అయితే అవుట్‌ఫీల్డ్ మాత్రం అద్భుతంగా ఉందని కితాబిస్తూ 'వెరీ గుడ్' రేటింగ్ ఇచ్చింది. నవంబర్ 19న జరిగిన వరల్డ్‌కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా ఆరు వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. భారత్ 240 పరుగులకే పరిమితమైన ఈ పిచ్‌పై ఆ తర్వాత ఆసీస్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేసింది. ఫైనల్ మ్యాచ్‌కు మ్యాచ్ రిఫరీగా వ్యవహరించిన జింబాబ్వేకు చెందిన ఆండీ పైక్రాఫ్ట్ ఈ నివేదిక అందించారు. మరోవైపు ఆసీస్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో సెమీస్ నిర్వహించిన కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ పిచ్‌ను కూడా 'యావరేజ్'గానే పేర్కొన్న ఐసీసీ... భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి సెమీస్ జరిగిన ముంబై వాంఖెడే పిచ్‌కు మాత్రం 'గుడ్' రేటింగ్ అందించింది.



కొరియాపై భారత్ గెలుపు

సాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల అండర్–21 ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టు 9–10వ స్థానాల కోసం పోటీపడనుంది. 9–13 స్థానాల మధ్య వర్గీకరణ మ్యాచ్‌లో భాగంగా దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున రోప్ని కుమారి (23వ ని.లో), ముంతాజ్ ఖాన్ (44వ ని.లో), అన్ను (46వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. కొరియా జట్టుకు జియున్ చోయ్ (19వ ని.లో) ఏకైక గోల్ సాధించింది. 9–10 స్థానాల కోసం శనివారం అమెరికా జట్టుతో భారత్ ఆడుతుంది.



ఫిలిప్స్

న్యూజిలాండ్‌ను ఆదుకున్న ఫిలిప్స్

తొలి ఇన్నింగ్స్‌లో 180 ఆలౌట్

మిర్పూర్: బౌలర్లు, వాన చినుకులు శాసిస్తున్న రెండో టెస్టులో న్యూజిలాండ్‌ను గ్లెన్ ఫిలిప్స్ (72 బంతుల్లో 87; 9 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. దీంతో శుక్రవారం మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 55/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 37.1 ఓవర్లలో 180 పరుగుల వద్ద ఆలౌటైంది. తద్వారా 8 పరుగులతో స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. 5 పరుగుల వ్యక్తిగత స్కోరుతో ఆట ఆరంభించిన ఫిలిప్స్‌కు సహచరులు మిచెల్ (18), సాన్‌ట్నర్ (1), జేమీసన్ (20), కెప్టెన్ సౌతీ (14)ల నుంచి సహకారం తక్కువే అయినా... వన్డేను తలపించే ధాటిని కొనసాగించడంతో కివీస్‌కు ఆ కాస్త ఆధిక్యం లభించింది. మెహదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లామ్ చెరో 3 వికెట్లు, నయీం, షోరిఫుల్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఆతిథ్య బంగ్లాదేశ్ ఆట నిలిచే సమయానికి 8 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 38 పరుగులు చేసింది. ప్రస్తుతం బంగ్లా 30 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ టెస్టుకు రెండు రోజుల ఆట మిగిలుంది. కాగా... ఈ రెండు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్ నెగ్గిన బంగ్లా 1–0తో ఆధిక్యంలో ఉంది.

రెండో స్థానంలో కీర్తిక

సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తొమ్మిదో రౌండ్ తర్వాత తెలంగాణ అమ్మాయి బి.కీర్తిక 7.5 పాయింట్లతో అక్షయ సాథి (కర్ణాటక)తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉంది. శుక్రవారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌లో కీర్తిక 48 ఎత్తుల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నైనా గొర్లిపై గెలిచింది. నైనా గొర్లి ఏడు పాయింట్లతో మరో నలుగురితో కలిసి ఉమ్మడిగా మూడో స్థానంలో ఉంది. 8.5 పాయింట్లతో శ్రేయ (మహారాష్ట్ర) టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కుర్రాళ్లు చల్లా సహర్ష, శ్రీరామ్ ఆదర్శ్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.